

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

కరీంనగర్

fb.com/vaartha Digital

12-11-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 282 పేజీలు: 8+16 వెల: 6.50

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు తీవ్ర అస్వస్థత 3

పరివర్తన రాజనీతి పార్టీ ప్రకటించిన విజయసాయి 7

లంచావతారులకు గొడుగు?



సర్కార్ వద్ద పెండింగ్‌లో 300 మంది

అవినీతి కేసుల్లో చిక్కినా అంతలోనే మళ్లీ పోస్టింగ్‌లు

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: ప్రభుత్వంలోని కీలక విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు లక్షలాది రూపాయలు లంచాలు తీసుకుంటూ ఎసిబికి పట్టుబడుతున్నా వారికి శిక్షలు కానరావడం లేదు. ఒకటికి పైగా కసుల్లో నిందితులుగా వున్న 300 మందిని కోర్టులో విచారించేందుకు అనుమతి ఇవ్వాలని ఎసిబి పంపిన నివేదిక సర్కారు వద్ద ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఎందుకు వుందనేది తెలియరావడం లేదు. మరోవైపు ఎసిబికి పట్టుబడుతున్న బడా అక్రమార్కులు స్వల్ప వ్యవధిలోనే మళ్లీ ముఖ్యమైన విభాగాల్లో ఎలా పోస్టింగులు పొందుతున్నారనేది తెలియ రావడం లేదు. ఓవైపు అక్రమార్కుల భరతం పడతామని సర్కారు పదే పదే చెబుతుండగా క్షేత్రస్థాయిలో దానికి విరుద్ధంగా జరుగుతుండంపై విమర్శలు వస్తున్నాయి. మల్కాజిగిరి >>2

ఎసిబి వలలో పడినా పడని శిక్షలు



ఎరువుల సబ్సిడీ 62,370 కోట్లు

5

ముద్రా క్రెడిట్ గ్యారంటీ నిధికి 5 వేల కోట్లు

'స్టాండప్ ఇండియా'కు రుణాలకు రూ.4,111 కోట్లు

'యుగే యుగీన్ భారత్' మ్యూజియానికి రూ.3,230 కోట్లు

కేంద్ర కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

నేటి నుంచి భారీగా

భారత్ సమ్మిట్



70 పైగా దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు

ప్రజాస్వామ్య రక్షణ, అలీన విధానాలే సమ్మిట్ అజెండా: డి. సిఎం భట్టి

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: ఆర్థిక, రాజకీయ, సామాజిక విధానాలపై ప్రపంచానికి దిశా నిర్దేశం చేసేందుకు హైదరాబాద్ అంతర్జాతీయ వేదిక కానుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న హింస, విద్వేష రాజకీయాలు, విభజన ధోరణుల నేపథ్యంలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఈ నెల 12, 13, 14 తేదీల్లో భారత్ సమ్మిట్-2026ను నిర్వహిస్తోందన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్యవాదులు, ఉదారవాదులు, ప్రగతిశీల భావాలు కలిగినవారిని ఒక వేదికపైకి తీసుకొచ్చి, ప్రపంచానికి నూతన దిశానిర్దేశం చేయాలనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు 70కిపైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన నిపుణులు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఇప్పటికే తమ అంగీకారం తెలిపారన్నారు. అలీన విదేశాంగ విధానం, మిశ్రమ ఆర్థిక విధానాలు దేశానికి కాకుండా ప్రపంచ దేశాలకు కూడా నేటి పరిస్థితుల్లో ఎంతో అవసరమని వెల్లడించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఉన్నట్లే ప్రతిపక్షం కూడా ఉండాలని, ఈ రెండూ ప్రజాస్వామ్య వ్యవస్థకు రెండు కీలక స్తంభాలని స్పష్టం చేశారు. దేశం స్వశక్తితో ఎదగడమే కాకుండా ప్రపంచంలోని ప్రగతిశీల, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నాయకత్వం వహించాలన్న నెహ్రూ దూరదృష్టి దేశానికి బలమైన పునాదులు వేసిందన్నారు. పంచవర్ష ప్రణాళికలు, ఇతర ఆర్థిక విధానాలు దేశాన్ని బలోపేతం చేశాయని, నేడు ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు గుర్తింపు రావడంలో నెహ్రూ విధానాల పాత్ర కీలకమని వివరించారు. ప్రతిపక్షాల ఆలోచనలు, విధానాలను వ్యతిరేకించవచ్చే తప్ప, వారిని శత్రువులుగా పరిగణించడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్య >>2

మూసీ ప్రక్షాళన ఆపలేరు

ఎవరెంత అడ్డుపడినా త్వరలోనే పనులు ప్రారంభం

హైదరాబాద్‌లోని చెరువులను పునరుద్ధరిస్తా

అత్యంత సుందరంగా మారిన తమ్మిడికుంట

చెరువును ప్రారంభించిన సిఎం రేవంత్

ఈ చెరువు వద్ద షూటింగ్ చేస్తా: నాగార్జున



బుధవారం తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన అనంతరం నాగార్జునను సన్మానిస్తున్న సిఎం రేవంత్

హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 11 ప్రభాతవార్త: హైదరాబాద్‌కు మరోపేరు లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని, విమానంలో నుంచి చూస్తే నగరంలో ఉన్న చెరువులు, రాళ్ల గుట్టల అందాలు కనువిందు చేస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నగరం చుట్టూ శిల్పులు చెక్కని సహజసిద్ధమైన రాతి శిల్పాలు, సహజ శిలా నిర్మాణాలు ఎన్నో కనిపిస్తాయన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవం కోసం 21 కిలో మీటర్ల పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మాదాపూర్ హైటెక్‌సిటీలో ఉన్న తమ్మిడికుంట చెరువును హైడ్రా ఆధ్వర్యంలో సుందరీకరించగా, బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ్మిడి కుంట చెరువు విస్తీర్ణాన్ని 14 ఎకరాల స్థలాన్ని 30 ఎకరాలకు విస్తరించామంటే హీరో నాగార్జున వంటి వారు ముందుకు వచ్చి భూమి అప్పగించారని గుర్తు చేశారు. హీరో నాగార్జున సినిమాల్లోనే హీరో కాదని, నిజజీవితంలో సైతం హీరో వంటి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. హైదరాబాద్ నగరానికి వరంగా ఉన్న చెరువులు గత ప్రభుత్వాలు, ప్రజల నిర్లక్ష్యం కారణంగా 50 శాతం కనుమరుగయ్యాయని వాపోయారు. చెరువుల కబ్జాలకారణంగా నేడు నగరంలో చిన్నపాటి వర్షకురిసిందంటే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, చెరువుల్లోకి చేరాల్సిన వరద నీరు రహదారులమీద నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభిస్తుందన్నారు. నిళ్ల నివాసాలను మనం ఆక్రమించుకుంటే వర్షాలు వచ్చినప్పుడు నీళ్లు మనల్ని ఆక్రమించుకుంటున్నాయని అన్నారు. ఇసా, మూసా నదులు పొంగి వేలాది మంది చనిపోతే నాటి నిజాంనవాబు దార్శనికంగా ఆలోచించి ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో ఉస్మాన్ >>2

వచ్చే యేడాది నుంచి ప్లస్-2 విధానం

బోధన సిబ్బంది ప్రయోజనాలకు ఎలాంటినష్టం రాదు

వర్సిటీ సిబ్బంది నియామకాల ప్రక్రియ వేగవంతం

విద్యాశాఖ సమీక్షలో సిఎం

7

దళితుల ఓట్లు కొల్లగొడుతున్న మోడీ సర్కార్

తెలంగాణ కారు ఢిల్లీలో కమలంలా మారుతోంది

మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో సిఎం రేవంత్



హైడ్రా రంగనాథ్‌ను కోర్టులో హాజరు పరచండి

డిజిపికి హైకోర్టు ఆదేశం

మేడ్చల్ కలెక్టర్‌పైనా హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్,నవంబరు11,ప్రభాతవార్త: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు షాక్ ఇచ్చింది. కోర్టు ధిక్కారణ నేరం కింద రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్‌ను హైకోర్టు ముందు హాజరు పరచవలసిందిగా డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను వచ్చే (17వ తేదీ) మంగళవారం కోర్టులో హాజరు పరచాలని డీజీపీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆయనతో పాటు శంషాబాద్ తహసీల్దార్‌ను కూడా కోర్టు ముందు హాజరు పరచాలని ఆదేశించింది. కోర్టు >>2

సాగునీటికి ఇక మహర్దశ



సమ్మక్క సారలక్క ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

సీతమ్మ సాగర్ పనులు పునఃప్రారంభానికి కసరత్తు

సీతారామ ఎత్తిపోతలు పనులు వేగవంతం

మంత్రి తుమ్మలతో కలిసి సమీక్ష జరిపిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 11,ప్రభాతవార్త: సమ్మక్క సారలక్క ప్రాజెక్టుతోపాటు ఖమ్మం జిల్లాలోని పలు ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం బీఆర్ అంబెద్కర్ సచివాలయంలో ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో సమావేశమై గోదావరి ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపడం, అసంపూర్తి పనులను పూర్తి చేయడం కొత్త ప్రతిపాదనలకు అనుమతులు సాధించడం వరద ముప్పు నుంచి పట్టణాలు, గ్రామాలకు రక్షణ కల్పించడంతోపాటు చెరువులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో సాగునీటి రంగానికి సంబంధించిన కీలక అంశాలపై రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమై సమగ్రంగా చర్చించారు. రెండు జిల్లాలకు సంబంధించి మొత్తం 15 అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న అవరోధాలు, ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అనుమతులు, నిధుల కేటాయింపులు, వరద రక్షణ పనులు, చెరువుల పునరుద్ధరణ తదితర అంశాలను మంత్రి వివరించారు. రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు ఖమ్మం నగరానికి తాగునీటి భద్రత కల్పించడం, మున్నేరు వరద ముప్పును తగ్గించడం, చెరువులను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.సీతమ్మసాగర్ పనుల పునఃప్రారంభానికి కసరత్తుభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యంత కీలకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట పనులు ఎన్‌జిటి కేసు కారణంగా నిలిచిపోయిన నేపథ్యంలో వాటిని తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను మంత్రి తుమ్మల ప్రస్తావించారు. పర్యావరణ అనుమతుల సాధన కోసం ఎపిటిఆర్ఐ, హైదరాబాద్ ద్వారా ఈ నెల 9న పారివేశ్ పోర్టల్‌లో ప్రతిపాదనలు సమర్పించినట్లు వివరించారు. ఇఏసి కన్వీనర్ వై.పి.సింగ్‌తో సంప్రదింపులు జరిపి పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైన క్లియరెన్స్‌లు సాధించి ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి మార్గం సుగమం చేయాలని కోరారు.సీతారామ పనులకు వేగం పెంచాలిసీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన జూలూరుపాడు టన్నెల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే పథకంలోని ప్యాకేజీ11 పరిధిలో పంప్‌హౌస్ 4 నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వివరిస్తూ, వాటిని >>2



బుధవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న మంత్రి పొన్నం

జిహెచ్ఎంసికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు స్వీకరించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,నవంబరు11,ప్రభాతవార్త: స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసీ) జాతీయ అవార్డును అందుకుంది. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు.స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ జాతీయ గుర్తింపు లభించింది. నగరంలో పారిశుద్ధ్య >>2

చలి పిడికిలిలో వణుకుతున్న జనం



15° దిగువకు కనిష్ట ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు వేగంగా మారుతున్న నేపథ్యంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉత్తర, వాయవ్య దిశల నుంచి వీస్తున్న పొడి, చల్లని గాలుల ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. ప్రణాళికా సంఘం గణాంకాల ప్రకారం రాష్ట్రంలోనే అత్యల్పంగా నిర్మల్ జిల్లా కుబీర్‌లో 14.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని 21కి పైగా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే దిగువకు చేరాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వెస్ట్ >>2

హామీలను తుంగలో తొక్కిన రేవంత్ సర్కార్

రైతు బంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత కెసిఆర్‌దే: నిర్మల్ రైతు గర్జన సభలో కెటిఆర్

రైతు ఆశలపై నీళ్లు



నిర్మల్, నవంబరు 11, ప్రభాతవార్త: రైతు సంక్షేమాన్ని విస్మరించి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం, రైతుబీమా, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు, సాగునీటి సదుపాయాలు కల్పించి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశామని చెప్పారు. రైతుల అప్పుల బాధలు తీర్చి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో కెసిఆర్ అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. బుధవారం నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు గర్జన సభలో కెటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముందు రైతులకు ఎన్నో హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటి అమలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులను ప్రశ్నించాలని కెటీఆర్ అన్నారు. రైతుకు పెట్టుబడి సాయం అందించడం నుంచి పంటకు గిట్టుబాటు ధర కల్పించడం వరకు ప్రభుత్వ బాధ్యత ఎంతో కీలకమన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం రైతులకు అందించిన పథకాలు, ప్రస్తుత ప్రభుత్వ పనితీరును రైతులు బేరీజు వేసుకోవాలని కోరారు. రైతు అప్పుల ఊబి నుంచి బయటపడాలనే లక్ష్యంతో కెసిఆర్ రైతుబంధు >>2



పశ్చిమ బెంగాల్ దక్షిణ దినాజ్‌పూర్ భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వద్ద 'భాయ్ దూజ్' సందర్భంగా జవాన్లకు తిలకం దిద్దుతున్న బిఎస్ఎఫ్ మహిళా సిబ్బంది

చలి పిడికిలిలో వణుకుతున్న జనం

>> మారేడ్‌పల్లిలో 15.2 డిగ్రీలు, షామీర్‌పేట దేవరయంజల్‌లో 15.1 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో 14.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనూ చలి పంజా విసురుతోంది. కాగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 3 డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం (ఐఎండీ) వెల్లడించింది. పలు ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 11 నుంచి 12 డిగ్రీల వరకు పడిపోవచ్చని అంచనా వేస్తూ హెచ్చరికలు జారీ చేసింది. పగలు ఎండ.. రాత్రి వణుకు: పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31 నుంచి 32 డిగ్రీల మధ్య సాధారణంగానే నమోదవుతున్నప్పటికీ, చల్లటి గాలులు వీస్తుండటంతో వాతావరణంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. సాయంత్రం 6 గంటల నుంచే చలి మొదలై తెల్లవారుజామున 7 గంటల వరకు తీవ్ర రూపం దాలుస్తోంది. దీంతో జనం బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. ఇక ఉదయం వేళల్లో రహదారులపై దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులు, ముఖ్యంగా హైవేలపై ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

13న బంగాళాఖాతంలో అల్పపీడనం

దక్షి ణ అండమాన్ సముద్రం,దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవ ర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్త రించి ఉంది. దీని ప్రభావంతో ఈ నెల 13న ఆగ్నేయ బంగాళాఖాత ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది వాయువ్య దిశగా పయనిస్తూ ఆ తరువాత 24 గంటల్లో మరింత బలపడి సుస్పష్టమైన అల్పపీడనంగా మారే అవ కాశం ఉంది. ఆ తర్వాత ఆదివారం నాటికి అదే ప్రాంతంలో వాయు గుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇది ఏటువైపు పయనిస్తుందనే అంశంపైస్పష్టత రానుందని తెలిపారు.

జిహెచ్ఎంసికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

>> నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం వంటి పది ప్రధాన అంశాల ఆధారంగా నిర్వహించిన మూల్యాంకనంలో జిహెచ్ఎంసి తన పనితీరును ప్రదర్శించింది. స్వచ్ఛతలో హైదరాబాద్ ప్రస్థానం:- 2017లో హైదరాబాద్‌కు ఓడీఎఫ్ హోదా లభించింది. 2019లో ఓడీఎఫ్++ హోదా సాధించింది. 2021లో తెలంగాణలోనే తొలిసారిగా వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ పొందిన స్థానిక సంస్థగా జిహెచ్ఎంసి గుర్తింపు పొందింది. 2023, 2024 సంవత్సరాల్లోనూ వాటర్ ప్లస్ హోదాను కొనసాగించింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో హైదరాబాద్ 6వ ర్యాంకు సాధించింది. 2023లో 5 స్టార్, 2024లో 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ గుర్తింపు పొందింది. 10,500 మార్కులతో మూల్యాంకనం:- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో భాగంగా మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాలను అంచనా వేశారు. కనిపించే పారిశుద్ధం, చెత్త వేరు చేయడం, సేకరణ, రవాణా, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య సదుపాయాలు, వినియోగించిన నీటి నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, పౌరుల అభిప్రాయాలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు.స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా జిహెచ్ఎంసి మెంటార్ సిటీగా మంథని, చేర్యాల మున్సిపాలిటీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంది. ఆయా మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య ప్రమాణాలు మెరుగుపరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు వర్క్‌షాప్‌లు నిర్వహించింది.2026 ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్ జంట నగరాల్లో మూడో పక్షం ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, పారిశుద్ధ్య మోలిక సదుపాయాలు, చెత్త నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ఇంటింటి చెత్త సేకరణతో పాటు ప్రజల అభిప్రా యాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిహెచ్ఎంసికి జాతీయ అవార్డు లభించడం హైదరాబాద్ నగర ప్రజలకు, అధికారులకు, పారిశుద్ధ్య కార్మికులకు గర్వకారణమని పేర్కొంటూ, నగరాన్ని మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు.

భారీగా భారత్ సమ్మిట్

>> ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాలు రెండూ సమర్థవంతంగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను బలంగా విశ్వసిస్తుందని, ఈ అంశాలపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలను, నాయకులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం అత్యంత ప్రాథమికమైన రాజ్యాంగ హక్కన్నారు. ఓటు హక్కు ద్వారానే ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం పొందుతారని చెప్పారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. దేశంలో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న ప్రతి పౌరుడి తరఫున మాట్లాడుతున్నామని పేర్కొన్నారు.
ఎక్కువ మంది ఓటర్లను తొలగించడం కాకుండా, ప్రతి అర్హులైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల కమిషన్, ప్రభుత్వాల ప్రధాన బాధ్యత కావాలని అన్నారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌ఛార్జి గురుదీప్ సింగ్ సప్పల్ తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం ఆశ్చర్యకరం: వినోద్

హైదరాబాద్,నవంబరు11,ప్రభాతవార్త: "సోనియాగాంధీ ఆత్మకథలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం ఆశ్చర్యకరం. రాష్ట్ర ఏర్పాటు నిర్ణయానికి సోనియా సహకరించారు. ప్రజల ఆకాంక్షలు, ఉద్యమ తీవ్రత, ఉద్యమకారుల త్యాగాలను గుర్తించారు. తెలంగాణ ప్రజలు సైతం సోనియా పాత్రను గుర్తించి అభినందించారు. తెలంగాణ ప్రస్తావన తన ఆత్మకథలో లేకపోవడమేమిటో సోనియాకే తెలియాలి."

ఆశలపై నీళ్లు

>> పథకాన్ని ప్రవేశపెట్టారని కేటీఆర్ వివరించారు. 11 విడతల్లో 11 పంటలకు కలిపి రూ.73 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. సాగు ప్రారంభించే సమయంలో రైతు ఫోన్‌లో నగదు జమ అయినట్లు సందేశం రావడం అప్పట్లో సాధారణంగా మారిందన్నారు. రైతుకు పెట్టుబడి సాయం అందించాలనే ఆలోచన దేశంలోనే తొలిసారిగా కేసీఆర్ అమలు చేశారని పేర్కొన్నారు.

రైతు చనిపోయినా కుటుంబానికి రూ.5 లక్షల భరోసా

రాష్ట్రంలో 93 శాతం మంది చిన్న, సన్నకారు రైతులేనని, కుటుంబానికి ఆధారమైన రైతు మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకూడదనే ఉద్దేశంతో రైతుబీమా పథకాన్ని తీసుకొచ్చామని కేటీఆర్ చెప్పారు. రైతు ఏ కారణంతో మరణించినా అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందించే విధానాన్ని అమలు చేశామని తెలిపారు. రైతు సంక్షేమం పట్ల కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు.

కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరెంటు కష్టాలు?

సమైక్య పాలనలో వ్యవసాయానికి నాలుగు గంటలు కూడా సక్రమంగా విద్యుత్తు అం దని పరిస్థితి ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్ ఫార్మర్లు పేలిపోవడం, విద్యుత్తు కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్తు సమస్యను అధిగమించే దిశగా చర్యలు చేపట్టి 24 గంటల నాణ్యమైన విద్యుత్తు అందించామని పేర్కొన్నారు. సింగరేణికి కొత్త జీవం పోసి బొగ్గు ఉత్పత్తి పెంచడంతోపాటు విద్యుదు త్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. రైతులకు నిరంతర విద్యుత్తు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, ఆ బాధ్యతను గత ప్రభుత్వం సమ ర్థంగా నిర్వర్తించిందని అన్నారు.
రైతుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పోల్చి చూడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతు బంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తు, సాగు నీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అందించిన భరోసాను గుర్తుచేసుకోవాలన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి వారికిఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.సభలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్షి ్మ, వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రులు జోగు రామన్న, జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోనేరు కోనప్ప, జీవన్ రెడ్డి, చిన్నయ్య, నాయకులు జాన్సన్ నాయక్, తదితరులు తదితరులు పాల్గొన్నారు.



వారం - వర్జ్యం

12-11-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, విశాఖ కార్తె,
తి.తదియ సా.6.01, న. జ్యేష్ఠ మ.2.20
వ. లేదు
దు1. ఉ.9.57 - ఉ.10.43
దు2. మ.2.31 - మ.3.17
రాహు. మ.1.30-3.00 వరకు
శుభ ఉ.8.00-ఉ.9.00

వారఫలం

మేషం : వృత్తిలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. కోర్టు వ్యవహారాలు, వివాదస్పద అంశాలు అనుకూలిస్తాయి.

వృషభం : ప్రభుత్వపరంగా రావలసిన ప్రయోజనాలు దక్కుతాయి. జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

మిథునం : దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుతుంది. అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

కర్కాటకం : ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

సింహం : అవసరాలకు తగినంత ధనాన్ని సమకూర్చుకోగలుగుతారు. అనవసరమైన భేషజాలకు పోరు.

కన్య : బంధువులు సంబంధ బాంధవ్యాలు మరింత బలపడతాయి. కుటుంబంలో స్వల్పమైన అనారోగ్య సమస్యలు ఎదురు అవుతాయి.

తుల : ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. దీర్ఘకాలిక ఋణాలనుండి బయట పడతాలు.

వృశ్చికం : ఇంట్లో మరొకరి సంపాదన ప్రారంభమవుతుంది. ఇది మీ మానసిక సంతోషానికి కారణం అవుతుంది.

ధనుస్సు : ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. అరుదైన ఆహ్వానాలు సంతోషం కలుగుతుంది.

మకరం : మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

కుంభం : ఆరోగ్యము, వాహనం విషయాలలో నిర్లక్ష్యం తగదు. ఉన్నత హోదాల్లోని వారితో పరిచయాలు పెరుగుతాయి.

మీనం : సోదరుల నుండి సమాచారం అందుకుంటారు. మంచి సంబంధం కుదురుతుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

లంచావతారులకు గొడుగు?

>> కమిషనరేట్‌లోని కీసర పోలీసు స్టేషన్‌లో నెల రోజుల వ్యవధిలో ఇన్‌స్పెక్టర్ సహా ఇద్దరు ఎస్ఐలు, ఒక హోంగార్డు 12 లక్షల రూపాయల లంచంతో ఎసిబికి పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. రాష్ట్రంలో ఒక పోలీసు స్టేషన్‌లో నెల రో జుల్లో నలుగురు పట్టుబడడం ఇదే తొలిసారి. కాగా ఈ తరహా ఘటనలకు సిఫార్సులతో పోస్టింగులు లభిస్తుండడం ఒక కారణమైతే, నిజాయి తీపరులైన అధికారులను కాదని నాయకులు, బడా బాబుల ఆదేశాలకు ఉన్నతాధికారులు మొగ్గు చూపుతుండడం మరో కారణమని నిపుణులు చె బుతున్నారు.
అవినీతి నిరోధక విభాగానికి ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడడం సాధారణమే అయినా కొన్నిసార్లు ప్రభుత్వం ఎంతో నమ్మకం వుంచిన వారు సైతం లంచాలకు అలవాటు పడి దొరికిపోవడం, బలవంతంగా ఒక వర్గానికి అనుకూలంగా సెటిల్మెంట్లు చేస్తూ చివరకు ఎసిబికి దొరికిపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ తరహా ఘటనలు హైదరాబాద్ మహా నగరం సహా రాష్ట్రంలో ప్రముఖ నగరాలుగా పేరొందుతున్న పట్టణా లలో తరచూ వెలుగు చూస్తుండడం, దీంతో పాటు అధికారంలో కీలక హోదాల్లో వున్న మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట్ల అతి ముఖ్యమైన విభాగాలలోనే జరుగుతుండడం చెప్పుకోదగ్గ అంశం. రెవెన్యూ విభాగంలో కీలకంగా వుంటున్న తహసీల్దార్లు, విఆర్ఓలు, విఆర్ఏలు ఎసి బికి దొరికిపోతుండడం ఒక ఎత్తయితే ఈ జాబితాలో తాజాగా రేపోమాపో ఐఎఎస్ హోదా అందుకోబోతూ కలెక్టర్లుగా చక్రం తిప్పాల్సిన అదన పు కలెక్టర్ల వరకు వుండడం విశేషం. ఇక పోలీసు అధికారుల వరకు వస్తే ఎస్ఐ నుంచి ఎసిపి వరకు అనేక మంది ఏకంగా స్టేషన్లలోనే దొరికిపోతున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. కీసర పోలీసు స్టేషన్‌లో నెల రోజుల వ్యవధిలో నలుగురు అధికారులు లంచాలు తీసుకుంటూ ప ట్టుబడడం గమనార్హం. రెండేళ్ల క్రితం కీసర తహసీల్దార్‌తో పాటు ఓ విఆర్ఓ మరో ఇద్దరు రియల్టర్లు ఓ భూ వివాదంలో కోటీ పది లక్షల రూ పాయల లంచంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం అన్ని వర్గాలను షాక్‌కు గురిచేసింది. ఎసిబి చరిత్రలో కోటి పది లక్షల రూపాయల లంచంతో తహసీల్దార్ పట్టుబడడం ఉమ్మడి ఎపిలో కూడా ఇదే తొలిసారి. తాజాగా కీసరలో నెల రోజుల వ్యవధిలో మొదట హోంగార్డు నాగేష్‌తో పాటు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేంద్ర రెడ్డి పది లక్షల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడగా తాజాగా మూడు రోజుల క్రితం ఇదే స్టేషన్‌కు చెందిన ఎస్ఐ శ్రీనివాస్ రెండు లక్షల రూపాయలతో దొరికిపోచాడు. ఇదే సమయంలో కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్ రెడ్డి రెండున్నర లక్షల రూపాయలతో పట్టుబడ్డాడు. ఈ తరహా ఘటనలు రెవెన్యూ, పోలీసు శాఖలో ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక గడచిన 12 ఏళ్లలో రెవెన్యూ య, పోలీసు విభాగాలతో పాటు విద్యా శాఖ, హెచ్ఎండిఎ, విద్యుత్, వాటర్ వర్క్స్ విభాగాల అధికా రులు వరుసగా పట్టుబడడడం ఈ విభాగాలపై ఉన్నతాధికారులకున్న అజమాయిషీ ఏ పాటిదో తేటతెల్లం చేయసాగింది.

అవినీతిపరులకు కానారాని శిక్షలు...ఇలా అరెస్టు అలా బెయిల్ వెంటనే పోస్టింగ్

ఇదిలావుండగా అక్రమార్కులను ఎసిబి పక్కా సమాచారంతో అన్ని ఆధారాలతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నా కోర్టుల్లో శిక్షలు వేయించలేక పోతోంది. ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడం ప్రధాన కారణంగా చెప్పాలి. రెడ్ హ్యాండెడ్ ట్రాప్ కేసులతో పాటు అక్రమాస్తుల కేసుల్లో దొరికిపోయిన అధికారులను కోర్టుల్లో విచారించేందుకు అనుమతించాలని ఎసిబి సర్కారు క్రమం తప్పకుండా నివేదికలు ఇస్తున్నా అను మతి రావడం లేదు. ప్రతీఏటా ఎసిబి పదుల సంఖ్యలో ట్రాప్ కేసులు అంతే సంఖ్యలో అక్రమాస్తుల కేసులు నమోదు చేస్తున్నా ఇందులో ఒక టి నుంచి రెండు శాతం కేసుల్లోనూ నిందితులకు శిక్షలు పడడం లేదంటే అవినీతి అధికారులకు వున్న పవర్ ఏపాటితో ఊహించుకోవచ్చు. ఒక నివేదిక ప్రకారం అవినీతి అధికారులకు సంబంధించి 300 మందితో కూడిన జాబితా సర్కారు వద్ద వుందని తెలిసింది. ఈ జాబితాకు సర్కారు ఆమోదం తెలిపితే అక్రమార్కులకు కోర్టుల్లో శిక్షలు వేయించేందుకు ఎసిబి సిద్ధంగా వుంది. కానీ ఆమోదం లభించడం లేదు. మరోవైపు ఎసిబికి పట్టుబడుతున్న అధికారులు అరెస్టయి జైలుకు వెళ్లిన తరువాత స్వల్ప వ్యవధిలోనే బెయిల్‌పై వస్తూ కొద్ది రోజుల్లోనే మళ్లీ కీలక విభాగాల్లో పో స్టింగులు పొందుతున్నారు. హెచ్ఎండిఎలో మూడేళ్ల క్రితం 200 కోట్ల రూపాయల అక్రమాస్తుల కేసులో అరెస్టయిన అధికారితో పాటు రెవె న్యూ విభాగంలో పట్టుబడ్డ మరో ఇద్దరు, పోలీసు విభాగంలోని మరో ముగ్గురు మళ్లీ కీలక విభాగాల్లో చక్రం తిప్పుతున్నారు. గతంలో ఒకసారి ఎసిబికి దొరికిపోయిన వారికి సర్వీసంతా మంచి పోస్టింగులు లభించేవి కావు. కానీ నేడు ఈ పరిస్థితి కనిపించడం లేదు. ఒకటి కాదుకదా రెం డు అంతకు ఎక్కువసార్లు ఎసిబికి దొరికిపోయిన వారు కూడా నేడు దర్జాగా కీలక చోట్ల పోస్టింగుల్లో అది కీలక విభాగాలలోనే కొనసాగుతున్నా రని ఎసిబి నివేదికలు చెబుతున్నాయి.

సాగునీటికి ఇక మహర్దశ

>> నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.వెంకమ్మ చెరువు కాలువకు ఆమోదం ఇవ్వాలిఅశ్వారావుపేట నుంచి దబ్బుతోగు, ఆసుపాక గ్రామాల్లోని చిన్న నీటిపారుదల చెరువులకు నీరందించే వెంకమ్మ చెరువు వరద ప్రవాహ కాలువ నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు. ఈ పనులకు రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ మే 11న ఆమోదం తెలిపిందని, సెప్టెంబరు 10న ప్రభుత్వానికి పంపిన ఫైలు పెండింగ్‌లో ఉందని వివరించారు. సంబంధిత ప్రతిపాదనలకు త్వరగా ఆమోదం మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరారు.పెద్దవాగు ప్రాజెక్టుకు శాశ్వత పునరుద్ధరపెద్దవాగు మధ్యతరహా ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న కట్టకు శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. ఇందుకు సంబంధించిన అంచనాలను 2025 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. ఈ పనులకు తెలంగాణ రాష్ట్ర వాటాగా రూ.3.40 కోట్లు చెల్లించేందుకు సమ్మతి తెలియజేయాలని ఏపీ ప్రభుత్వం కోరిందని, దీనికి సంబంధించిన ఫైలు తెలంగాణ ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పైపుల ద్వారా సాగునీటి సరఫరాకు ప్రతిపాదనలుసీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌లోని ప్యాకేజీలు 1, 2, 7, 8 పరిధిలో సంప్రదాయ గ్రావిటీ కాలువలకు బదులుగా ప్రెషరైజ్డ్ పైప్డ్ ఇరిగేషన్ నెట్‌వర్క్ విధానాన్ని అమలు చేసే ప్రతిపాదనలను మంత్రి ప్రస్తావించారు. ఈ మేరకు అక్టోబరు 17న ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. వీటికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పైపుల ద్వారా సాగునీటి సరఫరా వ్యవస్థ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రిజర్వాయర్లపై తేలియాడే సౌర విద్యుత్ కేంద్రాలుపీఎం సూర్య సరోవర్ యోజన కింద సాగునీటి రిజర్వాయర్లపై ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థతో కూడిన ఫ్లోటింగ్ సోలార్ ఫొటోవోల్టాయిక్ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రూపొందించిన ప్రతిపాదనలను కూడా మంత్రి వివరించారు. వాటిని త్వరగా పరిశీలించి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.మరేళ్లపాడు ఎత్తిపోతల పథకానికి ముందడుగుమరేళ్లపాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించి గ్రావిటీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ ప్రతిపాదనలు ప్రస్తుతం ఇంజనీర్‌ఇన్‌చీఫ్ స్థాయిలో పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. వీటిని త్వరగా ముందుకు తీసుకెళ్లడంతోపాటు కేంద్ర ప్రభుత్వ ఎంసీఏడీ పథకంలో ఈ ప్రాజెక్టును చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.దోమలవాగు చెరువు సామర్థం పెంపుబూ ర్గంపాడు మండలం వేపలగూడెం పరిధిలోని దోమలవాగు చిన్న నీటిపారుదల చెరువు సామర్థ్యాన్ని 0.48 టిఎంసిలకు పెంచేందుకు రూపొందించిన ప్రతిపాదనలను మంత్రి ప్రస్తావించారు. ప్రభుత్వ స్థాయిలో పరిశీలనలో ఉన్న ఈ ప్రతిపాదనలకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.మల్లెపులవాగుకు వరద రక్షణ.. భేతుపల్లి చెరువు అభివృద్ధిమురసు తుఫాన్ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొట్టుకపోయిన మల్లెపూల వాగు కట్టలకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, భారీ వరదల నేపథ్యంలో భేతుపల్లి ప్రాజెక్టుకు నీరందించే మల్లెపులవాగుకు శాశ్వత ప్రాతిపదికన రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. భవిష్యత్తులో వరదల నష్టం వాటిల్లకుండా అవసరమైన రక్షణ పనులు చేపట్టాలని కోరారు. భేతుపల్లి పెద్ద చెరువు సామర్థ్యాన్ని పెంచేందుకు రూపొందించాల్సిన ప్రతిపాదనలను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



బుధవారం గువాహతి సమీపంలోని దిగారు వద్ద పట్టాలు తప్పిన సైరాంగ్- కోల్‌కతా ఎక్స్‌ప్రెస్ రైలు

మూసీ ప్రక్షాళన ఆపలేరు

>> సాగర్, హిమాయత్ సాగర్, గండిపేటలను కట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మూసా, ఈసా నదులను ఒడిసిపట్టి మూసీ నదిగా మార్చారన్నారు. ప్రపంచంలో ఉన్న చాలా దేశాలు నదీ పరివాహన ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటున్నాయని, నదీ పరివాహక ప్రాంతాల వద్దే అభివృద్ధి కంద్రీకృతమై ఉంటుందన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్‌ను వంద సంవత్సరాల క్రితమే అభివృద్ధి చేసుకున్నామన్నారు. కానీ ప్రభుత్వాలు, ప్రజల నిర్లక్ష్యంతో మూసీ నిరాదరణకు గురైందన్నారు. నేడు మూసీ నది నల్గొండ జిల్లా ప్రజలకు శాపంగా మారుతుందని, వారికి విషాన్ని నింపుతుందన్నారు. మూసీ కాలుష్యం కారణంగా నల్గొండ జిల్లా ప్రాంత ప్రజలు భవిష్యత్ తరాలను అక్కడ ఉండకుండా ఇతర ప్రాంతాలకు వలస పంపుతున్నారని వాపోయారు. ఏ రైతైనా తాను పొలంలో పండించిన పంటను తినాలని అనుకుంటాడని, కానీ నల్గొండ జిల్లా రైతులు మాత్రం తాను పండించిన పంటను తినలేకపోతున్నాడన్నారు. తమ్మిడికుంట చుట్టూ వాకింగ్ చేసి కురగాయాలు, పాలు వంటి వస్తువులు కొనుగోలు చేసే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. మన సంస్కృతిని నిలబెట్టుకునేందుకు తమ్మిడికుంట కంద్రంగా నిలువాలని ఆకాంక్షించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపిలు కొండా విశ్వేశ్వరరెడ్డి, వేం నందర్‌రెడ్డి, అనీల్‌కుమార్ యాదవ్, కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కుంభం అనీల్‌కుమార్, నవీన్ యాదవ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్, హైడ్రా కమీషనర్ ఎంవి.రంగనాథ్, సీఎంసి కమీషనర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

తమ్మిడి కుంటలో షూటింగ్ చేస్తా : హీరో నాగార్జున

తమ్మిడికుంట చెరువును ఎన్నో ఏళ్లుగా తాను చూస్తున్నానని, గతంలో మురికి కూపంగా ఉన్న చెరువును హైడ్రా ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దారని, భవిష్యత్తులో తమ్మిడికుంట చెరువు వద్ద షూటింగ్ చేస్తానని సినీ హీరో అక్కినేని నాగార్జున అన్నారు. తమ్మిడికుంట చెరువు సుందరీకరణ పనుల ప్రారంభోత్స వ కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున మాట్లాడుతూ ఇతర దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి చెరువులను చూసి మన నగరంలో ఉన్న చెరువులు ఎందుకు ఈ విధంగా ఉండవని బాధపడేవాడినని, కానీ నేడు మన చెరువులు సుందరీకరణతో పునరుజ్జీవం సాదించుకుంటున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెరువులు, నదులు అంటే ఎంతో ప్రేమ అని, వాటికి గత వైభవం తీసుకువచ్చేందుకు హైడ్రాను స్థానించాడని అన్నారు.

ముఖ్యమంత్రి హైడ్రాను ప్రారంభించినప్పుడు ఎంతో సంతోషించాను: ఎంపి విశ్వేశ్వరరెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాను ప్రారంభించినప్పుడు తాను ఎంతో సంతోషించానని, హైడ్రా కమీషనర్ రంగనాథ్‌ను కలిసి అభినందించిన మొదటి ఎంపి, ఎమ్మెల్యను తానేనని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులు ప్రాజెక్టులు, మౌలిక వసతులు కల్పించారని, కానీ సామాజిక మౌలిక వసతులు, పార్కులు, చెరువులు, నదుల అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసిన వారు తక్కువన్నారు. చెరువుల సుందరీకరణ

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ

జిల్లా కలెక్టర్ గారి కార్యాలయము, ఆదిలాబాద్

ఫారం-VII
(పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. జి1/466/2018 — తేది: 05.11.2026
ఆర్‌డిఓ ఫైల్ నెం. బి/274/2018 — తేది: 27.08.2026
గెజిట్ నెం. P.D.U/s-19(1)/11-A/2026 — తేది: 05.11.2026

ఈ దిగువ నిర్దిష్టపరిచిన ఆదిలాబాద్ జిల్లా భోరజ్/జైనథ్ మండలములోని 1. సావాపూర్, 2. లేకర్‌వాడి, 3. పెండల్‌వాడ, 4. దీపాయిగూడ, 5. కౌట, 6. దీపాయిగూడ, 7. కురాయి, 8. కరంజి, 9. కురాయి గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.62.27 1/4 గుంటలు భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా ఇంటర్ స్టేట్ లోవర్ పెన్ గంగా ప్రాజెక్టు (DI) డిస్ట్రిబ్యూటరీ DL-17 మెయిన్ 1L, మైనర్ 14R, 15R, 31L, మరియు 33L మైనర్ కాలువల నిర్మాణము నిమిత్తం సరళ భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది. ఇట్టి ప్రాజెక్ట్ ప్రభుత్వ ఉత్తర్వులు నం.58 ఐ అండ్ సి ఎ డి (ఎల్.ఏ ఆర్ & ఆర్ ఏ) శాఖ తేది: 25.07.2017 ననుసరించి భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్-II మరియు-III పరిధి నుండి మినహాయింపు ఇవ్వబడినది.

కావున ఆదిలాబాద్ జిల్లా భోరజ్/జైనథ్ మండలములోని 1.సావాపూర్, 2. లేకర్‌వాడి, 3. పెండల్‌వాడ, 4. దీపాయిగూడ, 5. కౌట, 6. దీపాయిగూడ, 7.కురాయి, 8. కరంజి, 8. కురాయి గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.62.27 1/4 గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం ఇంటర్ స్టేట్ లోవర్ పెన్‌గంగా ప్రాజెక్టు (DI) డిస్ట్రిబ్యూటరీ DL-17 మెయిన్ 1L, మైనర్ 14R, 15R, 31L, మరియు 33L మైనర్ కాలువల నిర్మాణము నిమిత్తం అవసరమైనందున భూమిని సేకరింపబడుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయునైనది.

షెడ్యూల్

గ్రామము : సావాపూర్ & (8 గ్రామములు) మండలము : భోరజ్/జైనథ్ జిల్లా : ఆదిలాబాద్

క్ర.సం.	సర్వే నెం.	పీట్ నెం	సర్వే విస్తీర్ణం	పట్టా/మెట్ట/తరి	ఎంజాయ్‌మెంట్ విస్తీర్ణం	పట్టాదార్ పేరు/తండ్రి పేరు	కాస్తు దారుపేరు/తండ్రి పేరు	చెట్లు/బోర్ వెల్/ఇతరములు
1	2	3	4	5	6	7	8	9
1-సావాపూర్ గ్రామము భోరజ్ మండలము (డిఎల్-17, 1L మైనర్)								
1	1/2	1/ఆ3	1.14	పట్టా/మెట్ట	0.27	రౌతు అవినాష్ తండ్రి రమేశ్	స్వంతం	లేదు
2		1/ఆ2		పట్టా/మెట్ట	0.27	రౌతు రవిందర్ తండ్రి రమేశ్‌రావ్	స్వంతం	"
3	10/2	10/ఇ	1.25	పట్టా/మెట్ట	0.18	నకతే గులాబ్ తండ్రి మారుతి నకతే, రమేశ్ తండ్రి మారుతి	స్వంతం	"
4		10/ఈ		పట్టా/మెట్ట	0.14	నకతే దౌలత్ తండ్రి ఉదకుడాజి	స్వంతం	"
5		10/ఉ		పట్టా/మెట్ట	0.07	నకతే నిఖిల్ తండ్రి నవీష్	స్వంతం	"
6		10/ఊ		పట్టా/మెట్ట	0.02	నకతే నాగుబాయి భర్త రాంచందర్	స్వంతం	"
7		10/ఆ		పట్టా/మెట్ట	0.24	నకతే సోనుబాయి భర్త అంబాదాస్	స్వంతం	"
8	12/1/2	12/ఆ3	1.39	పట్టా/మెట్ట	0.29	బోయర్ కవిశ్వర భర్త దయాకర్	స్వంతం	"
9		12/ఆ4		పట్టా/మెట్ట	0.02	నవపురే మినోద్ తండ్రి కర్జుజి	స్వంతం	"
10		12/ఆ2/1/1		పట్టా/మెట్ట	0.17	నవపురే బాబారావు తండ్రి కర్జుజి	స్వంతం	"
11		12/ఆ/1		పట్టా/మెట్ట	0.31	మార్పేట్టి నాగేశ్ తండ్రి నర్సింగ్	స్వంతం	"
12	13/2	13/ఆ/2	1.18	పట్టా/మెట్ట	0.14	వెంకర్ నరేశ్ తండ్రి పీటో భా	స్వంతం	"
13		13/ఆ/3		పట్టా/మెట్ట	0.14	వెంకర్ బుద్ధప్రకాశ్ తండ్రి పీటోభా	స్వంతం	"
14		13/ఆ/1		పట్టా/మెట్ట	0.29	వెంకర్ లక్ష్మీబాయి భర్త పీటోభా	స్వంతం	"
15		13/ఆ1		పట్టా/మెట్ట	0.01	బోయర్ కవిశ్వర్ తండ్రి బాపురావు	స్వంతం	"
16	14/2	14/ఆ	1.00	పట్టా/మెట్ట	1.00	భగత్ తాని తండ్రి చిన్న	స్వంతం	"
17	18/2	18/ఇ/2	1.35	పట్టా/మెట్ట	0.37	బోయర్ రసిక భర్త సురేందర్	స్వంతం	"
18		18/ఇ/1		పట్టా/మెట్ట	0.38	బోయర్ అనితబాయి భర్త కవిశ్వర్	స్వంతం	"
19	19/2	19/ఆ	0.19 0.07	పట్టా/మెట్ట	0.28	రౌతు శ్రీనివాస్ తండ్రి నాగోరావు	స్వంతం	"
20		19/1	1.05 1.31	పట్టా/మెట్ట	1.03	సాట్ల శ్రీనివాస్ తండ్రి రాజన్న	స్వంతం	"
	మొత్తం		11.02		11.02			
2-లేఖర్ వాడ గ్రామము-భోరజ్ మండలము (డిఎల్-17, 1L మైనర్)								
1	60/2	60/ఆ2	1.20	పట్టా/మెట్ట	0.15	బింగి లసుమ్ భర్త చిన్నజీ	స్వంతం	లేదు
2		60/ఆ/1		పట్టా/మెట్ట	0.20	మానేరు లక్ష్మి భర్త పోతన్న	స్వంతం	"
3		60/ఈ/1/1		పట్టా/మెట్ట	0.25	తల్లెల భూమన్న తండ్రి కన్న	స్వంతం	"
4	62/2	62/ఈ3/1	1.06	పట్టా/మెట్ట	0.01	తార గంగన్న తండ్రి నడిపెన్న	స్వంతం	"
5		62/ఆ/2		పట్టా/మెట్ట	0.23	బేర దిలీప్‌కుమార్ తండ్రి నుకుంద్‌రావు	స్వంతం	"
6		62/ఇ		పట్టా/మెట్ట	0.18	ఆరిగెల రాధ భర్త భూమన్న	స్వంతం	"
7		62/ఆ/1		పట్టా/మెట్ట	0.04	తార పరమేశ్వరి భర్త వెంకటి	స్వంతం	"
8	63/2	63/ఆ/1	1.01	పట్టా/మెట్ట	0.17	సర్పన్ ఆశోక్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి	స్వంతం	"
9		63/ఆ/2		పట్టా/మెట్ట	0.24	సర్పన్ శైలజ భర్త దిలీప్‌రెడ్డి	స్వంతం	"
10	64/2	64/ఆ2	0.05	పట్టా/మెట్ట	0.05	రౌత్ గులాబ్ తండ్రి కేశవరావు	స్వంతం	"
11	65/2	65	0.18	పట్టా/మెట్ట	0.06	సర్పన్ సుభాష్ తండ్రి నర్సింగ్‌రావు	స్వంతం	"
12		65/ఆ1		పట్టా/మెట్ట	0.06	నరోత్తమ్ రెడ్డి తండ్రి నర్సింగ్‌రావు	స్వంతం	"
13		65/ఆ2		పట్టా/మెట్ట	0.06	సర్పన్ కిషన్‌రెడ్డి తండ్రి నర్సింగ్‌రావు	స్వంతం	"
14	66/2	66/ఇ1	0.39	పట్టా/మెట్ట	0.39	గూమ్ముల సూనిల్ తండ్రి గంగారెడ్డి	స్వంతం	"
15	67/2	67/ఆ	1.02	పట్టా/మెట్ట	0.14	సర్పన్ సుభాష్‌రెడ్డి తండ్రి నర్సింగ్‌రెడ్డి	స్వంతం	"
16		67/ఆ2		పట్టా/మెట్ట	0.14	సర్పన్ నరోత్తమ్‌రెడ్డి తండ్రి నర్సింగ్‌రెడ్డి	స్వంతం	"
17				పట్టా/మెట్ట	0.14	సర్పన్ కిషన్‌రెడ్డి తండ్రి నర్సింగ్‌రెడ్డి	స్వంతం	"
18	68/2	68/ఆ1/2	1.20	పట్టా/మెట్ట	0.36	రౌత్ పరమేశ్వర్ తండ్రి తేజ్‌రావు	స్వంతం	"
19		68/ఆ3		పట్టా/మెట్ట	0.15	రౌత్ భగవాండ్లు తండ్రి పిట్లు	స్వంతం	"
20		68/ఆ2		పట్టా/మెట్ట	0.05	రౌత్ నంతోష్ తండ్రి రాందేవ్	స్వంతం	"
21		68/ఆ1		పట్టా/మెట్ట	0.04	రౌత్ విజయ్ తండ్రి రాందేవ్	స్వంతం	"
22	69/2	69/ఆ1	0.07	పట్టా/మెట్ట	0.07	శకమ్మోల్ల పీటోబా తండ్రి దుక్కన్న	స్వంతం	"
23	70/2	70/ఆ2	1.12	పట్టా/మెట్ట	0.16	కటోపెళ్లి వర్ధన్‌రెడ్డి భర్త భూమారెడ్డి	స్వంతం	"
24		70/ఆ1		పట్టా/మెట్ట	0.36	ఆరిగెల గజరామ్ తండ్రి గంగన్న	స్వంతం	"
25	79/2	79/ఆ	1.17	పట్టా/మెట్ట	0.30	తల్లెల హేమలత తండ్రి దాస్	స్వంతం	"
26		79/ఇ1		పట్టా/మెట్ట	0.27	ఆల్లెల చంద్రయ్య తండ్రి ఆశన్న	స్వంతం	"
27	80/2	80/ఇ	1.17	పట్టా/మెట్ట	0.29	ఆరిగెల బోజన్న తండ్రి భూమన్న	స్వంతం	"
28		80/ఈ1		పట్టా/మెట్ట	0.28	ఆరిగేలా రాములు తండ్రి పోతన్న	స్వంతం	"
29	81/2	81/ఆ	0.32	పట్టా/మెట్ట	0.13	ఎస్‌కె.బాబు తండ్రి గపూర్	స్వంతం	"
30		81/ఆ1		పట్టా/మెట్ట	0.19	షైక్ ఇబ్రాహీం తాండ్రపటి హుస్సేన్	స్వంతం	"
31	82/2	82/ఇ2	0.32	పట్టా/మెట్ట	0.32	చెదల శ్రీనివాస్ తండ్రి నారాయణ	స్వంతం	"
	మొత్తం		13.31		13.31			
3-పెండల్‌వాడ గ్రామము-భోరజ్ మండలము (డిఎల్-17, 1L మైనర్)								
1	40/2/2	40/ఐ	0.05	పట్టా/మెట్ట	0.05	సమా చంద్రభాఘ భర్త రమేశ్ రెడ్డి	స్వంతం	లేదు
2	46/2	46/ఉ	0.33	పట్టా/మెట్ట	0.33	నమ కిష్టారెడ్డి తండ్రి కిష్టన్న	స్వంతం	"
3	47/2	47/ఇ1	1.37	పట్టా/మెట్ట	0.20	నమ లక్ష్మ భర్త గిరిష్ రెడ్డి	స్వంతం	"
4		47/ఆ		పట్టా/మెట్ట	0.18	నమ రామరెడ్డి తండ్రి గంగారెడ్డి	స్వంతం	"
5		47/ఆ		పట్టా/మెట్ట	0.17	పొద్దుకురి మౌనికరెడ్డి భర్త పొద్దుకురి హరినివాస రెడ్డి	స్వంతం	"
6		47/ఇ		పట్టా/మెట్ట	0.22	నమ ఆశోక్‌రెడ్డి తండ్రి దశరత్‌రెడ్డి	స్వంతం	"
7	48/2	48/ఆ	1.17	పట్టా/మెట్ట	0.25	బేర నవీన్‌రెడ్డి తండ్రి గంగారెడ్డి	స్వంతం	"
8		48/అ		పట్టా/మెట్ట	0.32	బేర వందన తండ్రి /భర్త ప్రశాంత్	స్వంతం	"
9	49/2	49/ఆ	0.05	పట్టా/మెట్ట	0.05	నమ రుక్మారెడ్డి తండ్రి కిష్టన్న	స్వంతం	"
10	61/2	61/ఆ/1	1.00	పట్టా/మెట్ట	1.00	నాగపూరే విట్టల్ తండ్రి నాగో రెవ్	స్వంతం	"
11		61/ఆ/2	0.37	పట్టా/మెట్ట	0.37	నాగపూరే గీత భర్త సుదర్శన్	స్వంతం	"
12	71/2	71/ఇ	1.34	పట్టా/మెట్ట	0.13	అడ్డివార్ శినిత్ రెడ్డి తండ్రి విశ్వనాథ్‌రెడ్డి	స్వంతం	"
13		71/ఆ		పట్టా/మెట్ట	0.23	టక్కురి రమేశ్ తండ్రి నారాయణ	స్వంతం	"
14		71/ఆ2		పట్టా/మెట్ట	0.38	టక్కురి సురేశ్ తండ్రి నారాయణ	స్వంతం	"
15	73/2	73/ఆ	0.31	పట్టా/మెట్ట	0.31	పట్లోపు రూప భర్త యాదవ్	స్వంతం	"
16	75/2	75/ఇ	0.29	పట్టా/మెట్ట	0.15	వంగర్ లక్ష్మణ్ తండ్రి పోచ్చరామ్ (కుటుంబ వివాదము కోర్ట్ కేసు)	వంగర్ ఆశోక్ తండ్రి లక్ష్మణ్	"
17				పట్టా/మెట్ట	0.14		వంగర్ మధుకర్ తండ్రి లక్ష్మణ్	"
18	80/2	80/ఆ	2.03	పట్టా/మెట్ట	0.02	క్యాతమ్ గణపతిరెడ్డి తండ్రి గంగారెడ్డి	స్వంతం	"
19		80/ఆ 1/2		పట్టా/మెట్ట	0.12	బొల్లి విలాస్ తండ్రి హన్మండ్లు	స్వంతం	"
20		80/ఆ2		పట్టా/మెట్ట	0.24	వైద్య చాయా భర్త ప్రభాకర్	స్వంతం	"
21		80/ఆ		పట్టా/మెట్ట	0.07	సుంకరి శాంతబాయి భర్త భూమన్న	స్వంతం	"
22		80/ఇ		పట్టా/మెట్ట	0.38	రోద్ద గంగన్న తండ్రి రోద్ద చిన్నయ్య	స్వంతం	"
23	83/2	83/ఇ/1	1.05	పట్టా/మెట్ట	1.05	కెతెరెడ్డి మధుసూదన్‌రెడ్డి తండ్రి జావురెడ్డి	స్వంతం	"
24	84/2	84/ఆ	1.07	పట్టా/మెట్ట	0.14	సోమదేవరెడ్డి తండ్రి లింగరెడ్డి	స్వంతం	"
25		84/అ		పట్టా/మెట్ట	0.14	సోమ లచి రెడ్డి తండ్రి లక్ష్మరెడ్డి	స్వంతం	"
26		84/ఇ		పట్టా/మెట్ట	0.19	జోగు అంజనేయులు తండ్రి గంగాధరయ్య	స్వంతం	"
27	85/2	85/ఆ	0.23	పట్టా/మెట్ట	0.23	టక్కురి గంగమ్మ భర్త రమేశ్	స్వంతం	"
28	87/2	87/అ	0.34	పట్టా/మెట్ట	0.34	వంకడే అరవింద్ తండ్రి కబీర్	స్వంతం	"
29	88/2	88/అ	0.34	పట్టా/మెట్ట	0.34	సింగిడి హన్మండ్లు తండ్రి కిష్ణు	స్వంతం	"
30	89/2	89/ఉ	0.36	పట్టా/మెట్ట	0.36	బొర్కర్ జగన్నాథ్ తండ్రి బాపురావ్	స్వంతం	"
			17.10		17.10		OK	
4-దీపాయి గూడ గ్రామము-జైనథ్ మండలము (DL-17, 14R)								
1	104/1/2	104/ఆ2/1	1.22	పట్టా/మెట్ట	0.04 1/2	ఎస్‌కె.రంజాన్ తండ్రి క్రైక్ హైదర్	స్వంతం	లేదు
2		104/ఆ		పట్టా/మెట్ట	0.38 1/2	బాదర్ వెంకట్‌రెడ్డి తండ్రి లింగరెడ్డి	స్వంతం	"
3		104/ఇ/1		పట్టా/మెట్ట	0.13	లోక ప్రమోద్‌రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి	స్వంతం	"
4		104/ఇ/2		పట్టా/మెట్ట	0.06	లోక హరికాంత్ తండ్రి ఆశిరెడ్డి	స్వంతం	"
5	106/2	106/ఆ1	1.27	పట్టా/మెట్ట	0.14 1/2	లోక హరికాంత్ తండ్రి ఆశిరెడ్డి	స్వంతం	"
6		106/అ		పట్టా/మెట్ట	0.01 1/2	కట్ట పెళ్లివామన్ తండ్రి భోజన్న	స్వంతం	"
7		106/ఇ		పట్టా/మెట్ట	0.19	లోక సచిన్‌రెడ్డి రాంచందర్‌రెడ్డి	స్వంతం	"
8		106/ఈ		పట్టా/మెట్ట	0.32	సమా విజయబాయి భర్త బాపురావ్	స్వంతం	"
9	107/2	107/ఆ	0.16	పట్టా/మెట్ట	0.16	గుమ్మడి లక్ష్మీబాయి భర్త బాపురావ్	స్వంతం	"
10	108/2	108/ఆ3	3.13	పట్టా/మెట్ట	0.29 1/2	భాస భూమన్న తండ్రి దేవన్న	స్వంతం	"
11		108/ఆ2		పట్టా/తరి	0.29 1/2	భాస ప్రవీణ్ తండ్రి భూమన్న	స్వంతం	బోర్ వెల్
12		108/ఆ		పట్టా/మెట్ట	0.17 1/2	పుంద్రు సాయిరాం తండ్రి రమేశ్ రెడ్డి	స్వంతం	లేదు
13		108/ఆ1		పట్టా/మెట్ట	0.17 1/2	పుంద్రు సుశీలబాయి భర్త బాపురావ్	స్వంతం	"
14		108/ఉ3/1		పట్టా/మెట్ట	0.16	పుంద్రు సునేశ్ రెడ్డి తండ్రి గంగారెడ్డి	స్వంతం	"
15		108/ఉ2		పట్టా/మెట్ట	0.19	ఎలాల్ చంద్రబాయి భర్త గంగారెడ్డి	స్వంతం	"
16		108/ఉ		పట్టా/మెట్ట	0.04	అల్లూరి నారాయణరెడ్డి తండ్రి భీముడు	స్వంతం	"
17	109/2	109/అ	0.37	పట్టా/మెట్ట	0.37	అల్లూరి నారాయణ్‌రెడ్డి తండ్రి భీముడు	స్వంతం	"
18	113/2	113/ఇ/2/1	0.0 1/4	పట్టా/మెట్ట	0.0 1/4	లోక వెంకట్‌రెడ్డి తండ్రి కిష్టారెడ్డి	స్వంతం	"
19	126/2	126/ఈ	0.01	పట్టా/మెట్ట	0.01	మర విమల భర్త రామ్‌రెడ్డి	స్వంతం	"
			7.36 1/4		7.36 1/4	(7.38 1/4 (-0.02=7.36 1/4)		
5-కౌట గ్రామము జైనథ్ మండలము (15R, మైనర్ DL-17)								
1	63/2	63/ఆ3	0.35	పట్టా/మెట్ట	0.16	పుంద్రు రాకేశ్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి	స్వంతం	బోర్‌వెల్ /మోటర్
2	63/2	63/ఇ		పట్టా/మెట్ట	0.19	మునిగేలా శ్రీనివాస్ తండ్రి విట్టల్	స్వంతం	"
3	64/2	64/D 1/1	0.07	పట్టా/మెట్ట	0.07	లోక భాస్కర్‌రెడ్డి తండ్రి కిష్టారెడ్డి	స్వంతం	"
	మొత్తం		1.02		1.02			
6-దీపాయి గూడ గ్రామము-జైనథ్ మండలము (15R, మైనర్ DL-17)								
1	118/2	118/2	0.39	పట్టా/మెట్ట	0.39	సామ ప్రతిభాయి భర్త గంగారెడ్డి	స్వంతం	లేదు
2	120/2	120/ఆ1	1.10	పట్టా/మెట్ట	0.13	కోవా మోహన్ తండ్రి హసీనా	స్వంతం	"
3		120/ఆ2		పట్టా/మెట్ట	0.10	కోవా బాపురావు తండ్రి తుకారాం	స్వంతం	"
4		120/ఆ3		పట్టా/మెట్ట	0.09	కోవా ఇస్తారి తండ్రి తుకారాం	స్వంతం	"
5		120/ఆ1		పట్టా/మెట్ట	0.18	కోవా కంఠా భర్త ఓంప్రకాశ్	స్వంతం	"
6	121/2	21/ఆ	1.10	పట్టా/మెట్ట	1.05	నల్ల ఆశిరెడ్డి తండ్రి జగన్న	స్వంతం	బావి
7		121/ఆ		పట్టా/మెట్ట	0.05	నల్ల పరమేశ్వరి బాయి భర్త సుదర్శన్‌రెడ్డి	స్వంతం	"
8	123/2	123/ఆ1	0.03	పట్టా/మెట్ట	0.03	ఆలశెట్టి సామి తండ్రి దశరత్		"
	మొత్తం		3.22		3.22	(3.24(-)0.02=3.22)		
7-కురాయి గ్రామము జైనథ్ మండలము (DL-17, 33 L మైనర్)								
1	29/1/2	49/1A	1.34	పట్టా/మెట్ట	0.15	తిప్పిరెడ్డి శ్వేత భర్త: అరవిందర్‌రెడ్డి	స్వంతం	లేదు
2		49/2A/1/1		పట్టా/మెట్ట	0.25	తిప్పిరెడ్డి మంజుల భర్త వెంకట్‌రెడ్డి	స్వంతం	5-హార్స్ & ఫెన్సింగ్ వైర్
3		49/B3		పట్టా/మెట్ట	0.34	ఎల్లి ముసేశ్ రెడ్డి తండ్రి కేశవరెడ్డి	స్వంతం	3-ఇంచ్ పైప్స్ 54 -ఫీట్స్
4	30/2	30/A1	1.06	పట్టా/మెట్ట	0.09	నమ వెంకట్‌రెడ్డి తండ్రి కిష్టారెడ్డి	స్వంతం	"
5		30/1B		పట్టా/మెట్ట	0.37	భాస గంగమ్మ భర్త భూమన్న	స్వంతం	"
6	31/2/2	31/1/ఆ	1.12	పట్టా/మెట్ట	0.34	మేకల శ్రీనివాస్ తండ్రి పెద్ద భూమన్న	స్వంతం	"
7		31/B/1		పట్టా/మెట్ట	0.18	బీట్లా భూమారెడ్డి తండ్రి లస్మారెడ్డి	స్వంతం	"
8	32/2	32/A/1	1.09	పట్టా/మెట్ట	0.20	అడ్డి వెంకట్‌రెడ్డి తండ్రి గంగారెడ్డి	స్వంతం	"
9		32/ఆ		పట్టా/మెట్ట	0.29	మేకల వెంకన్న తండ్రి నడిపి భూమన్న	స్వంతం	"
10	33/2	33/2 A/1	0.14	పట్టా/మెట్ట	0.04	బద్దం వెంకలమ్మ భర్త పోత రెడ్డి	స్వంతం	"
11		33/1 A/1		పట్టా/మెట్ట	0.10	మేకల పెద్ద భూమన్న తండ్రి రాములు	స్వంతం	"
			5.35		5.35			
8-కరంజి గ్రామము జైనథ్ మండలము (33 L మైనర్ DL 17)								
1	26/2	26/ఇ	1.28	పట్టా/మెట్ట	1.28	ఎల్లి మునేశ్‌రెడ్డి తండ్రి కేశవ	స్వంతం	లేదు
2	34/2	34	0.03	పట్టా/మెట్ట	0.03	భాస నారాయణ తండ్రి దేవన్న	స్వంతం	లేదు
			1.31		1.31	(1.33(-)0.02=1.31)		
9-కురాయి గ్రామము జైనథ్ మండలము (33 L మైనర్ DL-17)								
1	35/1/2	35/B	0.16	పట్టా/మెట్ట	0.15	చంద్ర భాగబాయి భర్త వెంకట్‌రెడ్డి	యెల్లి రత్న బాయి	లేదు
2		35/1A		పట్టా/మెట్ట	0.01	గంగాధర్‌రెడ్డి తండ్రి రారెడ్డి	స్వంతం	లేదు
			0.16		0.16			
			62.27 1/4		62.27 1/4			

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై పద్ధిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయునైనది. ఆదిలాబాద్ జిల్లా భోరజ్/జైనథ్ మండలములోని 1. సావాపూర్, 2. లేకర్‌వాడి, 3. పెండల్ వాడ, 4. దీపాయి గూడ, 5. కౌట, 6. దీపాయిగూడ, 7. కురాయి, 8. కరంజి, 9. కురాయి గ్రామములోని మొత్తము విస్తీర్ణము ఎ.62.27 1/4 గుంటలు గుర్తించనైనది.

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 యొక్క సెక్షన్ 16 ప్రకారం, ప్రాజెక్ట్ పాలనాధికారి, ఇంటర్ స్టేట్ లోయర్ పెన్‌గంగా ప్రాజెక్ట్, ఆదిలాబాద్ గారి ఆధ్వర్యములో నిర్వహణ అధికారులు మరియు అభ్యర్థనల ప్రకారము తమ భూమి వేర్పుబద్ద ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబాల సామాజిక-ఆర్థిక సర్వే చేయడం జరిగినది మరియు పునరావాసం మరియు రి-సెటిల్‌మెంట్ ప్యాకేజ్ (R&R-ప్యాకేజ్) పొందుటకు ఎవరు అర్హులు కారు అని తెలియవర్చనైనది.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఎస్టిమేషన్ పని దినములలో మరియు కార్యాలయము పని వేళలలో జిల్లా కలెక్టరు ఆదిలాబాదు/రాజస్వ మండల అధికారి ఆదిలాబాద్ గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉన్నది.

సం/-. రాజస్వ మండలాధికారి మరియు భూసేకరణ అధికారి ఆదిలాబాద్	సం/- అదనపు కలెక్టర్ ఆదిలాబాద్	సం/-. జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్

DIPR RO.NO: 1124/LA/PP/Advt/Pub/2026-27



ధరలు పెంచిన మదర్‌డెయిరీ

లీటరుకు రూ.2 నుంచి రూ.4 పెంపు

న్యూఢిల్లీ, నవంబరు 11: మదర్ డెయిరీ మరోసారి బిగ్ షాక్ ఇచ్చింది. పాల ధరను లీటరుకు 2 నుంచి 4 రూపాయల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. మదర్ డెయిరీ తయారు చేసే అన్ని రకాల వేరియంట్లపై గరిష్టంగా నాలుగు రూపాయల వరకు పెరిగింది. పెరిగిన పాల ధరలు బుధవారం నుంచే అమలులోకివచ్చాయి. నూతన ధరల ప్రకారం.. మదర్ డెయిరీ ఫుల్ క్రీమ్ పాలు లీటరు ధర రూ. 74 నుంచి రూ. 76 కి చేరింది. టోన్డ్ మిల్క్ లీటరు ధర రూ. 60 నుంచి రూ. 62 కు పెరిగింది. అలాగే డబుల్ టోన్డ్ పాలు లీటరు రూ. 54 నుంచి రూ. 56 కు చేరగా, ఆవుపాల ధర లీటరుకు రూ. 62 నుంచి రూ. 65కి పెరిగింది. ఢిల్లీ నేషనల్ కేపిటల్ రీజియన్ పరిధిలో విక్రయించే ఓపెన్ టోన్డ్ పాలు లీటరు చొప్పున రూ. 58 నుంచి రూ. 60కి చేరాయి.

మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు తీవ్ర అస్వస్థత

ఢిల్లీ ఎయిమ్స్ న్యూరోకేర్‌లో చికిత్స


జగదీప్ ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, నవంబరు 11: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లినప్పుడు స్పృహతప్పి పడిపోయి నట్లు సమాచారం. కొద్ది నిమిషాల పాటు అపస్మారక స్థితిలో ఆయన్ను పీసీఆర్ వాహనంలో ఇంటికి తీసుకెళ్లారు భద్రతా సిబ్బంది. ఆ తర్వాత ఐఎల్బీఎస్ వైద్య బృందం, ఎయిమ్స్ వైద్యుడు సందీప్ సేథ్ ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే ఆయన్ను ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించినట్లు వర్గాలు తెలిపాయి. ధన్‌ఖడ్‌ను ఆసుపత్రిలోని కార్డియో న్యూరో సెంటర్‌లో చేర్పించారని, ప్రస్తుతం ఆయన కార్డియాలజీ విభాగం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని సమాచారం. రెండేళ్లుగా ఆయన పలుమార్లు స్పృహ కోల్పోవడం, మూర్ఛపోవడం లాంటివి జరిగినట్లు తెలుస్తోంది. 2025 మార్చిలో ఛాతీ నొప్పి రావడంతో ధన్‌ఖడ్‌ను ఎయిమ్స్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చేర్పించారు. అనంతరం ఆయనకు యాంజియోప్లాస్టీ జరిగింది.

మళ్లీ అదే ఏడాది జూన్‌లో నైనిటాల్‌లో అధికారిక పర్యటన సందర్భంగా, కుమావ్ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ వేడుకలకు హాజరైనప్పుడు స్పృహ కోల్పోయారు. పార్లమెంటరీ మాజీ సహచరుడు మహేంద్ర సింగ్‌పాల్‌ను కౌగిలించుకుంటున్నప్పుడు ఆయన స్పృహ కోల్పోయినట్లు కనిపించారు. జనవరిలో, ఇంట్లో వాష్‌రూమ్‌కు వెళ్తున్న ప్పుడు ఆయన రెండుసార్లు స్పృహ కోల్పోయారు. ఉపరాష్ట్రపతి భ

వార్త

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.

న- వార్విక్

‘పారాక్వాట్’ పై నిషేధం మంచిదే!

పర్యావరణ పరిరక్షణ గురించి ఎవరు ఆలోచించడం లేదు. ఫలితంగా ఒకప్పుడు పిచ్చుకల వంటి చిన్నచిన్న పక్షులు పంట పొలాలల్లోని పురుగులను ఏరి పట్టుకొని తినేసేవి. అలానే కప్పలు,పాములు, పీతలువంటి జంతు జాలాలు పంటలకు హాని కలిగించే పురుగుల నుండి రక్షి ంచేవి. ఇప్పుడు వాడుతున్న విషరసాయనాల వల్ల అవి అదృశ్యమైపోతున్నాయి. ఫలితంగా రైతులు పురుగులనుండి రక్షి ంచుకునేందుకు పురుగుమందులు విపరీతంగా వాడక తప్పడం లేదు. ఏదిఏమైనా రైతులు గడ్డి మందులతోపాటు విషపూరిత పురుగుమందులు, రసాయనిక ఎరువులవాడకం తగ్గించాల్సి న అవసరం ఎంతైనా ఉంది. ప్రకృతిసిద్ధ వ్యవసాయం వైపు కాస్తయినా మొగ్గుచూపాలి. ఇంకా మన దేశంలో 40 రకాలకుపైగా హెర్బిసైడ్స్ అలానే కొన్ని ప్రాణాంతక పెస్టిసైడ్స్ ఇంకా విపరీతంగా అమ్మకాలు జరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం వీటిపై కూడా దృష్టి సారించాలి.

సహజసిద్ధ ఆర్గానిక్ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి.

– డా. నివేకుమార్

మన దేశంలో రైతులు పంట పొలాల్లో కలుపుమొక్కల నివారణకు విపరీతంగా వినియోగిస్తున్న అత్యంత విషపూరిత, ప్రమాదకర ప్రాణాంతక పారా క్వాట్‌ను ఇటీవలకేంద్ర ప్రభుత్వం నిషేధించింది. మన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంతకు ముందే పారాక్వాట్ గడ్డి మందును నిషేధించిన ఆ నిషేధపు ఉత్తర్వులు పూర్తిగా అమలు కాలేదు.బహిరంగంగా అమ్మకాలు లేకపోయినా తెరచాటు పారాక్వాట్ అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. రైతులు కూడా పురుగుమందుల వ్యాపారులపై ఒత్తిడి పెట్టి తీసుకొని దొంగ చాటుగా వాడుతూనే ఉన్నారు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పూర్తిగా నిషేధించడం వల్ల ఈ నిషేధపు ఉత్తర్వుల అమలు సులభతరమైంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే నిషేధం విధించినప్పుడు ప్రక్క రాష్ట్రాల్లో ఈ మందు దొరికేది. దేశవ్యాప్తంగా గత 40 సంవత్సరాలుగా రైతులు విపరీతంగా వినియోగించిన పారాక్వాట్ నిషేధం వెనుక ఎన్నో విషాద గాథలు ఉన్నాయి. ఇంతకు ముందే చెప్పినట్లుగా అత్యంత విషపూరిత, ప్రమాదకర ప్రాణాంతక ఈ హెర్బిసైడ్ వినియోగిస్తే పచ్చని గడ్డి మొక్కలు కొన్ని గంటల వ్యవస్థలోనే నిర్జీవమైపోతాయి. ఇది పచ్చని మొక్కలలో జరిగే ఫోటో సింథసిస్ అంటే కిరణజన్య సంయోగ క్రియకు తీవ్ర అంతరాయం కలిగించడం ద్వారా వాటిని హతమారుస్తుంది. ఆ గడ్డి మొక్కలను ఎంతగా నిర్జీవం చేస్తుందో అదే విధంగా మనుషులు, ఇతర జంతు జాలాలపై కూడా ఈ మందు పడితేఅంతే ప్రభావం ఉంటుంది. పొలాల్లో కలుపు తీసే కూలీల కొరత ఉండటం, కూలీలు దొరికిన అధిక కూలి డిమాండ్ చేయడం, ఎక్కువ సమయం పట్టడం తదితర కారణాలతో రైతులు కలుపు నివారణకు ఈ హెర్బిసైడ్‌ల పైన ఆధారపడుతున్నారు. మందు, పిచికారిఖర్చు కూలీల ఖర్చు కంటే చాలా తక్కువగా ఉండటం, గంటల వ్యవధిలోనే కలుపు మొక్కలు నిర్జీవం కావడం వంటి సులభతర విధానాల వల్ల అత్యధిక రైతులు ఈ హెర్బిసైడ్ వైపుమొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మన దేశంలో 100రకాల హెర్బసైడ్స్ లభిస్తున్నాయి. వీటిలో 20దాకా అత్యంత ప్రమాదకరమైనవి ఉన్నాయని వైద్య, వ్యవసాయ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే ఇతర దేశాల్లో పూర్తిగా నిషేధించిన 42 గడ్డి మందులు మన దేశంలో విరివిగా వాడుకలో ఉన్నాయి. ప్రస్తుతం మన దేశంలో ఈ మందుల వాడకం 6000టన్నుల పైగానే ఉందని వ్యాపార లావాదేవీల గణాంకాలు తెలుపుతున్నాయి. పారాక్వాట్ హెర్బిసైడ్ రసాయన నామం పారాక్వాట్ డైక్లోరైడ్. దీనికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత విష రసాయనంగా పేరు పొందింది. ఇప్పటికే 74 దేశాలకుపైగా ఈ మందును పూర్తిగా నిషేధించాయి. అతి సూక్ష్మ పరిమాణం కూడా ప్రాణాంతకమే. సాధారణంగా దాదాపు అన్ని హెర్బిసైడ్‌లకు యాంటీ డోట్ ఉంటుంది. పారాక్వాట్‌కు యాంటీ డోట్ లేదు. మరణం తథ్యం అవుతుంది. అందువల్లనే దేశవ్యాప్తంగా అనేకమంది వైద్యనిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగం నిపుణులు ఈమందును నిషేధించాలనిఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం స్పందించి ఇప్పుడు నిషేధ నిర్ణయం తీసుకుంది. పారాక్వాట్ మందు స్ప్రేలలో కలిపేటప్పుడు,పిచికారి చేసేటప్పుడు, శరీరంపై చిందిన,విష ప్రభావం తెలియక ముట్టుకున్న, పీల్చినా, సేవించినా శరీరంలోని అన్ని రకాల కణజాలాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.శరీరంలో చేరిన పారాక్వాట్ డైక్లోరైడ్ శరీరంలోని కణాలను,కణజాలాన్ని అంతర్గతంగా ఆక్సిడేటివ్ స్ట్రెస్‌కు గురిచేసి ప్రమాదకర ఫ్రీ రాడికల్స్‌ను ఉత్పత్తిచేస్తుంది. ఈఫ్రీరాడికల్స్ కణాల చుట్టూ గల కణత్వచం (సెల్ మెంబ్రేన్)ను, కణంలోని అంతర్భాగాలను నిర్జీవంచేసి కణజాల విచ్ఛిత్తికి కారణం అవుతాయి. ఈ చర్యలు తొలుత జీర్ణ,శ్వాసవ్యవస్థలో ప్రారంభమై కొన్ని



గంటల వ్యవధిలోనే మూత్రపిండాలు, కాలేయం, గుండె కణజాలల వరకు విస్తరిస్తాయి. ఫలితంగా ఆ అవయవాలు విధుల నిర్వహణలో విఫలమవుతాయి.దీనినే వైద్య పరిభాషలో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌గా పేర్కొంటారు. 24 గంటల నుండి 40గంటల వ్యవధిలోనే పచ్చని మొక్కలనుచంపినట్టే మనుషులను, ఇతర జంతుజాలాలను చంపేస్తుంది.నేషనల్ క్రైమ్ రికార్డ్స్‌బ్యూరో 2024 సంవత్సర నివేదిక ప్రకారం మన దేశంలో ఈ పారాక్వాట్ వల్ల 34,670 మందికిపైగా మరణించారు. అత్యంత విషాదకర విషయం ఏమిటంటే వీరిలో 26,921మంది ఆత్మహత్యకు ఈ మందును వినియోగించారు. దీనికి యాంటీ డోట్ లేకపోవడం వల్ల వైద్యులు ఏ ఒక్కరిని రక్షించలేకపోయారు. మిగిలిన 7821 మంది యాదృచ్ఛికంగా ఈ మందు పంట పొలాలలో వినియోగించేటప్పుడు తెలియకుండానే విష ప్రభావానికి గురై మరణించారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో అత్యధికులు రైతులు, రైతు కుటుంబాలే కావడం గమనించాల్సిన విషయం. వ్యవసాయంలో తీవ్ర నష్టాలు రావడం, అప్పుల పాలు కావటం, అప్పులు ఇచ్చినవారు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురిచేయడం, కుటుంబ పోషణ భారం కావడం, ఆదుకునే వారు లేకపోవడం,ఈ సంవత్సరం కాకపోయినా వచ్చే సంవత్సరం అయినా వ్యవసాయం ద్వారా అప్పులు తీర్చగలమని నమ్మకం పూర్తిగా కోల్పోవడం వంటివి ఈ ఆత్మహత్యలకు కారణమని పలు అధ్యయనాలు తేల్చాయి. దేశానికి రైతే వెన్నెముకని చెప్పుకునే మనదేశంలో ఇలాంటి హృదయ విదారక సంఘటనలు నిత్యం జరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. మన దేశంలో కొద్ది దశాబ్దాల కాలంగా కలుపు మొక్కల నివారణ మందులు అంటే హెర్బిసైడ్స్ విపరీతంగా వాడుతున్నారు. ఎంతగా అంటే దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 4,500 మెట్రిక్ టన్నుల హెర్బిసైడ్స్ వాడుతున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ గడ్డి మందులను చాలాకాలంగా విపరీతంగా వాడటం వల్ల గడ్డి మొక్కలు సైతం నిరోధకత (రెసిస్టెన్స్)ను పెంచుకుంటున్నాయి. ఫలితంగా ఒక మందుతో కలుపు మొక్కల నివారణ పూర్తిగా సాధ్యం కావడం లేదు. దీనికోసం మరొక మందు వాడాల్సి వస్తుంది. ఈ విషరసాయనాలు అన్నీ నేలను, నీటిని విషపూరితనం చేస్తున్నాయి. ముఖ్యంగా గుర్తించాల్సిన విషయం ఏమిటంటే ఈ గడ్డి మందులు కాస్త పంటలపై పడినా ఆ పంట దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. ఈ రసాయనికి అవశేషాలు పంట ఉత్పత్తులను విషతుల్యం చేస్తున్నాయి. వీటినే మనం వినియోగిస్తున్నాం. నేల ఆరోగ్యానికే కాకపంట ఉత్పత్తులను వినియోగించేమనుషులు,జంతువులు వ్యాధుల బారిన పడుతున్నాయి. రైతులు విపరీతంగా వినియోగిస్తున్న గడ్డి మందులు, పురుగుమందులు,రసాయనిక ఎరువులు నేలను విషతుల్యం చేస్తున్నాయి. ఫలితంగా నేల గుల్ల భారీపోతుంది. సారం కోల్పోతుంది. పంటకు పనికిరాకుండా పోతుంది.ఏయేటి కాఏడు మరింత ఎక్కువ మందులు వాడితే తప్ప పంటల దిగుబడులు వచ్చే పరిస్థితులు లేవు. పర్యావరణ పరిరక్షణ గురించి ఎవరు ఆలోచించడం లేదు. ఫలితంగా ఒకప్పుడు పిచ్చుకల వంటి చిన్నచిన్న పక్షులు పంట పొలాలలో లోని పురుగులను ఏరి పట్టుకొని తినేసేవి. అలానే కప్పలు,పాములు, పీతలువంటి జంతు జాలాలు పంటలకు హాని కలిగించే పురుగుల నుండి రక్షించేవి. ఇప్పుడు వాడుతున్న విషరసాయనాల వల్ల అవి అదృశ్యమైపోతున్నాయి. ఫలితంగా రైతులు పురుగులనుండి రక్షించుకునేందుకు పురుగుమందులు విపరీతంగా వాడక తప్పడం లేదు. ఏదిఏమైనా రైతులు గడ్డి మందులతోపాటు విషపూరిత పురుగుమందులు, రసాయనిక ఎరువులవాడకం తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రకృతి సిద్ధ వ్యవసాయం వైపు కాస్తయినా మొగ్గుచూపాలి. ఇంకా మన దేశంలో 40రకాలకు పైగా హెర్బిసైడ్స్ అలానే కొన్ని ప్రాణాంతక పెస్టిసైడ్స్ ఇంకా విపరీతంగా అమ్మకాలు జరుగుతున్నాయి. కేంద్రప్రభుత్వం వీటిపై కూడా దృష్టి సారించాలి.సహజసిద్ధ ఆర్గానిక్ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే నేలను, నీటిని, పర్యావరణాన్ని రక్షించి, ప్రజారోగ్యాన్ని కాపాడిన వాళ్లమవుతాం.

ఉద్గారాల తగ్గింపే శరణ్యం!

ఐక్యరాజ్యసమితి 31వ వాతావరణ మార్పుల సదస్సు (కాప్ 31),టర్కీలోని అంటాల్యా నగర వేదిక ప్రపంచ పర్యావరణ దౌత్యంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. దశాబ్దాలుగా నడుస్తున్న 'హామీల శకం' నుంచి తక్షణ అమలు శకంలోకి ప్రపంచ దేశాలు అడుగుపెట్టాల్సిన అవసరాన్ని ఈ సదస్సు గట్టిగా నొక్కిచెప్పింది. అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక నిబద్ధతలను నెరవేర్చినప్పుడే ఈ ఒప్పందాలకు విలువ చేకూరుతుంది. 'కాప్' 31 సదస్సు కేవలం కొత్త డిక్లరేషన్లు చేసుకోవడానికి కాక, ఇప్పటివరకు చేసుకున్న ఒప్పందాలను ఆచరణలో పెట్టడానికి ఒక కీలక వేదికగా మారింది. పరిశ్రమలు, ఇంధన వినియోగం వల్ల వేడెక్కుతున్న భూగోళాన్ని కాపాడుకోవడానికి ఇదొక్కటే మార్గం. పదేళ్ల నాడు చేసుకున్న పారిస్ ఒప్పందం మేరకు అన్ని దేశాలు కలిసికట్టుగా నడచివుంటే ఈపాటికి కర్బన ఉద్గారాలు తగ్గేందుకు ఒక నిర్దిష్టమైన ప్రణాళికలు రూపుదిద్దుకొని ఉండేవి. కానీ అమెరికా పిత లాటకంతో ఆచరణ నిధుల దగ్గరే సమస్య వచ్చిపడింది. పర్యావరణ విధ్వంసం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొవాల్సిందే. లేకుంటే లావాలు, ఉప్పెనలు, ఎల్‌నినోలు నిన్న మొన్నటి నేపాలు మేఘవిస్ఫోటాలు, మానవాళిని మింగేస్తాయి. పారిస్ ఒప్పందం జరిగిన తొలినాళ్లల్లో అన్ని దేశాలు ముక్తకంఠంతో పిడికిలి బిగించినా ఆ తర్వాత తర్వాత మనకెందుకులే అని చేతులు ముడుచుకుని కూర్చున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందించే ఆర్థిక సాయాన్ని 2035 నాటికి కనీసం మూడు రెట్లు పెంచాలనే నిబద్ధతను పునరుద్ఘాటించారు.ధనిక, పారిశ్రామిక దేశాలు తమ చారిత్రక బాధ్యతను గుర్తించి, ప్రజా నిధుల రూపంలో రాయితీ సహాయాన్ని అందించాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు స్పష్టం చేశాయి.శిలాజ ఇంధనాల బొగ్గు, చమురు, గ్యాస్ నుంచి పునరుత్పాదక ఇంధన రంగానికి మారే క్రమంలో కార్మికులు, స్థానిక ప్రజల ఉపాధి దెబ్బతినకుండా "న్యాయమైన ఇంధన మార్పిడి" జరగాలని సదస్సు తీర్మానించింది. క్లైమేట్ విపత్తుల వల్ల తీవ్రంగా నష్టపోతున్న పేద, చిన్న ద్వీప దేశాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడానికి నిధిని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రతి పాదించారు. సదస్సులో భారతదేశం తన గళాన్ని స్పష్టం గా వినిపించింది. పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 9.1 ఆధారంగా అభివృద్ధి చెందిన దేశాలే వాతావరణ నిధుల బాధ్యతను మోయాలని భారత్ ఒత్తిడి ప్రారంభించింది. భూతాప పరిమితిని 1.5 సెంటీగ్రేడ్ వద్ద నిలిపివేసే పోరాటంలో ఏ దేశమూ వెనుకబడిపోకూడదని, ప్రతి దేశ అభివృద్ధి అవసరాలను గౌరవిస్తూనే ఉద్గారాల తగ్గింపు జరగా లని భారత్ పేర్కొంది. గ్లోబల్ సౌత్ దేశాల తరఫున నిల బడి, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సులభతర వాతావరణ నిధుల అందుబాటు కోసం భారత్ గట్టిగా వాదించింది. వాతావరణ మార్పుల ముప్పు అనేది ఒకే దేశానికి పరిమితమైనది కాదు. కాబట్టి బహుళపక్ష సహకారం సాంకేతిక భాగస్వామ్యం, మానవతా దృక్పథంతో కూడిన నిర్ణయాలే మన భూగోళానికి రక్షణకవచాలుగా నిలుస్తాయి. ఐక్యరాజ్య సమితి 31వ వాతావరణ మార్పుల సదస్సు టర్కీలోని అంటాల్యా వేదికగా ఈనెలలో 12 రోజులు నిర్వహించ తలపెట్టింది. టర్కీ ఆతిథ్యఅధ్యక్షత వహించగా, ఆస్ట్రేలియా, పసిఫిక్ దేశాల భాగస్వామ్యంతో చర్చల నిర్వహణ విభాగం సాగుతోంది. ఒప్పందాల అమలుపై స్పష్టమైన పురోగతి చూపించాలనే లక్ష్యంతో ఈ సదస్సును అమలు 'కాప్' 31గా పిలుస్తున్నారు. 2035 నాటికి ప్రపంచశక్తి వినియోగంలో విద్యుత్‌వాటాను 35 శాతానికి పెంచడం.వ్యర్థాల ఉత్పత్తిని 50శాతానికి తగ్గించి,సర్క్యులర్ ఎకానమీ, జీరో వేస్ట్ విధానాలను వాతావరణ చర్యల్లో భాగం చేయడం.సదస్సులో దాదాపు 100కు పైగా దేశాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని తమ కార్యాచరణను ప్రకటించారు. వాతావరణ మార్పుల పోరాటంలో మాటల కన్నా ఆచరణాత్మక ఫలితాలకే ప్రాధాన్యం ఇవ్వాలనిపిలుపునిచ్చారు. ఆస్ట్రేలియా పసిఫిక్ ద్వీప దేశాలు ఆస్ట్రేలియా, కిరిబాటి, టువాలు, సోలమన్ దీవుల నాయకులు పసిఫిక్ సముద్ర ముప్పును ప్రస్తావించారు. సముద్ర రక్షణ, పారిస్ ఒప్పంద లక్ష్యం 1.5సెంటీగ్రేడ్ నిలబెట్టడానికి వేగవంతమైన ఉద్గారాల తగ్గింపుకు కట్టుబడిఉన్నామని స్పష్టంచేశారు. పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు పెంచడం, ఇంధన పరివర్తన వేగవంతం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు భారత దేశంప్రకటించింది.అభివృద్ధి చెందిన దేశాలు ఉచిత నిధుల రూపంలో ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశాయి. రుణాలుగా ఇచ్చేఆర్థిక సహాయంవల్ల పేద దేశాలపై అప్పుల భారం పెరుగుతుందని ఖండించాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, జి7దేశాలు వార్షిక వాతావరణ ఆర్థిక సాయం గ్రాంట్లు/ పెట్టుబడుల రూపంలో పెంచడానికి ప్రాథమిక కమిట్ మెంట్ ఇస్తూనే, ప్రైవేట్ రంగాన్ని సమీకరించడంపై దృష్టి పెట్టాయి. 2035 నాటికి నిర్దేశించిన నిధులు అప్పుల రూపంలో కాకుండా, గ్రాంట్లు,రాయితీ నిధుల రూపంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందించడం ప్రపంచదేశాలుబాధ్యత తీసుకోవాలి. స్వచ్ఛమైన ఇంధనం, గ్రిడ్‌స్థిరత్వం, ఎనర్జీ స్టోరేజ్ సాంకేతికత పేద, చెందుతున్న దేశాలకు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి రావాలి. చారిత్రక ఉద్గారాలలో 70 శాతంపైగా వాటా ఉన్న అభివృద్ధి చెందిన దేశాలు ఎక్కువ బాధ్యత వహించాలి. గ్రీన్‌ట్రేడ్ పేరుతో పేద దేశాల ఎగుమతులపై ఏకపక్ష కార్బన్ పన్నులువిధించడాన్ని నివారించాలి. సముద్ర మట్టాలు పెరగడం, తుఫానులు, కరువుల వల్ల తీవ్రంగా నష్టపోతున్న ద్వీప దేశాలు, తీరప్రాంత ప్రజల పునరావాసం కోసం నిధుల పంపిణీ వేగవంతం కావలసి ఉంది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక వ్యత్యాసాలను తగ్గించి నప్పుడే ఈ సదస్సు లక్ష్యం సాకారమౌతుంది.

ఆకాశాన్ని తాకుతున్న బియ్యం ధరలు!



అన్నవరపు బ్రహ్మయ్య

'అదిగో పులి అంటే ఇదిగో తోక' అన్నట్టుగా ఎల్‌నినో కారణంగా పంటలు పండవు, కరవువచేస్తుంది.. అంటూ కొంత మంది రైస్ మిల్లర్లు, బియ్యం వ్యాపారులు బియ్యం నిల్వలను చీకటి బజారుకు తరలించడంతోపాటు బియ్యం ధరలను విపరీతంగా పెంచారు. ఎల్‌నినో ప్రభావంవల్ల ఒకవేళ వర్షాలు పడకపోతే (తుపానుల పుణ్యమా అని వర్షాలు కూడా పడుతున్నాయి) వచ్చే ఏడాది ధాన్యం కొరత ఏర్పడవచ్చు. కానీ గతసంవత్సరం,అంతకుముందు సంవత్సరం దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి జరిగింది. అందువల్ల ఈ ఏడాదే కాదు వచ్చే ఏడాది కరవు పరిస్థితులు వున్నప్పటికీ బియ్యం నిల్వలు సరిపడా వున్నాయి. అయితే సూపర్ ఎల్‌నినో పేరుతో సోషల్ మీడియాలో వచ్చే కథనాలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు బియ్యం నిల్వలను చీకటి బజారుకు తరలించడం ద్వారా కృత్రిమ కొరత సృష్టించి ధరలను విపరీతంగా పెంచారు. పైగా వచ్చే ఏడాదికి బియ్యం ధర మరింత పెరుగుతుందనే ప్రచారం చేస్తూ ప్రజలు తమ అవసరాలకు మించి కొనుగోలు చేసేలా చేస్తున్నారు. ఈ కారణంగానే బియ్యం కిలో ధర 100 రూపాయలకు చేరుకుంది. గడచినఅయిదు సంవత్సరాల రికార్డులను పరిశీలిస్తే వరి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రధానంగా గత సంవత్సరం అంటే 2020-21 నుంచి 2025-26వ సంవత్సరంలో భారత దేశం వరి ఉత్పత్తి 124.37 నుంచి 154.02 మిలియన్ టన్నులకు పెరిగి రికార్డు సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రతలో మనదేశం తన అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. దేశవ్యాప్తంగా గత సంవత్సరంలో 154.02మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి నమోదైంది. దేశ వ్యాప్తంగా అనుకూలంగా రుతుపవనాలు విస్తరించడం తోపాటు 184రకాల అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను వినియోగించడం, సాగు విస్తీర్ణం భారీగా పెరగడం అందుకు కారణం. మన తెలుగు రాష్ట్రాల విషయానికివస్తే 2025-26వ సంవత్సరంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ 2వ స్థానంలో వుంటే ఆంధ్రప్రదేశ్ 9వ స్థానంలో వుంది. ఒకవేళ ప్రపంచ వ్యాప్తంగా కరవుపరిస్థితులు వచ్చినా మన దేశానికి ఎటువంటి ఇబ్బంది వుండదు. ఎందుకంటే భారత దేశంలో అపారమైన ఆహార ధాన్యాల నిల్వలు వున్నాయి. మనదేశంలో ప్రజలు మొత్తంగా ఏడాదికి 100 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు వినియోగిస్తారు.అయితే 2026



వ సంవత్సరం మార్చి నెల నాటికి 604 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు నిల్వ వున్నట్టు ఇటీవల ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.భారతదేశం తన సొంత అవసరాలు తీర్చుకోవడమే కాకుండా, ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతిదారుగా నిలిచింది. ఈకాలంలో దాదాపు 20.1 మిలియన్ టన్నుల బియ్యాన్ని సౌదీ అరేబియా, ఇరాన్,ఇరాక్, యూఏఈ వంటి దేశాలకు ఎగుమతిచేసింది. భారతదేశంలో జరిగిన ఈ రికార్డు స్థాయి పంట ఉత్పత్తి ప్రపంచ జనాభా మొత్తానికి దాదాపు 105 రోజుల పాటు ఆహారాన్ని అందించగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానించారు. మన దేశంలో అమలులో వున్న ఆహార భద్రతాచట్టం మేరకు కేంద్రప్రభుత్వంప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన వంటి పథకాల ద్వారా దేశవ్యాప్తంగా 80 కోట్ల మంది ప్రజలకు 36 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా పంపిణీచేస్తోంది. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం కింద రాష్ట్రం ప్రతి నెల 2.35లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని చౌక ధరల దుకాణాల ద్వారా అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే బియ్యం విటమిన్ బి పోషక విలువలతో కూడి వుంటాయి.ఈ విషయం పట్ల ప్రజలకు తగిన అవగాహనలేదు. ఇదేసమయంలో ఈబియ్యం కొద్దిగా లావుగా వుండటంవల్ల ఈ బియ్యం తీసుకునే చాలా మంది ప్రజలు నిత్య అవసరాలకు వాడుకోకుండా కిలో 10నుంచి 15 రూపాయలకు అమ్ముతున్నారు. చౌకడిపో డీలర్ల ద్వారా ఈబియ్యాన్ని అందిపుచ్చుకుంటున్న రైసుమిల్లర్లు బియ్యాన్ని సన్నగా మార్చి, బ్రాండెడ్ బ్యాగులలో నింపి సన్న బియ్యంగా అమ్ముతున్నారు. ఇది చాలదన్నట్టుగా ప్రస్తుతం కృత్రిమ కొరత సృష్టించి బియ్యం ధరలను పెంచుతున్నారు. బియ్యం ధరలు ఎందుకు పెరుతున్నాయనే ప్రశ్నకు ఎవరూసమాధానం చెప్పలేరు. అంతే కాకుండా డిమాండ్ సప్లయి సూత్రం ప్రకారం కూడా తగినన్ని నిల్వలు వున్నప్పుడు ధరలు పెరగ కూడదు. కానీ అన్నిపరిస్థితులు సానుకూలంగా వున్నప్పుడు కూడాబియ్యం ధరలు పెరగడం వెనుక కుట్రదాగి వున్నట్టు కనిపిస్తోంది. కొంతమంది రైస్‌మిల్లర్లు, చీకటి వ్యాపారులు పథకం ప్రకారం ఎల్‌నినో వార్తలను అడ్డుపెట్టుకొని బియ్యం ధరలను విపరీతంగా పెంచుతున్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రాంతంలో చీకటి వ్యాపారులు అక్రమంగా నిల్వచేసిన గోడౌన్లపై అధికారులు దాడిచేశారు. ఆంధ్రప్రదేశ్లో రైతు బజార్లద్వారా పౌరసరఫరాల శాఖ తక్కువ ధరకు బియ్యం అందించడం ద్వారా బియ్యం ధరలను నియంత్రించే ప్రయత్నం చేస్తోంది. చీకటి వ్యాపారుల అక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉక్కుపాదంతో అణచివేసి, బియ్యం ధరలను అదుపులోకి తీసుకురావాలి. లేదంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల దృష్టిలో అభాసుపాలవుతాయి.

> తొందరపడి నిర్ణయాలకు రావడం అనే వ్యాయామాన్ని మూర్ఖులు మాత్రమే చేస్తుంటారు.
>
> 
>
> విలియం కాంటన్

> ప్రేమ ఉన్న చోట జీవితం ఉంటుంది. పగ ఉన్న చోట నాశనం ఉంటుంది.
>
> 
>
> మహాత్మా గాంధీ

ప్రజావాక్కు



నకిలీ మందులతో ప్రాణాలకు ముప్పు

ప్రాణాలను కాపాడాల్సిన ఔషధాలే ప్రాణాలకు ముప్పుగా మారితే అంతకంటే ఆందోళనకరమైన పరిస్థితి మరొకటి ఉండదు. దేశంలో నకిలీ, నాసిరకం మందుల సమస్య ప్రజారోగ్యానికి తీవ్రమైన సవాలుగాపరిణమిస్తోంది. అనారోగ్యంతోబాధపడుతున్న రోగులు ఎంతోనమ్మకంతో కొనుగోలు చేసేమందుల్లో నాణ్యతలోపిస్తే చికిత్స ఫలించకపోవడమే కాకుండా ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు. నకిలీమందులు,నిర్ణీత ప్రమాణాలు పాటించని ఔషధాలు రెండూ ప్రమాదకరమైనవే. ముఖ్యంగా యాంటీబయాటిక్స్, గుండెజబ్బులు, మధుమేహం, క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే మందుల విషయంలో నాణ్యత అత్యంత కీలకం. ఔషధంలో అవసరమైన మోతాదులో క్రియాశీల పదార్థం లేకపోతే వ్యాధిముదిరే ప్రమాదముంది. ఈ సమస్య నివారణకు ఔషధాల తయారీ నుంచి విక్రయం వరకు ప్రతిదశలో కఠినమైన నాణ్యతాపరీక్షలు అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

దేవుడి పేరుతో కొట్లాటలు

పనిలో, వృత్తిలో,వ్యాపారంలో ఉద్యోగంలో నిమగ్నమైన ఉన్నవారు దేవుడిపేరు చెప్పుకుంటుకొట్లాడుకోరు. దేవుడి పేరు పదేపదే ఉచ్చరించరు. చేస్తున్న పనిలోనే దేవుడు ఉన్నాడనుకుంటారు. కష్టపడి పని చేస్తారు. ఇలా కష్టపడి ఎంతోమంది కళాకారులు,వ్యాపారస్తులు, వైద్యులు, పారిశ్రామిక వేత్తలు వృద్ధిలోకి వచ్చారు. పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. వీరిలానే రాజకీయ నాయకులు తాము చేయవలసిన పనులేమిటో తెలుసుకోవాలి. ఆ పనులను చేయడంలో శ్రద్ధచూపాలి. అంతేకాని రాముడు దేవుడు, సనాతన ధర్మం అనే మాటలు వల్లె వేయడం గుళ్లు గోపురాల చుట్టూ తిరగడం, సాధువులు, సన్యాసుల కాళ్లకు మొక్కడం వంటివి రాజకీయ నాయకులు చేయవలసిన పనులు కావు.

- మిథునం, హైదరాబాద్

కళాశాలలకు ఫర్నిచర్ అవసరం

జూనియర్ కళాశాలలో గురుకులాలలో ప్రతి తరగతి గదిలో కుర్చీలు,టేబుల్, బీరువాలు,ర్యాక్‌లు, బ్లాక్ బోర్డులు, తప్పనిసరిగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. టీచింగ్ సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు, మంచి నీటి వసతి, భోజనశాల తప్పనిసరిగా ఉండే విధంగా వసతులు కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

ధర్మవిరుద్ధం

ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన మూడవ భార్య, రష్యాకు చెందిన అన్నా లెజ్‌నెవా విడాకుల ద్వారా విడిపోతున్నామని ప్రకటన చేసారు. తామిద్దరం విడిపోయినా స్నేహంగా ఉంటామని, పిల్లలను ప్రేమగా చూస్తామని చెప్పారు. వీరిద్దరి మధ్యా మనస్పర్థలు లేవు,కుటుంబ తగాదాలు లేవు, ఆస్తిపంపక వివాదాలు లేవు. అంతాబాగానే ఉంది.మరి విడిపోవాడ మెందుకో అర్థం కాదు. బహు



సోనియా ఆత్మకథలో 3 తప్పులు!

చర్చనీయాంశంగా మారిన అన్నా హజారే ఉద్యమం

ఆర్ఎస్ఎస్ స్థాపన, అహ్మద్ పటేల్ మరణం

న్యూఢిల్లీ, నవంబరు 11: కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ ఆటోబయోగ్రఫీ 'బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్' తాజాగా విడుదలైన విషయం తెలిసిందే. ఈ నెల 10న మార్కెట్‌లోకి వచ్చిన ఈ పుస్తకంపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. నెహ్రూ-గాంధీ కుటుంబానికి సంబంధించిన విషయాలు, రాజకీయ ప్రయాణం గురించి ఈ పుస్తకంలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మరోవైపు.. కొన్ని చారిత్రక, రాజకీయ సంఘటనలకు సంబంధించి ఇందులో తప్పులు దొర్లడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా మూడు కీలక విషయాల్లో వాస్తవాలు తప్పుగా పడ్డాయని రీడర్స్ గుర్తిస్తున్నారు. అన్నా హజారే ఉద్యమం.. యుపిఎ ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారిన ఈ అవినీతి వ్యతిరేక ఉద్యమం 2012లో మొదలైందని సోనియాగాంధీ తన పుస్తకంలోని 33వ చాప్టర్‌లో (పేజీ 461) రాశారు. కానీ, మహారాష్ట్రకు చెందిన సామాజిక కార్యకర్త అన్నా హజారే నేతృత్వంలో 'ఇండియా అగైన్స్ట్ కరప్షన్' ఉద్యమం వాస్తవానికి 2011లోనే దేశ వ్యాప్తంగా ఊపందుకుంది. జన లోక్‌పాల్ బిల్లు డిమాండ్‌తో 2011 ఏప్రిల్ 5న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆయన నిరాహార దీక్ష చేపట్టడంతోనే ఈ ఉద్యమం హైలైట్ అయ్యింది. అరవింద్ కేజ్రీవాల్, కిరణ్‌బేడీ, బాబా రామ్‌దేవ్ వంటి ప్రముఖులు కూడా ఇందులో భాగమయ్యారు. ఇక రెండో తప్పు రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) గురించిన చరిత్రలో ఉంది. 24వ చాప్టర్‌లో (పేజీ 338)ఆర్ఎస్ఎస్ 1921లో స్థాపించబడిందని రాశారు. కానీ, కేశవ బలిరామ్ హెడ్గేవార్ నాగ్‌పూర్‌లో 1925 సెప్టెంబరు 27న ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారు. మూడోది అత్యంత నమ్మకస్తుడైన కాంగ్రెస్ సీనియర్ లీడర్ అహ్మద్ పటేల్ మరణించిన సంవత్సరానికి సంబంధించినది. సోనియా గాంధీకి పొలిటికల్ సెక్రటరీగా పనిచేసిన అహ్మద్ పటేల్.. 2022లో కోవిడ్ మహమ్మారికి బలయ్యారని, దాంతో పార్టీలో తీరని లోటు ఏర్పడిందని 29వ చాప్టర్‌లో (పేజీ 401) పేర్కొన్నారు. అయితే అహ్మద్‌పటేల్ 2022లో కాదు, కోవిడ్ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ 2020 నవంబరు 25నే కన్నుమూశారు. ఇలా సోనియాగాంధీ రాసిన ఈ మెమోయిర్‌లో దొర్లిన ఈ మూడు పొరపాట్లు ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

ఎరువుల సబ్సిడీ రూ.62,370 కోట్లు

- ముద్రా క్రెడిట్ గ్యారంటీ నిధికి రూ.5 వేల కోట్లు
- 'స్టాండప్ ఇండియా' రుణాలకు రూ.4,111 కోట్లు
- 'యుగే యుగీన్ భారత్' మ్యూజియానికి రూ.3,230 కోట్లు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ, నవంబరు 11: ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గం సమావేశంలో రబీ సీజన్ కోసం రూ. 62,370 కోట్ల ఎరువుల సబ్సిడీని ఆమోదించింది. దీనితో పాటు, ముద్రా యోజన కింద రూ. 5,000 కోట్ల క్రెడిట్ గ్యారెంటీ నిధిని, న్యూఢిల్లీలో 'యుగే యుగీన్ భారత్ మ్యూజియంను అభివృద్ధి చేసేందుకు రూ.3,230 కోట్ల ప్రాజెక్టును కూడా ఆమోదించింది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, మంత్రివర్గ సమావేశం అనంతరం ఈ నిర్ణయాలను వెల్లడించారు. వ్యవసాయం, రుణ లభ్యత, సాంస్కృతిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన కీలక చర్యలను ఆయన వివరించారు. దేశంలో వ్యవసాయ రంగానికి అండగా నిలవడంతో పాటు పారిశ్రామికాభివృద్ధి, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు భారీ ఎత్తున నిధులను మంజూరు చేస్తూ మంత్రివర్గం కీలక ప్రకటన చేసింది. 2026-27 రబీ సీజన్‌కు సంబంధించి ఫాస్ఫేట్, పొటాషియం ఎరువులపై పోషకాధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) రేట్లను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దీని కోసం అంచనా బడ్జెట్‌గా సుమారు రూ.62,370.02 కోట్లను కేటాయించింది. గత 2025-26 రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీ బడ్జెట్ రూ.37,952.29 కోట్లుగా ఉండగా, ఈసారి రూ.24,417.73 కోట్లు అదనంగా కేటాయించడం విశేషం.

రైతులకు చౌకగా ఎరువులు

యూరియా, డిఎపి, ఎంఒపి, సల్ఫర్ తదితర ఎరువులు, ముడి పదార్థాల అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ రాయితీ రేట్లను హేతుబద్ధీకరించింది. 2010 ఏప్రిల్ 1 నుండి అమల్లో ఉన్న ఎన్‌బిఎస్ పథకం కింద, ఎరువుల తయారీదారులు, దిగుమతిదారుల ద్వారా డిఎపి, ఎన్‌పికెఎస్ గ్రేడ్‌లతో సహా 28 రకాల పి అండ్ కె ఎరువులను రైతులకు అత్యంత చౌకగా, సరసమైన ధరలకు అందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఆమోదించిన రేట్ల ప్రకారం ఎరువుల కంపెనీలకు ప్రభుత్వం నేరుగా రాయితీని చెల్లించనుంది. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా నిలిచే ఖిస్తాండప్ ఇండియాఖి పథకం కింద రుణాల మంజూరు కోసం రూ.4,111 కోట్లను కేబినెట్ ఆమోదించింది.

'ముద్రా' కింద రూ.5,000 కోట్ల రుణ హామీ నిధి

'ముద్రా' యోజన కింద రూ. 5,000 కోట్ల రుణ హామీ నిధిని మంత్రివర్గం ఆమోదించింది. ఏప్రిల్ 2015లో ప్రారంభించబడిన ఈ పథకం, బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, ఇతర అర్హతగల రుణ సంస్థల ద్వారా చిన్న వ్యాపారాలు, సూక్ష్మ సంస్థలకు సంస్థాగత రుణాలను సులభతరం చేస్తుంది.

చారిత్రాత్మక మ్యూజియం అభివృద్ధికి...

న్యూఢిల్లీలోని చారిత్రాత్మక నార్త్, సౌత్ బ్లాక్‌లను మ్యూజియంగా మార్చి, యుగే యుగీన్ భారత్ మ్యూజియంను అభివృద్ధి చేయడానికి ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ రూ. 3,230 కోట్లను కూడా ఆమోదించింది.

మ్యూజియం భారతదేశ నాగరికతా ప్రస్థానాన్ని ప్రదర్శిస్తుందని, పారిస్‌లోని లూవర్ కంటే పెద్దదిగా ఉంటుందని వైష్ణవ్ అన్నారు. ప్రతిపాదిత మ్యూజియం సుమారు 1.79 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. ప్రతి రోజూ దాదాపు 30,000 మంది సందర్శకులకు వసతి కల్పించేలా దీనిని రూపొందిస్తున్నారు.

నోయిడా మెట్రో పొడిగింపునకు ఆమోదం

గ్రేటర్ నోయిడా మెట్రో ప్రాజెక్టులో భాగంగా నోయిడా సెక్టార్51 నుండి గ్రేటర్ నోయిడా సెక్టార్04 వరకు 8.449 కిలోమీటర్ల పొడవున 5 ఎలివేటెడ్ స్టేషన్లతో కూడిన ఆక్వా లైన్ మెట్రో రైల్ కారిడార్ పొడిగింపునకు ఆమోదం తెలిపింది. ఈ కారిడార్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, నోయిడా, గ్రేటర్ నోయిడా నగరంలో 71.878 కిలోమీటర్ల క్రియాశీల మెట్రో రైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తోంది.

పెళ్లికి ముందు భారత్‌కు వచ్చి

బచ్చన్‌జీ ఇంట్లోనే ఉన్నా!

తల్లిదండ్రుల్లా కంటికి రెప్పలా చూశారు : సోనియా

న్యూఢిల్లీ, నవంబరు 11: రాజీవ్ గాంధీని పెళ్లి చేసుకోకముందు సోనియా గాంధీ మన దేశానికి వచ్చిన కొత్తలో అమితాబ్ బచ్చన్ ఇంట్లోనే ఉన్నారు. ఈ విషయాన్ని స్వయంగా సోనియా గాంధీ తన ఆటోబయోగ్రఫీలో రాసుకొచ్చారు. జనవరి 1968లో సోనియా గాంధీ ఇండియాలో అడుగుపెట్టారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో రాజీవ్ గాంధీ, ఆయన తమ్ముడు సంజయ్ గాంధీతో పాటు అమితాబ్ బచ్చన్ కూడా ఆమెను రిసీవ్ చేసుకోవడానికి వెళ్లారు. ఆ తర్వాత ఆమెను నేరుగా ప్రముఖ హిందీ కవి హరివంశరాయ్ బచ్చన్, తేజీ బచ్చన్ దంపతుల ఇరవై (13, విల్లింగ్డన్ క్రెసెంట్) ఇంటికి తీసుకెళ్లారు. అప్పట్లో ఇందిరా గాంధీకి బచ్చన్ కుటుంబంతో మంచి స్నేహం ఉండటంతో సోనియా పెళ్లికి ముందు అక్కడే బస చేశారు. ఆ కొత్త వాతావరణం, తెలియని ఆచారాలు, అస్సలు మాట్లాడలేని భాష మధ్య సోనియా చాలా ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో బచ్చన్ కుటుంబం ఆమెకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. తేజీ బచ్చన్ జాకెట్, స్లాక్స్ వేసుకుని, తలకి ఫ్రెంచ్ స్టైల్ స్కార్ఫ్ చుట్టుకుని ఎంతో ఆప్యాయంగా సోనియాను హత్తుకుని స్వాగతం పలికారు. ఆమె సోనియాకు ఓ తల్లిలా మారి అన్ని విషయాలు నేర్పిస్తూ తోడుగా నిలిచారు. రాజీవ్ గాంధీ సోనియా కోసం తన రూమ్‌ను ఎంతో అందంగా అలంకరించారు. బెడ్ వెనుక పబ్లో పికాసో బ్లూ పీరియడ్ పెయింటింగ్ రిప్రొడక్షన్ పెట్టారు. టేబుల్ మీద సువాసన వెదజల్లే గులాబీలు, రంగురంగుల రగ్గులు వేశారు. అయితే బాత్‌రూమ్‌లో పాత కార్పెట్ వేయడం వల్ల దానికి వాడిన పెస్టిసైడ్స్ ఎఫెక్ట్ సోనియాకు ఆస్తమా అటాక్ వచ్చేలా చేసింది. వెంటనే రాజీవ్, తేజీ బచ్చన్ ఆమెకు మందులు ఇచ్చి జాగ్రత్తగా చూసుకున్నారు. ఉదయాన్నే హరివంశరాయ్ బచ్చన్ కిటికీ బయట నడుస్తుంటే ఆ అడుగుల చప్పుడుతో సోనియా మెలకువ వచ్చేది. ఆ తర్వాత ఆయన శంఖం ఊదే శబ్దం, పూజా గంటల మోత వినిపించేవి. ఆయనను చూస్తే ఏదో స్టోరీ బుక్‌లోని క్యారెక్టర్‌లా అనిపించేదని సోనియా గుర్తు చేసుకున్నారు. కొద్దిగా హిందీ నేర్పించే ప్రయత్నం చేసిన హరివంశరాయ్ బచ్చన్ సోనియాతో ఒక మాట చెప్పారు. ఈ దేశంలో నువ్వు ఏంటనేది ముఖ్యం కాదు, ప్రజలు నిన్ను ఏలా చూస్తున్నారనేదే ముఖ్యమని హెచ్చరించారు. ఆయన ఎంత గొప్ప మాట చెప్పారో సోనియా గ్రహించారు. పెళ్లికి ముందు తనను కంటికి రెప్పలా చూసుకున్న బచ్చన్ దంపతులను సోనియా తన తాత్కాలిక ఫోస్టర్ పేరెంట్స్‌గాఅభివర్ణించారు. ఆ రోజుల్లో తాను పడిన ఇబ్బందులను, అమితాబ్ ఫ్యామిలీ ఇచ్చిన లవ్ అండ్ కేర్‌ను హార్పర్‌కోలిన్ పబ్లిష్ చేసిన ఈ పుస్తకంలో ఎంతో మననుకి హత్తుకునేలా రాశారు.

ఇందిర ఓటమి తర్వాత

పిల్లల్ని కూడా ఆత్మీయులు దూరం పెట్టారు

- **ఆత్మకథలో సోనియా ఉద్వేగం**

న్యూఢిల్లీ,నవంబరు 11: అప్పట్లో రాజకీయాల ప్రభావం తమపైనే కాకుండా తమ పిల్లలపైనా ఉండేదని కాంగ్రెస్ పారీ అగ్రనేత సోనియా గాంధీ గుర్తుచేసుకున్నారు. అందుకు సంబంధించిన విషయాలను తన ఆత్మకథ బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్ లో నెమరు వేసుకున్నారు. 1977 ఎన్నికల్లో ఇందిరాగాందీ ఓడిపోయిన తర్వాత అప్పటివరకు తమతో సన్నిహితంగా ఉన్న చాలామంది వ్యక్తులు క్రమంగా తమను దూరం పెట్టడం ప్రారంభించారని తెలిపారు. ఇలాంటి చర్యలు చిన్నారులైన తమ పిల్లలు రాహుల్, ప్రియాంకలను ఎంతగానో బాధించాయని సోనియాగాంధీ తెలిపారు. ఇందిరాగాంధీ ఓడిపోయిన సమయంలోనే రాహుల్‌గాంధీ పుట్టినరోజు రావడంతో ఇంట్లోనే వాడి స్నేహితులను పిలిచి చిన్న పార్టీ జరపడానికి ఏర్పాట్లు చేశామని, కానీ ఆ పుట్టినరోజుకు రాహుల్ ప్రాణ స్నేహితుడు సిద్ధార్థ్ ఒక్కడే వచ్చాడని వెల్లడించారు. ఇతర స్నేహితులెవరూ రాలేదని, ఏదో పొరపాటువల్ల పిల్లలు రాలేదని భావించి వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేశామని, అయితే వారు ఉద్దేశపూర్వకంగానే తమ పిల్లలను మా ఇంటికి పంపనట్లు తెలుసుకొని షాక్ అయ్యానని పేర్కొన్నారు. ఏడేళ్ల చిన్నారికి స్నేహితులతో ఉన్న బంధం రాజకీయాలవల్ల కలుషితమైపోయిందని తెలిసి బాధపడ్డామని, ఈ ఘటనతో రాహుల్ తీవ్ర మనస్తాపానికి గురవడంతో అత్తమ్మ, రాజీవ్ ఓదార్చారని సోనియా వెల్లడించారు. మానవ సంబంధాల విషయంలో అదే రాహుల్ నేర్చుకున్న తొలి బాధాకరమైన పాఠమని పేర్కొన్నారు. అది అంతటితో ఆగలేదని, స్కూల్‌లోనూ అత్తమ్మ, రాజీవ్‌లపై తోటి విద్యార్థులు చేసే వ్యాఖ్యలు విని రాహుల్, ప్రియాంక చాలా బాధ పడేవారని తెలిపారు. ఆ సమయంలో వారిని ఓదార్చి మా కుటుంబసభ్యులు దేశం కోసం ఎంత శ్రమించారో వివరించేదానినని వెల్లడించారు. 1978 నవంబర్‌లో చిక్కమగళూరు ఉప ఎన్నికల్లో ఇందిరాగాంధీ విజయం సాధించిన తర్వాతే పరిస్థితిలో మార్పు వచ్చిందని సోనియాగాంధీ తెలిపారు. 1980 జూన్‌లో పిల్లలకు సెలవులు ఉండడంతో తాను రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకలను తీసుకొని ఇటలీలోని మా అమ్మగారింటికి వెళ్లామని పేర్కొన్నారు. పిల్లలను ఓర్బాస్సానోలో ఉన్న తన తల్లిదండ్రుల వద్ద వదిలి తాము ఫ్లోరెన్స్ ప్రాంతానికి వెళ్లామని తెలిపారు. జూన్ 23న మా అమ్మకు ఢిల్లీ నుంచి ఫోన్ వచ్చిందని, అవతలి వ్యక్తి ఏం చెబుతున్నారో అర్థం కాకపోవడంతో ఆమె ఫోన్‌ను పదేళ్ల రాహుల్‌కు ఇచ్చిందని పేర్కొన్నారు. ఫోన్ చేసిన వ్యక్తి ఇందిరాగాంధీ వ్యక్తిగత కార్యదర్శి ఆర్‌కే ధావన్ అని, సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో చనిపోయాడని ఆయన రాహుల్‌కు చెప్పగానే తాను విన్న విషయాన్ని నమ్మలేకపోయాడని సోనియాగాంధీ తెలిపారు. రాహుల్ వెక్కివెక్కి ఏడుస్తూ బాబాయ్ చనిపోయాడని ఇటాలియన్‌లో పదేపదే చెప్పాడని, ఆ వార్త వినగానే రాజీవ్ షాక్‌తో నిశ్చేష్టులయ్యారని, ఆయనను, రాహుల్‌ను ఓదార్చడం ఎవరితరం కాలేదని పేర్కొన్నారు. తాము ఇటలీ వెళ్లడానికి ముందే విమానాన్ని నడిపే విషయంలో సంజయ్‌ను రాజీవ్ హెచ్చరించారని తెలిపారు. అవసరమైనంత ప్రాథమిక శిక్షణ లేకుండా విమానాన్ని నడపడంలో తొందరపడవద్దని రాజీవ్ సూచించారని సోనియాగాంధీ తెలిపారు. అయినప్పటికీ విమానాన్ని నడిపి ప్రమాదానికి గురయ్యారన్నారు. సంజయ్ చనిపోయిన సమయానికి ఆయన భార్య మేనకా గాంధీకి 23 ఏళ్లేనని, అప్పటికి కేవలం మూడు నెలల వయసున్న అతడి కుమారుడు వరుణ్ గాంధీ తండ్రిలేని వాడవ్వడం అందరినీ కలిచివేసిందని సోనియా గాంధీ తన పుస్తకంలో రాసుకొచ్చారు.

వారసత్వపు ఆస్తిలో మనవడికి వాటాపై సుప్రీం సంచలన తీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 11: తాత ఆస్తిలో మనవడికి వాటా ఉంటుందా తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై కొడుకు హక్కు కోరవచ్చా తండ్రి తన ఆస్తి నుంచి కొడుకును తప్పించవచ్చా ఇలాంటి ప్రశ్నలపై సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. హిందూ వారసత్వ చట్టం ప్రకారం తండ్రికి తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తి కొన్ని పరిస్థితుల్లో ఆయన వ్యక్తిగత ఆస్తిగా మారుతుందని, అలాంటి ఆస్తిపై మనవడికి పుట్టుకతోనే హక్కు ఉండదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై ఆయనకు పూర్తి యాజమాన్య హక్కులు ఉంటాయని, చట్టప్రకారం వారసత్వంగా ఆస్తి పొందిన సందర్భంలో తన కుమారులను కూడా ఆ ఆస్తి నుంచి మినహాయించవచ్చని స్పష్టం చేసింది. దాదాపు 29 సంవత్సరాలుగా



కొనసాగుతున్న ఆస్తి వివాదానికి సుప్రీంకోర్టు తీర్పుతో ముగింపు పలికింది. జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సునీతా అగర్వాల్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. 1997లో ఒక వ్యక్తి తన తండ్రి ఆస్తిలో వాటా కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తన తండ్రికి చెందిన ఆస్తి పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి అని, అది ఉమ్మడి కుటుంబ ఆస్తి కాబట్టి తనకు కూడా అందులో వాటా రావాలని వాదించాడు. అయితే ఈ వాదనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. తండ్రి ఆస్తి విభజన కోరుతూ కుమారుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. హిందూ వారసత్వ చట్టం, 1956లోని సెక్షన్ ప్రకారం హిందూ పురుషుడు వీలునామా రాయకుండా మరణిస్తే, ఆయన ఆస్తి వారసులకు బదిలీ అవుతుంది. అలా తండ్రి నుంచి వారసత్వంగా ఆస్తి పొందిన కుమారుడు ఆ ఆస్తికి పూర్తి యజమాని అవుతాడని ధర్మాసనం వివరించింది. సెక్షన్ 8 ప్రకారం వచ్చిన ఆస్తిపై అతని కుమారుడికి పుట్టుకతోనే సహ యాజమాన్య హక్కు ఏర్పడదని పేర్కొంది. తండ్రి జీవించి ఉన్న సమయంలోనే తాత ఆస్తిలో తనకు వాటా కావాలని మనవడు కోరలేడని కోర్టు స్పష్టం చేసింది

రాష్ట్రపతి భవన్ వద్ద సైనికుడిపై కాల్పులు

లక్నో, నవంబరు 11: రాష్ట్రపతి భవన్ భద్రతా విధుల్లో ఉన్న భారత సైనికుడిపై ఇద్దరు కాల్పులకు తెగబడ్డారు. పాత కక్షల నేపథ్యంలో ఈ దాడి జరగడంతో.. జవాన్‌తోపాటు ఆయన సోదరుడు గాయపడ్డారు. ప్రస్తుతం జవాన్ ఆరోగ్యం నిలకడగాఉంది. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్ జిల్లా గోపాల్‌పూర్ ఖదానా గ్రామానికి చెందిన సౌరభ్ తోమర్ (26) భారత సైన్యంలో చేరారు. రాష్ట్రపతి భవన్ భద్రతా విభాగమైన ప్రెసిడెంట్స్ బాడీగార్డ్ రెజిమెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. దీపావళి కోసం సెలవుపై స్వగ్రామానికి వచ్చారు. ఈనెల8న రాత్రి సోదరులు వినీత్, మింటూతో కలిసి ఇంటి బయట బాణసంచా కాలుస్తున్నారు. ఈ సమయంలో గ్రామానికి చెందిన ధీరజ్, అతడి సోదరుడు మోను అలియాస్‌ప్రవీణ్‌తో వాగ్వాదం జరిగింది.

పీట్ హెగ్సెత్‌పై వీగిపోయిన అభిశంసన

వాషింగ్టన్, నవంబరు 11: అమెరికా రక్షణ మంత్రి (పెంటగాన్ చీఫ్) పీట్ హెగ్సెత్‌పై అభిశంసన ప్రవేశపెట్టేందుకు జరిగిన ప్రయత్నం విఫలమైంది. ఇరాన్‌తో యుద్ధం, ఇతర దేశాల్లో చట్టవిరుద్ధ సైనిక చర్యల నిర్వహణ వంటి అంశాలపై ఆయనను పదవి నుంచి తొలగించాలనే తీర్మానాన్ని ప్రతినిధుల సభ తిరస్కరించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. హెగ్సెత్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించడంతో, రిపబ్లికన్ పార్టీ సభ్యులు దాదాపు ఏకతాటిపై నిలిచి ఈ తీర్మానాన్ని అడ్డుకున్నారు. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు థామస్ మాస్సీ, డెమోక్రాట్ల మద్దతుతో ఈ అభిశంసన తీర్మానాన్ని సభ ముందుకు తెచ్చారు. అయితే, దీనిపై జరిగిన ఓటింగ్‌లో 211204 ఓట్ల తేడాతో తీర్మానం వీగిపోయింది. ఇరాన్‌తో యుద్ధం, దాని ఫలితంగా పెరిగిన గ్యాస్ ధరల వల్లే మధ్యంతర ఎన్నికల్లో నష్టపోయామని కొందరు రిపబ్లికన్లు భావిస్తున్నప్పటికీ, ట్రంప్ మద్దతుతో హెగ్సెత్ గండం నుంచి బయటపడ్డారు. హెగ్సెత్‌పై ఎనిమిది అభియోగాలతో మాస్సీ ఈ తీర్మానాన్ని రూపొందించారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా 256 రోజులుగా ఇరాన్‌తో యుద్ధం కొనసాగించడం చట్టవిరుద్ధమని ఆయన ఆరోపించారు. చట్ట ప్రకారం కాంగ్రెస్ ఆమోదం లేని సైనిక చర్యలను 60 రోజుల్లోగా నిలిపివేయాలని ఆయన గుర్తుచేశారు. ఇరాన్‌లోని ఒక పాఠశాలపై అమెరికా జరిపిన క్షిపణి దాడిలో 168 మంది మరణించడం, యెమెన్, వెనిజులాలో సైనిక చర్యలు వంటివి ఇతర ప్రధాన అభియోగాలు. మరోవైపు నెలల తర్వాత తొలిసారి మీడియా సమావేశంలో మాట్లాడిన హెగ్సెత్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఇది దేశభక్తి కాదని, సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధ్వంసకర చర్య అని విమర్శించారు. తనపై వచ్చినవి విధానపరమైన విభేదాలే తప్ప, అభిశంసనకు అవసరమైన తీవ్రమైన నేరాలు కావని స్పష్టం చేశారు. ట్రంప్ కూడా హెగ్సెత్‌ను గొప్ప అమెరికా దేశభక్తుడు అని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతానికి ఈ అభిశంసన యత్నం ఆగిపోయినప్పటికీ, జనవరిలో ప్రతినిధుల సభ, సెనెట్‌పై డెమోక్రాట్లు పట్టు సాధించనున్నారు. ఆ తర్వాత హెగ్సెత్ అభిశంసన అంశాన్ని మళ్లీ లేవనెత్తుతామని డెమోక్రాటిక్ నేతలు హకీమ్ జెఫ్రీస్, చక్ షుమర్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. హెగ్సెత్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని, జాతీయ భద్రతను బలహీన పరిచారని వారు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ వివాదం భవిష్యత్తులో మళ్లీ తెరపైకి వచ్చే అవకాశం ఉంది.

ఒప్పందం వద్దు-యుద్ధమూ వద్దు

- **ట్రంప్ మదిలో నిర్వేదం**

వాషింగ్టన్, నవంబరు 11: ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై కొత్తగా సైనిక దాడులకు దిగకుండా, అదే సమయంలో ఆ దేశంతో తమకు అనుకూలంగా లేని శాంతి ఒప్పందం చేసుకోకుండా మధ్యే మార్గాన్ని ఎంచుకున్నారు. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత తీవ్రతరం చేయడమే తమ కొత్త వ్యూహమని స్పష్టం చేశారు. జీ7 విదేశాంగ మంత్రుల సమావేశంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ వ్యూహాన్ని బయటపెట్టారు. అధ్యక్షుడి ముందు యుద్ధం లేదా బలహీనమైన ఒప్పందం అనే రెండే మార్గాలు లేవు. మేము అర్థంలేని ఒప్పందం చేసుకోబోం. ప్రస్తుతం చేస్తున్నదాన్నే కొనసాగించడం మూడో మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా బలహీనపరిచి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాయుధ గ్రూపులకు నిధులు అందకుండా చేయాలని అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడం కూడా దీని వెనుక ఉన్న ఉద్దేశం. సోమవారం ఖతార్ ప్రధానితో భేటీ అనంతరం ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై సైనిక దాడికి అవకాశం చాలా తక్కువని అన్నారు. ప్రస్తుత ఆర్థిక ఒత్తిడి, నావికా దిగ్బంధనం కొనసాగుతాయని తెలిపారు. దీంతో పాటు ఇరాన్‌కు ఆయుధాలు, సాంకేతికత అందకుండా భూ



మార్గాలను మూసివేయడానికి ఐరన్ గేట్ అనే కొత్త ఆపరేషన్‌ను కూడా చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయానికి విదేశాంగ మంత్రి రూబియోతో పాటు ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, ట్రంప్ సలహాదారు జారెడ్ కుష్నర్ వంటి కీలక వ్యక్తులు మద్దతు తెలిపారు. అయితే, అమెరికా అనుసరిస్తున్న ఈ కఠిన వైఖరిపై టర్కీ, ఇరాక్, పాకిస్థాన్ వంటి కొన్ని మిత్రదేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. శాంతి చర్చల దిశగా వెళ్లకుండా, ఒత్తిడిని పొడిగించడం సరికాదని ఆ దేశాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుతం అమెరికా నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తుండగా, ఇరాన్ మాత్రం తమ షరతుల ప్రకారమే ఒప్పందం జరగాలని పట్టుబడుతోంది. అయితే, ఇరాన్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవని వాషింగ్టన్ తేల్చిచెబుతోంది. దీంతో ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది.

సంక్షిప్త వార్తలు

పాక్ మాజీ పిఎం ఇమ్రాన్‌ఖాన్ కంటికి చికిత్స



ఇస్లామాబాద్, నవంబరు 11: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను కంటి చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాకిస్థాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ పార్టీ వ్యవస్థాపకుడైన ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి జైలులో ఉంటున్న విషయం తెలిసిందే.100కుపైగా కేసులు ఆయనపై ఉన్నాయి. అవినీతి, హింసను ప్రేరేపించిన కేసుల్లో ఇమ్రాన్ నిందితుడు. రావల్పిండిలోని అడియాలా జైలులో అతన్ని నిర్బంధించారు. అయితే జనవరి నుంచి ఇమ్రాన్ ఖాన్ తన కుడి కన్నుకు చికిత్స చేయించుకుంటున్నారు. చూపు మందగించినట్లు ఫిర్యాదు చేయడంతో చికిత్స ప్రారంభమైంది

కుల్గాంలో జవాన్లపై కాల్పులు, ముగ్గురికి గాయాలు

శ్రీనగర్, నవంబరు 11: జమ్మూ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై కాల్పుల ఘటన కలకలం రేపింది. జిల్లాలోని ఓ చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై బైక్‌పై వచ్చిన దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై సీఆర్‌పీఎఫ్ అధికారులు కేంద్ర హోంశాఖకు నివేదిక అందించారు.



మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండగులు కుల్గాం జిల్లాలోని ఓ నాకా వద్ద విధులు నిర్వహిస్తున్న జవాన్లపై ఆరు రౌండ్ల కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు.

కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాల మూసివేత



డెహ్రాడూన్, నవంబరు 11: ఉత్తరాఖ

తెలంగాణ ప్రజల వ్యాదయాల్లో చిరస్థాయిగా నిలిచే జ్ఞాపకం సోనియా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: సోనియాగాంధీ తన ఆలోచనలు, సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని ఒక విశిష్ట పుస్తకరూపంలో ప్రజల ముందు ఉంచడం ఎంతో గర్వకారణమని, హర్షణీయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ట్విటర్ వేదికగా, ఈ పుస్తకం తెలంగాణ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియాగాంధీ చూపిన చొరవ, రాష్ట్ర సాధనతో ఆమెకున్న ప్రగాఢ అనుబంధం తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ ఒక చిరస్మరణీయ అధ్యాయంగా మిగిలిపోతుందని కొనియాడారు. ఈ పుస్తకం కేవలం అక్షరాల సమాహారం కాదని, తెలంగాణ ప్రజలతో సోనియాగాంధీకి ఉన్న ఆత్మీయ బంధం, ఆమె నిబద్ధత,ఒక అపురూపమైన చారిత్రక వారసత్వానికి సజీవ ప్రతిబింబమని మంత్రి స్పష్టం చేశారు. ఎనలేని గౌరవం, ప్రగాఢ కృతజ్ఞతా భావంతో తెలంగాణ సమాజం తరఫున ఈ విశిష్ట రచనను మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ అభినందనలు తెలియజేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు.

చరిత్రాత్మక సంఘటనలను అక్షరీకరించిన 'సోనియా'

పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: చరిత్రాత్మక సంఘటనలను 'బిలాంగింగ్ : ఎ జెర్నీ ఆఫ్ లవ్' పుస్తకంలో కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ అక్షరీకరించారని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వివరించారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీ రచించిన 'బిలాంగింగ్ : ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం మంగళవారం మార్కెట్లోకి విడులైందని, ఆ పుస్తకంలో ఎన్నో బాధాకరమైన వాస్తవాలు ఉన్నాయని చెప్పారు. పుస్తకంలో తన జీవితంలోని సోనియా అనుభవాలను వెల్లడించారని ఆయన చెప్పారు. విదేశాల్లో పుట్టినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించిన ఆదర్శ మహిళ సోనియా అని కొనియాడారు. దేశ రాజకీయాలను ఆకళింపు చేసుకుని పార్టీని నడిపిస్తున్న నాయకురాలని కీర్తించారు. 2004లో ప్రధాని పదవిని త్యజించిన ఘనత సోనియాగాంధీదే అని అన్నారు. మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేసిన ఘనత సోనియాదేనని, త్యాగధనుల కుటుంబానికి కోడలిగా సోనియాగాంధీ ప్రస్థానం మొదలైందని చెప్పారు. ఇందిరా గాంధీ, సంజయ్‌గాంధీ, రాజీవ్‌గాంధీల మరణాలతో తీవ్ర మానసిక వేదనకు గురైందని తన జీవితంలోని విషాదాలను పుస్తకంలో సోనియా వివరించారని తెలిపారు. సోనియా పుస్తకంపై రాజకీయ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ సోనియాగాంధీ రచించిన పుస్తకాన్ని చదవాలని ఆయన సూచించారు.

దేశ విద్యావిధానం రూపొందించిన దార్శనికుడు

మౌలానా అబుల్‌కలాం జయంతి వేడుకల్లో మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: దేశ విద్యావిధానం రూపొందించిన మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అనేక మెరుగైన ఆలోచనలు అందించిన గొప్ప దార్శనికుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కొనియాడారు. బుధవారం గాంధీభవన్‌లోని ప్రకాశంహాల్‌లో అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి మహేష్‌కుమార్ పూలమాలవేసి జయంతి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలు గుర్తుచేసుకొన్నారు.

బ్లూకోల్ట్స్ సిబ్బందికి నగదు రివార్డుతో పోలీస్ కమిషనర్ అభినందనలు

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య బ్యాంకు చోరీకి యత్నించిన ముగ్గురిని పట్టుకున్న బ్లూ కోల్ట్స్ సిబ్బందిని నగదు రివార్డుతో బుధవారం ఆర్మూర్‌లో అభినందించారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెర్కిట్ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఇండియన్ బ్యాంక్ స్ట్రాంగ్ రూమ్‌లో చోరీ చేసేందుకు ప్రయత్నిస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు నిందితులను విధి నిర్వహణలో ఉన్న ఆర్మూర్ పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది ఎస్. నాగరాజు (పిస్టి426), ఎన్. అశోక్ (పిసి1937) లు అప్రమత్తతతో, చాకచక్యంగా పట్టుకొన్నారు. బ్యాంకు వంటి కీలకమైన ఆర్థిక సంస్థలో చోరీకి యత్నిస్తున్న నిందితులను సకాలంలో గుర్తించి పట్టుకోవడం ద్వారా పెద్ద నేరం జరగకుండా సమర్థవంతంగా అడ్డుకున్న బ్లూ కోల్ట్స్ సిబ్బంది విధి నిర్వహణను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంబంధిత బ్లూ కోల్ట్స్ సిబ్బందికి నగదు రివార్డులు అందజేసి , వారి విధి నిర్వహణ పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు, రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ అనుమానాస్పద వ్యక్తులు , కార్యకలాపాలను గుర్తించి తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీసుల అప్రమత్తత , సమయస్ఫూర్తి , విధి పట్ల అంకితభావం ప్రజల ఆస్తులు , ప్రాణాల రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని , విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే సిబ్బందిని పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రబీలో పంటల వైవిధ్యీకరణ

కొత్తగా ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్

పైలట్ ప్రాజెక్ట్

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: తెలంగాణల ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ యాసంగి సీజనులో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతుల్లో అవగాహన కల్పిస్తోంది. ఇందుకు గాను ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్ అనే సరికొత్త పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి పంటల వైవిధ్యీకరణలో రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఒకే రకమైన సాంప్రదాయ పంటలపై ఆధారపడకుండా, అధిక లాభాలనిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా భావిస్తున్నారు. విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడించిన వివరాలు ప్రకారం దిగుబడిలో వ్యత్యాసాలను తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంచే ప్రయత్నంలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తోంది. ఇందుకు గాను రాష్ట్రంలోని 12 ప్రాంతాలు ముఖ్యంగా ఆదిలాబాద్, జగిత్యాల, కంపాసాగర్, పాలెం, తాండూర్, మధిర, వరంగల్, రుద్రూర్, తోర్నాల, కరీంనగర్, బసంత్‌పూర్, కునారం ఉన్నాయి. ఈ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల ద్వారా ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తున్నారు. ప్రతి కేంద్రంలో నలుగురు శాస్త్రవేత్తలతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిఆ కేంద్రాల పరిధిలోని నాలుగు గ్రామాలను ఎంపిక చేశారు. వారిలో నుండి 20 నుండి 25 మంది ప్రగతిశీల రైతులను గుర్తించి, వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ బృందాలు నేరుగా రైతుల పొలాల్లోనే ఆధునిక సాంకేతిక సాగు పద్ధతులపై శిక్షణ ఇస్తాయి. పంట సాగు ప్రారంభం నుండి కోతల వరకు ప్రతి దశలోనూ రైతులకు వీరు మార్గదర్శకత్వం వహించనున్నార. ప్రధానంగా పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుపై దృష్టిసారిస్తారు. ఈ వైవిధ్యీకరణలో భాగంగా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుపై రైతులకు ప్రధానంగా అవగాహన కల్పిస్తున్నారు.

ధాన్యం మార్కెట్లకు వస్తున్నా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

పైవేటులో రైతుల అమ్మకాలు

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: ఈ యేడాది ఎల్‌నినో పరిస్థి తులు, వర్షాభావం వల్ల పంటల సాగు తగ్గింది. వచ్చిన కొద్దిపాటి పంటను విక్రయించేం దుకు రైతులు సిద్ధమవ్వగా అక్టోబరు నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమ య్యాయి

వానకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, సుమారు 120 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో రూ.18,250 కోట్లతో 65 లక్షల టన్నుల ధాన్యం సేకరించడానికి రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

అక్టోబర్ 1 నాటికే ఇవి అందుబాటులోకి వస్తాయని చెప్పినా విడతల వారీగా కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలో ముందస్తుగానే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

అలాగే మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలోనూ కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించినట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నెలలో కోతలు పూర్తిస్థాయికి చేరినా ప్రభుత్వ కొనుగోళ్లు కేంద్రాల్లో ఆశించిన వేగవంతంగా జరగడం లేదని తెలుస్తోంది. దీంతో తుపాన్ల భయంతో రైతులు తమ పంటను తొందరంగా అమ్ముకునేందుకు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో వరి ధాన్యం కోతలు దాదాపు పూర్తవుతున్నా కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఆశించినంత వేగంగా ముందుకు సాగడం లేదు. ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలు పూర్తిగా ప్రారంభం కాలేదు.

కాంటాలు వేసిన చోట కూడా మిల్లులకు తరలించలేదు. అందులోనూ దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లే ప్రారంభించారు. సన్న రకం ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభించలేదు. దాంతో ఎక్కడికక్కడా ధాన్యం రాశులు పేరుకుపోయాయి. నల్లగొండ జిల్లాలో మొత్తం 284 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా, ఇప్పటివరకు 39 కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి.

ఈ విధంగానే రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళు పరిస్థితులు ఉన్నాయని రైతు సంఘాలు చెబుతున్నాయి. కాగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన చోట్ల రైతులకు చెల్లింపులకు సంబంధించిన వివరాలు ఇంకా నమోదు కాలేదు. చెల్లించిన మొత్తం, బకాయిలు, చెల్లింపులు పొందిన రైతుల సంఖ్యకు సంబంధించిన గణాంకాలు లేకుండా ఉన్నాయి.

కేంద్రాల ప్రారంభమే కాకపోగా, కొనుగోలు చేసిన చోట్ల ధాన్యాన్ని కూడా మిల్లులకు తరలించే ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ చిట్స్, మిల్లుల నుంచి అందాల్సిన అక్నాలెడ్జ్మెంట్ వివరాలు ఇప్పటివరకు సున్నాగా నమోదయ్యాయి. కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు చేరినట్టు సంబంధిత రికార్డుల్లో ఇంకా నమోదు కాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ పంపిణీ పటిష్టం

నిరంతర విద్యుత్ అందించాలి

దక్షిణ తెలంగాణ పంపిణీ సంస్థ సిఎండి జితేష్

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: తమ సంస్థ పరిధిలోని జిల్లాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్నారు.

ప్రతి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను (డిటిఆర్) సంబంధిత ఫీడర్‌తో, వినియోగదారుల సర్వీసులను డిటిఆర్ స్ట్రక్చర్‌తో అనుసంధానిస్తూ మ్యాపింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

డిటిఆర్ వైఫల్యాలకు గల కారణాలను విశ్లేషించి, డిసెంబర్ నెలాఖరులోగా నివారణ చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జనవరి నుంచి నిరక్ష్య్ల్ల కారణంగా జరిగే వైఫల్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల భద్రత దృష్ట్యా ప్రతి గ్రామంలోని గృహ విద్యుత్ సరఫరా డిటిఆర్ వద్ద ఎబి స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, ఈ పనులను వచ్చే నెల 31లోగా పూర్తి చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రవాణాకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన పరిహారంలో జాప్యం ఉండకూడదన్నారు.

300 ఆంపియర్లకు పైగా లోడ్ ఉన్న 33 కేవీ ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ఓవర్‌లోడ్ ఫీడర్ల బైఫర్కేషన్, బ్యాక్ ఫీడింగ్ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని బిఇఎస్ఎస్, కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు వంటి ఆధునిక సాంకేతిక పరిష్కారాలను పరిశీలించాలన్నారు. ఎఐ ఆధారిత ఫిర్యాదుల గుర్తింపు, వాయిస్ బాట్ ద్వారా వినియోగదారులకు మరమ్మతుల సమాచారం అందించే విధానాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ లైన్లు, పోల్స్, కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు.

పసుపు క్వింటాల్ ధర రూ. 28,111

మోడల్ ధర రూ. 24200

తెల్ల అల్లం ధర క్వింటాల్‌కు రూ. 16,051

హైదరాబాద్, నవంబరు 11,ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లా మార్కెట్‌లో బుధవారం పసుపు ఫింగర్ రకంకు ధర క్వింటాల్‌కు రూ.28111 పలికింది. పసుపు బల్బురకం క్వింటాల్‌కు 23096రూపాయలు, చూరా రకం క్వింటాల్‌కు 25111రూపాయలు గరిష్ఠంగా ధర పలకింది. పసుపు ఫింగ్ రకం మోడల్ ధర క్వింటాల్‌కు రూ.24200,బల్బు మోడల్ ధర రూ.22111 కనిష్ఠధర క్వింటాల్‌కు 12506రూపాయలు పసుపు చూర మోడల్ ధర 19000 కాగా కనిష్ఠ ధర 11006 చెల్లించారు. పసుపు ఫింగర్ రకం 1458క్వింటాళ్ళు,బల్బురకం 628క్వింటాళ్ళు ,పసుపు చూర 103 క్వింటాళ్ళు అమ్మకానికి వచ్చింది. సోయాబిన్స్‌కు క్వింటాల్‌కు 7111రూపాయలు పలికింది. సోయ 650క్వింటాళ్ళు అమ్మకానికి రాగా మోడల్ ధర 7051క్వింటాల్‌కు పలికింది కనిష్ఠ ధర 6251 చెల్లించారు.తెల్ల అల్లంకు క్వింటాల్‌కు 16051రూపాయలుఅత్యధిక ధర చెల్లించగా మోడల్ ధర 15629చెల్లించారు కందులు క్వింటాల్‌కు 6700,మొక్కజొన్నలు 2934చెల్లించి కొనుగోలు చేశారు. మోడల్ ధర క్వింటాల్‌కు 2727 పలికింది.

'భారత్ సమ్మిట్' కాదు.. యాంటీ భారత్ సమ్మిట్

కాంగ్రెస్ సదస్సు వెనుక రాహుల్‌గాంధీ రాజకీయ లీలాంచ్ కుట్ర

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర చీఫ్ ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌పై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తీవ్రవిమర్శలు చేశారు. ఇది అసలు భారత్ సమ్మిట్ కాదని, పక్కా యాంటీ భారత్ సమ్మిట్ అని అభివర్ణించారు. భారతదేశానికి వ్యతిరేకంగా కుట్రలు చేసే విదేశీ శక్తులకు ఈ సదస్సు వేదికగా మారుతోందని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న దేశాలు, వ్యక్తులు ప్రోగ్రెసివ్ అలయెన్స్ పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డారని, అందులో రాహుల్ గాంధీ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీతో ఈ కూటమికి చెందిన నాయకులు దిగిన ఫొటోలను పరిశీలిస్తే వారి సంబంధాలు స్పష్టమవుతాయని వ్యాఖ్యా నించారు. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధుల బృందంతో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే న్యూఢిల్లీలో సమావేశమయ్యారని, 10 జనపథ్‌లో సోనియా గాంధీ సైతం వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ సంస్థ వెనుక జార్జ్ సోరోస్ వంటి భారత వ్యతిరేక శక్తులు ఉన్నాయని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజా స్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల దోసేం దుకు రెజీమ్ చేంజ్ పేరుతో కుట్రపూరిత కార్యకలాపాలు సాగిస్తున్నాయని విమర్శించారు. స్పెయిన్, ఫ్రాన్స్, అల్బేనియా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో ఈ కూటమి తీవ్ర అలజడులకు కారణమైందని ఆరోపిం చారు. ఇప్పుడు అదే శక్తులను భారత్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నం జరుగు తోందని అన్నారు. ఇలాంటి విదేశీ శక్తుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ నిర్వహించడం వెనుక అసలు ఉద్దేశం రాజకీయంగా విఫలమైన రాహుల్ గాంధీని మళ్లీ ప్రజల ముందుకు తీసుకురావడమేనని విమర్శించారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షిం చేందుకు ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తే తమకు అభ్యంతరం లేదని, అయితే భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులతో కలిసి సదస్సులు నిర్వహించడం సరికాదని అన్నారు.ప్రోగ్రెసివ్ అలయెన్స్‌లోని దేశాల్లో 42 దేశాలు ఇస్లామిక్ దేశాలని, మిగిలినవాటిలో ఎక్కువ దేశాలు వామపక్ష భావజాలం కలిగినవని రాంచందర్ రావు పేర్కొన్నారు. భారతదేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అశాంతి సృష్టించేందుకు విదేశీ శక్తులు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ విజన్‌ను వినాలని కాంగ్రెస్ నేతలు చెబు తున్నా రని, ఇప్పటికే దేశ ప్రజల మద్దతు కోల్పోయిన రాహుల్ గాంధీని 100 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల సమక్షం లో ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రొజెక్ట్ చేయాలని చూస్తు న్నారని విమర్శించారు. విదేశీ ప్రతినిధులను అడ్డు పెట్టుకుని రాహుల్ గాంధీని రాజకీయంగా తిరిగి లాంచ్ చేయాలనుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యా నించారు. భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులు, ప్రోగ్రెసివ్ అలయెన్స్ అండతో హైదరాబాద్‌లో నిర్వహి స్తున్న ఈ సదస్సును బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఎన్. రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

బిఆర్ఎస్ నేతలకు ఆస్తులు, తెలంగాణ ఉద్యమకారులకు ఆత్మహత్యలు

ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో వందల ఎకరాలు భూములు, ఫామ్‌హౌస్‌లుగా కెసిఆర్, హరీశ్‌రావు కుటుం బాలకు ఆస్తులు పెరిగాయనీ తెలంగాణ ఉద్యమ కారులు మాత్రం ఆత్మహత్యలు మిగిలాయనీ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఆవేదన చెం దారు. బుధవారం సిఎల్‌పిలో మీడియాతో మా ట్లాడుతూ హరీశ్‌రావు తెలంగాణ ఉద్యమంలో రెచ్చగొట్టడం వల్లే 1,200 మంది చని పోయా రనీ, అధికారంలోకి వచ్చాక కూడా బిఆర్ ఎస్ పార్టీ ఉద్యమకారులను పట్టించుకోలేదనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. మా ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసి వాళ్ల సమస్యలు తెలుసుకుంటోందనీ, చనిపోయిన తర్వాత హరీశ్‌రావు వంటి వాళ్లు పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారనీ ఉద్యమకారులను ఉపయో గించుకుని కెసిఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఆరోపించారు. జనగామ జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్న రోజున బిఆర్ఎస్ నాయకులు ఎందుకు వెళ్లలేదు..?వారం తర్వాత హరీష్ రావు వెళ్లి రాజకీయం చేస్తున్నాడనీ విమర్శించారు..తెలంగాణ ఉద్యమంలో పాల్గొని నేను నష్టపోయానని ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ తన లేఖలో పేర్కొంటే దానిని వక్రీకరిస్తూ ప్రభుత్వం తీరు వల్లే చనిపోయాడని హరీష్ రావు మాట్లాడుతున్నాడనీ అన్నారు.

మేం ఆ కుటుం బాన్ని పరామర్శించి ఐదు లక్షల రూపాయల సాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాం.. ఆయన భార్యకు ఉద్యోగం ఇప్పించడానికి ప్రయత్నం చేశామనీ అన్నారు. బిజెపి నేతలు భారత్ సమ్మిట్ దేశ వ్యతిరేక సమ్మిట్ అంటు ప్రచారం చేయడం తగదని, అలా అయితే కేంద్ర ప్రభుత్వం ఎలా అనుమతి ఇచ్చింది..? అని అడిగారు. మోడీ, అమిత్‌షా తప్పు చేశారా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా వెళ్లానంటే కేంద్రం అడ్డుకుందనీ బిజెపి జాతివ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. అమెరికాలో ఉన్న పెద్ద కంపెనీలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కోసం ఎదురుచూశాయి,రేవంత్ రెడ్డి పేరు వస్తుందన్న భయంతో సిఎం అమెరికా పర్యటనను అడ్డుకున్నారనీ ఆరోపించారు.దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన శ్యామ్ పిట్రోడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారనీ బిజెపి మాత్రం దేశంలో విదగొట్టే విప్లవాన్ని తీసుకొచ్చిందనీ అన్నారు.మతం, కులం, ప్రాంతం, లింగ భేదాలు బిజెపి సృష్టిస్తోందనీ ఆరోపించారు. దేశ ప్రజలను బిజెపి అన్ని రకాలుగా మోసం చేస్తోందనీ పాకిస్థాన్‌ను శత్రువు అని ప్రచారం చేసి, ఆ దేశ ప్రధాని మనవరాలి పుట్టినరోజుకు వెళ్లి మన ప్రధానమంత్రి పాయసం తిని వచ్చారని గుర్తుచేశారు. బిజెపి జాతీయవాదం అంటే మనువాదమే.. కనీసం అది హిందుత్వవాదం కూడా కాదు అని ఆరోపించారు.

భారత్ సమ్మిట్‌పై విషం కక్కడం రాంచందర్‌రావుకు తగదు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: భారత్ సమ్మిట్‌పై బిజెపి తెలం గాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విషం కక్కడం తగదని భారత్ వ్యతిరేక సదస్సు అయితే దానికి అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వంను కూడా తప్పుపడుతున్నారా అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నిం చారు. బుధవారం సిఎల్‌పిలో మీడియాతో మాట్లాడతూ .ప్రోగ్రెసివ్ థాట్స్‌ను ముందుకు తీసుకెళ్తే మతోన్మాద బిజెపికి దేశంలో నూకలు చెల్లుతాయని భయపడుతున్నాడని ప్రజాస్వామ్యం బలోపేతం అయితే మోడీ, అమిత్‌షా కథ ముగుస్తుందని రామచందర్‌రావు వణికి పోతున్నాడని దేశ వ్యతిరేక శక్తులంటూ రామచందర్‌రావు పిచ్చి వాగుడు వాగుతున్నాడనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమ్మిట్‌కు 100 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారనీ ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తులు, సంస్థలు ఇందులో ఉన్నారని వివరించారు. ఈ సమ్మిట్‌కు అనుమతి ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమనీ, ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్న వాళ్లకు వీసాలు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రామచందర్ రావు చెప్పినట్లు యాంటీ భారత్ సమ్మిట్ అయితే మోడీ నాయకత్వంలోని కేంద్ర =ప్రభుత్వం ఎందుకు అనుమతి ఇచ్చింది? భారత్ సమ్మిట్‌పై రామచందర్‌రావు తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రగతిశీల ఆలోచనలను మరింత ముందుకు తీసుకెళ్లడమే భారత్ సమ్మిట్ ఉద్దేశమనీ ఆయన వివరించారు. హైదరాబాద్ వేదికగా రాహుల్‌గాంధీ ఈ దేశానికి, ప్రపంచానికి ప్రగతిశీల ఆలోచనలను మరింత ముందుకు తీసుకెళ్లే గొప్ప సందేశాన్ని ఇవ్వబోతున్నారని ఆయన తెలిపారు. రాంచందర్‌రావు.. రాహుల్‌గాంధీ సభ జోలికి వస్తే మీ బిజెపి నాయకులు భవిష్యత్తులో తెలంగాణలో అడుగు కూడా పెట్టలేరు.. జాగ్రత్త అని అన్నారు. మతాలు, కులాలు, ప్రాంతాలను రెచ్చగొట్టాలన్న కుచిత ఆలోచనలతోనే బిజెపి ఉందనీ ప్ర

'పరివర్తన రాజనీతి పార్టీ'ని ప్రకటించిన విజయసాయిరెడ్డి

కాషాయం, తెలుపు రంగు మధ్యలో అశోకచక్రంతో కూడిన పార్టీ జెండా ఆవిష్కరణ

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా టిటిడి ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు ఒ.వి.రమణ

విజయవాడ, నవంబరు 11, ప్రభాతవార్తప్రతినిధి: యువతరం ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో శక్తివంతమైన ప్రత్యామ్నాయం ఏర్పాటు లక్ష్యంగా నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీ. విజయసాయిరెడ్డి తెలిపారు.తమ పార్టీకి ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా అన్నారు..విజయవాడలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ పేరును పరివర్తన రాజనీతి పార్టీగా వెల్లడించారు. కాషాయం, తెలుపు రంగు మధ్యలో అశోకచక్రంతో కూడిన పార్టీ జెండాతో పాటు పార్టీ పేరును ఆవిష్కరించారు. దేశం కోసం ధర్మం కోసం నినాదంతో పీఆర్‌పీని ఏర్పాటు చేశారు.విజయవాడలోని ఏ 1 కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం, నవంబర్ 11న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు, 111111 ముహూర్తంలో పార్టీని ప్రకటించారు.పార్టీ పేరును పరివర్తన రాజనీతి పార్టీ సంక్షిప్తంగా పీఆర్పీ అని తెలిపారు. అంతేకాకుండా తెలుపు.కాషాయం మధ్యలో ధర్మచక్రంతో కూడిన జెండాను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ జెండాలో ..పైభాగంలో కాషాయం రంగు, కింది భాగంలో తెలుపు రంగు, మధ్యలో ధర్మచక్రం.. ఉంది. దీన్ని కొందరు అశోక చక్రాన్ని పోలిన చక్రంగా, మరికొందరు శ్రీకృష్ణుడి సుదర్శన చక్రం తరహాలో ఉన్న ధర్మచక్రంగా వర్ణిస్తున్నారు.కాషాయం త్యాగానికి, ధర్మానికి, దేశభక్తికి ప్రతీక అయితే, తెలుపు స్వచ్ఛతకు, శాంతికి, నిజాయితీ రాజకీయాలకు ప్రతీక. మధ్యలో ఉన్న ధర్మచక్రం ధర్మబద్ధమైన పాలనకు, న్యాయానికి, నిరంతర పరివర్తనకు సంకేతం. పేరుకు తగ్గట్టుగానే జెండాను రూపొందించామని వెల్లడించారు. పార్టీ ప్రధాన నినాదం దేశం కోసం ధర్మం కోసం అంటూ విజయసాయిరెడ్డి ఉద్వేగంగా మాట్లాడారు.ప్రజల బాధ్యత ఓటు వేయడంతో అయిపోదు. తప్పు చేసిన వారిని ఆధారాలతో సహా ప్రశ్నించాలి. మంచి పని చేసిన వారిని ఏ పార్టీ వారైనా సరే మెచ్చుకోవాలి. ప్రశ్నించడం ప్రజల హక్కు" అని ఆయన పిలుపునిచ్చారు.



పిఆర్పీని ప్రకటిస్తున్న విజయసాయిరెడ్డి

రాష్ట్రాన్ని కేవలం రెండు కుటుంబాలే పాలించాలా? ఆ రెండు కుటుంబాలే ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలను శాసించాలా? ఆ కుటుంబాల నుంచే ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రావాలా?" అని ఆయన సూటిగా నిలదీశారు. నేను ముఖ్యమంత్రి కావాలని ఈ పార్టీ పెట్టలేదు. నాకు గానీ, నా కుటుంబ సభ్యులకు గానీ సీఎం పదవిపై ఎలాంటి ఆశ లేదు. ఈ పార్టీ మరో నాయకుడిని సృష్టించడానికి కాదు, యువతలోని నాయకత్వ లక్షణాలను బయటకు తీసుకురావడానికి పెట్టాను. ప్రతి సామాజిక వర్గం నుంచి, ప్రతి కులం నుంచి కొత్త నాయకులను తయారు చేస్తాం. వంశపారంపర్య రాజకీయాలకు ముగింపు పలుకుతాం" అని విజయసాయిరెడ్డి ప్రకటించారు.అధికార టీడీపీ కూటమి, ప్రతిపక్ష వైఎస్ఆర్సీపీ రెండింటిపైనా ప్రజలు విసుగు చెందారని, రాష్ట్రంలో స్పష్టమైన రాజకీయ శూన్యత ఏర్పడిందని, ఆ శూన్యాన్ని భర్తీ చేయడానికే పరివర్తన రాజనీతి పార్టీ పుట్టిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ వదిలిన శూన్యాన్ని తమ పార్టీ భర్తీ చేస్తుందని, తెలుగు ప్రజలకు ఇది నిజమైన ప్రత్యామ్నాయ పార్టీగా ఉంటుందని అన్నారు.

2029లో 175 స్థానాల్లో పోటీ

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల్లోనూ పీఆర్పీ పోటీ చేస్తుందని విజయసాయిరెడ్డి ప్రకటించారు. ప్రతి నియోజకవర్గంలో కొత్త నాయకత్వాన్ని తయారు చేస్తామని చెప్పారు. తెలంగాణలో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిన అంశాన్ని అక్కడి ప్రభుత్వంతో లేవనెత్తుతామని కూడా చెప్పారు.

ఐఎన్ఎస్ బెత్వా ఆధునీకరణకు రూ.499 కోట్లు

కొచ్చి షిప్‌యార్డుతో రక్షణ శాఖ ఒప్పందం

కొచ్చి, నవంబరు 11: భారత రక్షణ మంత్రిత్వ శాఖ నౌకాదళ విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇవాళ కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఐఎన్ఎస్ బెత్వా యుద్ధనౌక సమగ్ర పునరుద్ధరణ, ఇంజిన్ వ్యవస్థ మార్పు కోసం కొచిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ తో రూ.498.58 కోట్ల విలువైన ఒప్పందంపై సంతకం చేసింది. న్యూఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందం అధికారికంగా పూర్తయింది. భారత నౌకాదళానికి చెందిన ప్రతిష్టాత్మక బ్రహ్మపుత్రక్లాస్ ఫ్రిగేట్ అయిన ఐఎన్ఎస్ బెత్వా ఈ ఒప్పందం ద్వారా భారీ సాంకేతిక మార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఈ యుద్ధనౌకలో ఉన్న పాత స్టీమ్ ఆధారిత ప్రొపల్షన్ సిస్టమ్‌ను తొలగించి, దాని స్థానంలో అత్యంత శక్తివంతమైన డీజిల్ ఇంజిన్ ఆధారిత ప్రొపల్షన్ సిస్టమ్‌ను అమర్చనున్నారు. దీంతో పాటు నౌక సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునిక ఆయుధాల వ్యవస్థను కూడా అందులో అమర్చనున్నారు. ఈ సమగ్ర రీఫిటింగ్ వల్ల ఐఎన్ఎస్ బెత్వా పోరాట సామర్థం, వేగం, సముద్రంలో ఆపరేషనల్ కేపబిలిటీ గణనీయంగా పెరగనున్నాయని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఆధునిక ఆయుధ వ్యవస్థలను అమర్చడం ద్వారా నౌక పోరాట సామర్థ్యాలను కూడా మరింత మెరుగుపరచనున్నారు. దీనివల్ల నౌక కార్యకలాపాల సామర్థం పెరగనుంది.

రీసర్వేపై నిరంతర పర్యవేక్షణ

అభ్యంతరాల స్వీకరణపై రైతులకు స్పష్టత ఇవ్వాలి

ప్రతి 15 రోజులకు గ్రామాల్లో చాటింపు వేయాలి

పాలేరు నియోజకవర్గంలోని 141 రెవెన్యూ గ్రామాల్లో పైలట్ ప్రాతిపదికన రీసర్వే

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి



బుధవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సర్వే శాఖ అధికారులతో రీసర్వే, హౌసింగ్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, సర్వే శాఖ అధికారులతో రీసర్వే, హౌసింగ్ అంశాలపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ సర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని అలాగే కలెక్టర్లు తప్పనిసరిగా ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన భూమి విస్తీర్ణం ఎంత? రీసర్వే అనంతరం గుర్తించిన విస్తీర్ణం ఎంత? అనే వివరాలను భూ యజమానులకు తక్షణమే తెలియజేయాలని ఆదేశించారు. భూ యజమానులకు ఎలాంటి సందేహాలు, అపోహలు లేకుండా సర్వే ప్రక్రియపై పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. పాలేరు నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని, నియోజకవర్గ పరిధిలోని మొత్తం 141 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేకు ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు, రెండు రోవర్లను సమకూర్చినట్లు తెలిపారు. ప్రస్తుతం 708 రోవర్లతో సర్వే కొనసాగుతోందని, మరో వారం రోజుల్లో అదనంగా 400 రోవర్లను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. రీసర్వే నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) జారీ చేసిందని మంత్రి తెలిపారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఎస్ఓపీని సక్రమంగా అమలు చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భిన్నమైన పద్ధతులు అనుసరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.క్షేత్రస్థాయి అధికారుల అనుభవాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని ఎస్ఓపీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసి మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు చూపేలా మార్గదర్శకాలను రూపొందిస్తామన్నారు. రీసర్వే అమలు తీరుపై ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులతో పాటు జిల్లాల వారీగా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మండల స్థాయి రెవెన్యూ, సర్వే అధికారులతో సుదీర్ఘంగా సమీక్షలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.తొమ్మిది ఉమ్మడి జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయి అధికారులతో స్వయంగా సమావేశమై, ఒక్కో సమావేశంలో ఐదు నుంచి ఆరు గంటల పాటు రీసర్వేలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించినట్లు వెల్లడించారు.ఇటీవల సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన క్షేత్రస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాలు, నోటీసులు జారీ చేసిన గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించినట్లు తెలిపారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు, ఇతర భూ వివాదాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.రెవెన్యూ, ఫారెస్ట్ భూముల సరిహద్దుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఇరు శాఖల అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిహద్దులను నిర్ధారించాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.రీసర్వే నిర్వహణలో మంచి ప్రతిభ కనబరుస్తున్న నల్గొండ, ఖమ్మం జిల్లా కలెక్టర్లను మంత్రి అభినందించారు. అదే సమయంలో నిజామాబాద్ జిల్లాలో రీసర్వే జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరును మెరుగుపరుచుకొని నిర్దేశిత లక్ష్యాల మేరకు సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.
22ఎ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ కొన్ని జిల్లాల్లో ఇంకా సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు.రీసర్వే, గృహ నిర్మాణం, 22ఎ భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వేగం, పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఓట్లు కొల్లగొడుతున్న మోడీ సర్కార్

తెలంగాణ 'కారు' ఢిల్లీలో 'కమలం'లా మారుతోంది

పిల్లల బంగారు భవిష్యత్తు కోసం విద్య మాత్రమే అందించగలను

వైట్‌కాలర్ జాబ్‌లకు ఎఐ ముప్పు.. మూసీ తీరంలో నైట్ బజార్‌ల ఏర్పాటు

మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో సిఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 11, ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్రమోడీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్ తొలగించాలంటున్న బీజేపీ నేతలు.. గుజరాత్‌లో ఎందుకు తొలగించడం లేదు? అని ప్రశ్నించారు. మైనారిటీలకు ఓటు హక్కును దూరం చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. యువతలో స్కిల్స్ పెంచేందుకు ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని గుర్తుచేశారు. మైనారిటీల్లో చాలామంది స్కిల్డ్ యువత ఉన్నారని చెప్పుకొచ్చారు. యువత కోసమే స్కిల్ యూనివర్సిటీని తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణలో విద్య, ఉపాధి అవకాశాల మెరుగుదలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక వసతులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.మైనార్టీలకు ఇచ్చిన హామీ మేరకు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని గుర్తుచేశారు. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూసీని అత్యంత సుందరమైన రివర్ ఫ్రంట్‌గా అభివృద్ధి చేయడమే కాకుండా నైట్ ఎకానమీ కార్యకలాపాలను విస్తరించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి, తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు.
హైదరాబాద్ నగర గత వైభవాన్ని ముఖ్యమంత్రి వివరిస్తూ ఓల్డ్ సిటీ కాదు... ఒరిజినల్ సిటీని తిరిగి పునరుద్ధరించడం కోసం అడుగులు వేశామని చెప్పారు. దేశ విదేశాల నుంచి సందర్శకులు వచ్చేలా రివర్ ఫ్రంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఓల్డ్ సిటీ యువత ఉదయం పూట చదువుకుంటూ రాత్రిపూట ఉపాధి పనులు చేసేకునేలా అవకాశాలు కల్పిస్తామని అన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు, ఆ తర్వాత స్కిల్స్ అనంతరం ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిచ్చేలా విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టామని తెలిపారు.
మైనారిటీ యువకుల్లో స్కిల్స్ ఉన్నవారు చాలా మంది ఉన్నారని చెప్పారు. పిల్లలను బాగా చదివించాలని, చదువుల పట్ల మక్కువ లేని వారికి స్కిల్స్ నేర్పించాలని లేదా వారిని క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. బ్లూకాలర్ జాబ్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను గుర్తించే రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించామని ముఖ్యమంత్రి తెలిపారు. దేశ జనాభాలో 15 శాతం ఉన్న మైనారిటీ వర్గాలు కూడా ప్రగతి సాధించినప్పుడే దేశం ముందడుగు వేస్తుందని వివరించారు. మైనారిటీల్లో పేదరికం తొలగించాలన్న ఉద్దేశంతో సచార్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా 4 శాతం రిజర్వేషన్లు కల్పించినట్టు చెప్పారు. చదువు విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. నిరుపేదల కోసం హైదరాబాద్‌లో ఒక లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నాం. శాంతి భద్రతలు, అభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.
గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ పనులు వచ్చే రెండు నెలల్లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. మీరాలం ట్యాంక్ మరో ఏడాది కాలంలో అత్యంత సుందరమైన ప్రదేశంగా రూపుదిద్దుకోబోతోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, వి హనుమంతరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి గారు, అనిల్ కుమార్ యాదవ్, టిజిఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ అండ్ ప్రెసిడెంట్ ఫహీం ఖురేషీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మైనారిటీ నేతలు పాల్గొన్నారు.



దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం జయంతి సందర్భంగా బుధవారం బంజారాభవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో పాల్గొన్న సిఎం రేవంత్ తదితరులు

స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర మైనారిటీ శాఖ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సర్ (ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ) పేరుతో మైనారిటీలు, దళితులు, పేదల ఓట్లను తొలగిస్తున్నారని ఆగ్రహించారు. మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. మోదీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యమని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కటేనని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారని.. మోదీ కాళ్లపై పడింది ఎవరో అందరికీ తెలుసునని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ గల్లీ నుంచి వెళ్లిన 'కారు' ఢిల్లీకి చేరగానే మోడీ 'కమలం'గా మారిపోతుందని, బీఆర్ఎస్ లీడర్లు మోడీకి లొంగిపోయారు. ఓట్ల కోసం ఉర్దూ మాట్లాడతారు. రంజాన్‌కు వచ్చి బిర్యానీ తింటారు కానీ తర్వాత మోడీకి షేక్ హ్యాండ్ ఇస్తారు. బీఆర్ఎస్ డబుల్ స్టాండర్డ్స్‌తో ప్రజలు మోసపోవద్దు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు మాత్రమే బీజేపిని ఎదుర్కొనే సత్తా ఉందని స్పష్టం చేశారు.దేశంలో విద్య, నీటిపారుదల రంగాల అభివృద్ధికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బలమైన పునాదులు వేశారని సీఎం పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యాశాఖ మంత్రిగా నియమించి, యూనివర్సిటీలు, ఐఐటీల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు. సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని, బ్లూకాలర్ ఉద్యోగాలకు మాత్రం ఆ ప్రమాదం లేదని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విషయంలో బీజేపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. విద్యావ్యవస్థను మోలానా అబుల్ కలాం ఆజాద్ బలోపేతం చేశారని వ్యాఖ్యానించారు. దేశంలో వర్సిటీలతో పాటు ఐఐటీలను స్థాపించారని ప్రస్తావించారు. ఆనాటి పునాదుల వల్లే ప్రపంచవ్యాప్తంగా భారతీయులు రాణిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థకు పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి

గవర్నర్ శుక్లాతో బీహార్ గవర్నర్ భేటీ

హైదరాబాద్, నవంబరు11,ప్రభాతవార్త: బీహార్ రాష్ట్ర గవర్నర్ రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్ బుధవారం సాయంత్రం లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇరువురు గవర్నర్లు పలు అంశాలపై పరస్పరం చర్చించుకున్నారు.

భారత్ సమ్మిట్‌లో ప్రపంచ పరిస్థితులపై చర్చలు : సల్మాన్ ఖుర్షీద్

సమ్మిట్‌పై బిజెపి అనవసర విమర్శలు మానుకోవాలి : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్,నవంబరు11,ప్రభాతవార్త:తెలంగాణలో రెండోసారి 'భారత్ సమ్మిట్' జరుగుతోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చైర్మన్ సల్మాన్ ఖుర్షీద్ తెలిపారు. బుధవారం హెచ్‌బీసీసీలో మీడియాతో మాట్లాడుతూ.. భారత్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రపంచంలో ఉన్న పరిస్థితులపై సమ్మిట్‌లో చర్చించనున్నట్లు చెప్పారు. దేశాల మధ్య కోఆర్డినేషన్ కోసం సమ్మిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. గాంధీ సిద్ధాంతాలు ఈ దేశానికి అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవత్వం పెంపొందేలా భారత్ సమ్మిట్ కొనసాగుతుందని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రోగ్రెసివ్ భావాలున్న వారిని సదస్సుకు ఆహ్వానించామని సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు. బీజేపీ ఆలోచన వేరని.. ప్రగతిశీల ఆలోచనలు ఉన్న కాంగ్రెస్ ఆలోచన వేరని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. రాహుల్ గాంధీ జాతీయ,అంతర్జాతీయ నాయకుడు,ఆయనను మళ్లీ స్పెషల్‌గా లాంచ్ చేయాల్సిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేద్దామని బీజేపీ ఆలోచిస్తోంది, రాహుల్‌గాంధీ ఆలోచన విధానం బిజెపికి ఎప్పటికీ అర్థం కాదన్నారు.రాజకీయాలు కాదు,ప్రస్తుతం. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ సమ్మిట్ ద్వారా పరిష్కార మార్గాలు చూపాలన్నదే కాంగ్రెస్ తపనగా చెప్పుకొచ్చారు. భారత్ సమ్మిట్ ఒక ఎకనామిక్ సమ్మిట్‌లాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సమ్మిట్ రాజకీయాల కోసం కాదని అన్నారు. బీజేపీ అనవసర విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తే తప్పేంటని ప్రశ్నించారు. టెక్నాలజీ, ప్రస్తుత సవాళ్లపై ఎవరైనా మాట్లాడొచ్చన్నారు. ప్రగతిశీల భావాలున్న ప్రతిపార్టీని సమ్మిట్‌కు ఆహ్వానించామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులపై చర్చిస్తామన్నారు. అలాగే జెన్‌జీ డిమాండ్లపై కూడా ఒక సెషన్‌లో చర్చించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. విదేశాల నుంచి భారత్ సమ్మిట్‌కు వస్తున్నారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ప్రపంచంలో జరుగుతున్న అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంపై నమ్ముకున్న వాళ్లు భారత్ సమ్మిట్‌లో పాల్గొంటారని మహేశ్ కుమార్ వెల్లడించారు.

ఎపి సహా 3 రాష్ట్రాల్లో ఈవెనింగ్ కోర్టులు!

కేసుల భారం తగ్గించేందుకు కేంద్రం కొత్త ప్రణాళికలు

న్యూఢిల్లీ, నవంబరు 11: దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసుల భారాన్ని తగ్గించి, విచారణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. ఇందులో భాగంగా ఢిల్లీ, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈవినింగ్ కోర్టులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నూతన విధానం ద్వారా సాధారణ పనివేళలు ముగిసిన తర్వాత కూడా సాయంత్రం వేళల్లో కోర్టులు పని చేస్తాయి. ఈవినింగ్ కోర్టుల ఏర్పాటుతో పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం కావడమే కాకుండా కేసుల పరిష్కారం రేటు గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి ఇచ్చిన ఇంట రూ్వలో ఈ ప్రతిపాదిత నిర్ణయాన్ని వెల్లడించారు. రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలు వినియోగం ప్రస్తుతం పగటిపూట మాత్రమే పని చేస్తున్న కోర్టుల సమయాన్ని సాయంత్రం వేళల్లో మరికొన్ని గంటల పాటు పొడిగించనున్నారు. ఈ అదనపు సమయంలో కేవలం పెండింగ్ కేసుల విచారణ, పరిష్కారంపైనే దృష్టి సారిస్తారు. ఈ ప్రత్యేక విచారణలను నిరహించడానికి పదవీవిరమణ పొందిన న్యాయమూర్తుల సేవలను వినియోగించుకోవాలని కేంద్రం భావిస్

ఇంగ్లాండ్ మహిళల సిరీస్:

భారత్ కెప్టెన్‌గా అనుష్క

మల్టీడే కెప్టెన్‌గా మిన్ను



న్యూఢిల్లీ: ఇంగ్లాండ్ జట్టుతో స్వదేశంలో జరగనున్న బహుళ ఫార్మాట్ సిరీస్ కోసం భారత జట్టును మహిళల సెలక్షన్ కమిటీ బుధవారం ప్రకటించింది. ఈ నెల 30 నుండి డిసెంబరు 6 వరకూ మూడు టీ20లు, డిసెంబరు 8 నుండి 14 వరకూ మూడు వన్డే మ్యాచ్‌లు, డిసెంబరు 19న ఒక మల్టీడే మ్యాచ్ ఉంటాయి. టీ20 సిరీస్ పూణేలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతుంది. వన్డే, మల్టీడే మ్యాచ్‌లు ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరుగుతాయి. మధ్యప్రదేశ్ బ్యాటర్ అనుష్క శర్మను షార్టర్ ఫార్మాట్‌లకు కెప్టెన్‌గా నియమించారు. మిన్ను మణి ఆమెకు డిప్యూటీగా వ్యవహరిస్తారు. రెడ్‌బాల్ మ్యాచ్‌కు కేరళ క్రికెటర్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించనుంది. ఇక సీనియర్ జట్టుకు ఎంపికలో అవకాశం కోల్పోయిన శ్రేయాంకా పాటిల్ ఈ సారి మూడు ఫార్మాట్లలో ఆడనుంది. మోకాలి శస్త్రచికిత్స తర్వాత పునరాగమనం చేస్తున్న కాష్వీ గౌతమ్ కూడా పరిమిత ఓవర్ల జట్లలో ఉంది. టీ20ల కోసం భారత ఎ జట్టులో బృందా దినేష్, తనీషా సింగ్, సానికా చాల్కే, అనుష్క శర్మ (కెప్టెన్), నికి ప్రసాద్, జి కమలిని (వికెట్‌కీపర్), శిప్రా గిరి (వికెట్‌కీపర్), మిన్ను మణి (వైస్ కెప్టెన్), అమంజోత్‌కౌర్, శ్రేయాంక పాటిల్, వైష్ణవి శర్మ, ప్రేమ రావత్, సైమా ఠాకూర్, మోనికా పటేల్ ఉన్నారు. అలాగే వన్డే మ్యాచ్‌ల కోసం ఖరారు చేసిన జట్టులో బృందా దినేష్, తనీషా సింగ్, ప్రియా పునియా, అనుష్క శర్మ (కెప్టెన్), నికి ప్రసాద్, జి కమిలిని (వికెట్‌కీపర్), శిప్రా గిరి (వికెట్‌కీపర్), మిన్ను మణి (వైస్ కెప్టెన్), తేజల్ హసబ్నిస్, శ్రేయంక పాటిల్, అమీషా బహుకుంది, షబ్నమ్ షకీల్, సైమా ఠాకోర్, అక్షితావే భగత్ ఉన్నారు.

కార్ల్‌సెన్‌కు చెస్ బ్లిట్జ్ టైటిల్

నాలుగు పాయింట్లతో వైశాలి



బుడాపెస్ట్: భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి తన ప్రత్యర్థులు వెస్లీ సో, హన్స్ నీమాన్‌లపై అద్భుతమైన విజయాలు నమోదు చేయగా, ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సెన్ ఇక్కడ జరిగిన టోటల్ చెస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ టూర్ పైలట్‌ను ప్రారంభించిన తొమ్మిది రౌండ్ల బ్లిట్జ్ స్విస్‌ను గెలుచుకోవడం ద్వారా తన అగ్రస్థానానికి తగ్గట్టుగా నిలిచాడు. హంగరీలోని బుడాపెస్ట్‌లో జరిగిన పోటీలో అర్జున్ ఎరిగైసి 5.5 పాయింట్లతో అలీరెజా ఫిరౌజ్జా, ఫాబియానో కరువానా, నీమాన్, రిచర్డ్ రాపోర్ట్‌లతో కలిసి నాల్గవ స్థానాన్ని పంచుకుంటూ ఉత్తమ భారతీయ ఆటగాడిగా నిలిచాడు. ఇక మహిళల ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఛాలెంజర్ వైశాలి తన మొదటి మూడు గేమ్‌లలో రెండు విజయాలతో ప్రారంభించినప్పటికీ, ఆ ఊపును కొనసాగించలేకపోయింది. మిగిలిన ఆరు రౌండ్లలో రెండుసార్లు ఓడిపోయి, మూడుసార్లు డ్రా చేసుకుని నాలుగు పాయింట్లతో ముగించింది. అయితే, మిశ్రమంగా సాగిన ఈ ప్రదర్శనలో, ప్రపంచ నెం.6 సో, ప్రపంచ నెం.36 నీమాన్‌లపై ఆమె సాధించిన విజయాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఆమె సోదరుడు, నార్వే చెస్ ఛాంపియన్ అయిన ఆర్. ప్రజ్ఞానంద, ఆంధ్రా హాంగ్‌పై విజయం సాధించి 4.5 పాయింట్లతో తన టోర్నమెంట్‌ను ముగించారు. కార్ల్సెన్ తన తొమ్మిది ఆటలలో ఐదింటిలో గెలిచి, నాలుగింటిని డ్రా చేసుకుని అజేయంగా నిలిచాడు. అతను ఏడు పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో నిలిచి టోర్నమెంట్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్‌లాగ్రావ్ 6.5 పాయింట్లతో రెండవ స్థానంలో నిలవగా, ఆర్మేనియా గ్రాండ్‌మాస్టర్ లెవాన్ అరోనియన్ ఆరు పాయింట్లతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.



ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

నీరజ్‌కు కాంస్యం

దోహా: ఖతార్‌లోని దోహాలో బుధవారం జరిగిన 2026 ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో నీరజ్ కుమార్ కాంస్య పతకం సాధించి, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో తన తొలి వ్యక్తిగత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అతను పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీపొజిషన్ ఫైనల్‌లో 34 షాట్‌ల తర్వాత 346.5 స్కోరు సాధించి కాంస్యం సాధించాడు. తద్వారా 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు భారతదేశానికి రైఫిల్ విభాగంలో తొలి కోటాను సంపాదించిపెట్టాడు. నిరజ్ అద్భుతంగా రాణించాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 591 మంచి స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి, 590 స్కోరు దాటిన ఏకైక షూటర్‌గా నిలిచాడు. మరోవైపు, అగ్రశ్రేణి షూటర్లందరూ ఇబ్బంది పడ్డారు. అతను ఫైనల్‌లో కూడా తన ఫామ్‌ను కొనసాగించి, చాలా భాగం టాప్ టూలో ఉన్నాడు. 34వ షాట్‌కు ముందు రజతం గెలుచుకునే అవకాశం కూడా వచ్చినా, 9.4 తక్కువ స్కోరుతో దాన్ని కోల్పోయాడు. మరోవైపు, ప్రస్తుత పతక విజేత ఐశ్వర్య తన అత్యుత్తమ ప్రదర్శన కనబరచలేక 323.7 స్కోరుతో ఐదవ స్థానంలో నిలవగా, 2023 పతక విజేత అఖిల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో 42వ స్థానంలో నిలిచాడు. ఈ త్రయం అంతకుముందు జరిగిన ఎలిమినేషన్ రౌండ్‌లో చెకియా, నార్వేల తర్వాత 1751 సంయుక్త స్కోరుతో టీమ్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. నీరజ్ పతకంతో భారతదేశం పతకాల సంఖ్య రెండంకెల స్థాయికి చేరింది. దీంతో మొత్తం 10 పతకాలు (2 స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలు) సాధించి, పతకాల పట్టికలో చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచింది.





ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్..

మాల్దీవులను ఓడించిన భారత్

ఢాకా: బంగ్లాదేశ్‌లోని ఢాకాలోని నేషనల్ స్టేడియంలో బుధవారం మాల్దీవులను 1-0 తేడాతో ఓడించిన తర్వాత భారత్, సాఫ్ ఛాంపియన్‌షిప్ 2026 సెమీఫైనల్‌లో తన స్థానాన్ని ఖరారు చేసుకుంది. భారత్ ఆటను బలంగా ప్రారంభించి, మొదటి అర్ధభాగం మొత్తం బంతిపై ఆధిపత్యం చెలాయించింది. అయితే బ్లూ టైగర్స్ 38వ నిమిషం వరకు ప్రతిష్టంభనను ఛేదించడానికి వేచి ఉండాల్సి వచ్చింది. భట్ ఈ సీజన్‌లో తన మూడవ గోల్‌ను నమోదు చేశాడు. హెడ్ కోచ్ నౌషాద్ మూసా, మంగలెంథాంగ్ కిప్జెన్, ఇర్ఫాన్ యాద్వాద్, విష్ణు పివి వంటి కొత్త ఆటగాళ్లను బరిలోకి దించడంతో భారత్ ఆటపై పట్టును కొనసాగించింది. భారత గోల్ కీపర్ 84వ నిమిషంలో ప్రత్యామ్నాయ ఆటగాడు ముజ్దావ్ హసన్‌ను అడ్డుకున్న తర్వాత, అదనపు సమయం మొదటి నిమిషంలో ఇథాన్ ఇబ్రహీం జాకీ చేసిన ప్రయత్నాన్ని అడ్డుకుని డ్రా కాకుండా ముగించాడు. గ్రూప్ ఎ లో రెండవ స్థానంలో నిలిచిన దేశంతో భారత్ తలపడుతుంది, అదే రోజు తరువాత బంగ్లాదేశ్ మరియు శ్రీలంక తలపడతాయి, కాగా భూటాన్ కూడా మొదటి రెండు స్థానాల్లో నిలిచేందుకు పోటీలో ఉంది.

జపాన్ మాస్టర్స్..

జెన్‌ను ఓడించిన లక్ష్య సేన్

కుమామోటో: జపాన్ మాస్టర్స్‌లో బుధవారం జరిగిన రౌండ్ ఆఫ్ 32లో భారత షట్లర్ లక్ష్య సేన్, చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్‌ను 21-19, 21-18 తేడాతో ఓడించాడు. జపాన్‌లోని కుమామోటోలో బుధవారం జరిగిన ఈ టోర్నీలో లక్ష్య తన లోతైన ఫుట్‌వర్క్‌తో అసాధ్యంగా కనిపించే షాట్లను కూడా కొట్టి, ర్యాలీని సాగదీశాడు. చివరికి చి యు జెన్ పొరపాటు చేసేలా ఒత్తిడి తెచ్చాడు. 10-10 స్కోరు వద్ద, ఇద్దరు ఆటగాళ్లు వేగవంతమైన డ్రైవ్‌లు చేసుకుంటూ, ఆరంభంలోనే ఒకరి బ్యాక్‌కోర్ట్ డిఫెన్స్‌ను మరొకరు పరీక్షించుకున్నారు. ప్రారంభ గేమ్‌లో, సేన్ 12-16తో వెనుకబడి ఉన్నప్పటికీ, పుంజుకుని హోరాహోరీగా సాగిన గేమ్‌ను 21-19 తేడాతో గెలుచుకున్నాడు. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌ను గెలుచుకున్న లక్ష్య, అదే సంయమనాన్ని రెండో గేమ్‌లోకి కూడా కొనసాగించాడు. 6-4తో ఆరంభంలోనే సాధించిన ఆధిక్యం, అతను మ్యాచ్‌లో కుదురుకున్నాడని చూపించింది. ర్యాలీలు తీవ్రమవుతుండగా, చి యు జెన్ తన సర్వశక్తులూ ఒడ్డి పోరాడటంతో లక్ష్య వత్తిడిని ఎదుర్కొన్నా విజయంతో ముగించాడు. ఈ విజయంతో, 25 ఏళ్ల అతను యు జెన్‌తో జరిగిన ముఖాముఖి పోరులో 2-1 ఆధిక్యాన్ని సాధించాడు. తదుపరి గురువారం జరిగే రౌండ్ ఆఫ్ 16లో లక్ష్య చైనాకు చెందిన డాంగ్ టియాన్యావోతో తదుపరి తలపడనున్నాడు.



చమురు ధరల పతనం, ఆసియా మార్కెట్ల మద్దతు

లాభాలతో ఉరకలేసిన సెన్సెక్స్, నిఫ్టీ



ముంబయి,నవంబరు 11: దేశీయ స్టాక్ మార్కెట్‌లు బుధవారం లాభాలతో ముగిశాయి. చమురు ధరల పతనం, ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు ఉదయం ఉరకలేశాయి. ఆ తర్వాత అమాంతం చతికిలపడ్డాయి. చివరకు కోలుకుని లాభాలతో ముగిశాయి. ఇవాళ్టి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 770 పాయింట్లకుపైగా లాభపడగా, నిఫ్టీ 25,200 మార్క్ పైన ముగిసింది. క్రితం సెషన్ ముగింపు (81,106.65) తో పోలిస్తే ఈ ఉదయం సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్ల లాభంతో 82,248.68 వద్ద ఉత్సాహంగా ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఒక దశలో 82,520 వద్ద ఎనిమిది నెలల గరిష్ఠస్థా యిని తాకింది. ఈ దశలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ, రియల్టీ షేర్లలో అమ్మకాలతో కుదేలైన సెన్సెక్స్ 81,417 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. అంటే గరిష్ఠస్థాయి నుంచి దాదాపు 1000 పాయింట్లు తగ్గింది. చివరి సెషన్‌లో కోలుకున్న సూచీలు మార్కెట్ ముగిసే సమయానికి 772.75 పాయింట్లు పెరిగి 81,879 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 210 పాయింట్లు లాభపడి 25,255 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఎనిమిది పైసలు పెరిగి 93.69 గా స్థిరపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు సద్దుమణుగుతాయనే అంచనాలతో ముడిచమురు ధరలు దిగొచ్చాయి. దేశీయ స్టాక్‌మార్కెట్లు నేడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాల మద్దతుతో భారీ లాభాల్లో ముగిశాయి. బెంచ్ మార్క్ సూచీలు రోజంతా లాభాల్లోనే పయనించాయి. బిఎస్ఈ సెన్సెక్స్ 772.75 పాయింట్లు పెరిగి 81,879.40 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 210.40 పాయింట్లు పెరిగి 25,255.05 స్థాయికి చేరుకుంది. బ్యాంక్ నిఫ్టీ అత్యధికంగా 1,051.15 పాయింట్లు (1.76) పెరిగి 60,792.40 వద్ద స్థిరపడింది. ఆటోమొబైల్, ఏవియేషన్ , రీటైల్ రంగాలు మార్కెట్ లాభా లకు ప్రధాన కారణమయ్యాయి. మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 5.30 శాతం లాభపడి రూ. 3,465.00కి చేరింది. ఇండిగో 4.33 శాతం పెరిగి రూ. 5,665.00 వద్ద, ట్రెంట్ 3.32 శాతం పెరిగి రూ. 3,222.70 వద్ద, టాటా స్టీల్ 2.40 శాతం పెరిగి రూ. 189.28 వద్ద క్లోజ్ అయ్యాయి. కొన్ని ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో నష్టాలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఐసిఐసిఐ బ్యాంక్ 1.10 నష్టపోయి రూ. 1,571.60 వద్ద ముగిసింది. టెక్ మహీంద్రా 0.91 శాతం తగ్గి రూ. 1,788.50, హెచ్‌సీఎల్ టెక్ 0.85 శాతం తగ్గి రూ. 1,395.00, నెస్లే 0.76 శాతం తగ్గి రూ. 1,288.00, టైటాన్ 0.70శాతం తగ్గి రూ. 4,970.00 వద్ద స్థిరపడ్డాయి. పబ్లిక్ సెక్టార్, ఆటో రంగాలు సూచీలను లాభాల వైపు నడిపించగా, త్రైమాసిక ఫలితాలు పెట్టుబడిదారులలో ఉత్సాహాన్ని నింపాయి.

45 నిమిషాల్లోనే ఆరులక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల టర్నోవర్



ముంబయి, నవంబరు 11: దీపావళి సెలవు తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు భారీలాభాలతో కళ్లు చెదిరేలా దూసుకెళ్తు న్నాయి. బుధవారం ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఇన్వెస్టర్ల సంపద భారీగా పెరిగింది. కేవలం 45 నిమిషా ల్లోనే బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగింది. సెన్సెక్స్ ఏకంగా 1,300 పాయింట్లకు పైగా లాభపడగా నిఫ్టీ 50 కూడా ఒక శాతానికి పైగా ఎగబాకింది. ఉదయం మార్కెట్లు ప్రారంభమైన సమయంలో బీఎస్ఈలో నమోదైన కం పెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.5,06,41,936 కోట్లుగా ఉంది. ఉదయం 10 గంటల సమ యానికి అది రూ.5,12,45,010కోట్లకు చేరింది. అంటే కేవలం 45 నిమిషాల్లోనే రూ.6,03,074 కోట్ల సంపద పెరిగింది. దీపావళి సెలవు తర్వాత మార్కెట్లు ఈ స్థాయిలో లాభాలతో ప్రారంభం కావడం ఇన్వెస్టర్లలో ఉత్సాహం నింపింది. ఈ ర్యాలీకి ప్రధాన కారణాల్లో ముడిచమురు ధరల తగ్గుదల ఒకటి. అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా బ్యారెల్ ధర 100 డాలర్లకు పైగా చేరగా ఇటీవల గణనీయంగా తగ్గింది. మంగళవారం ఓ దశలో 90 డాలర్ల దిగువకు పడి పోయింది. భారత్ తన చమురు అవసరాల్లో అధిక భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. ధరలు తగ్గితే దిగుమతి భారం, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. మరోవైపు పలు కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆశా జనకంగా ఉండటం కూడా మదుపర్లలో నమ్మకాన్ని పెంచింది. నవంబర్‌లోనే సెన్సెక్స్, నిఫ్టీదాదాపు 9శాతం లాభపడటం గమనార్హం.ముఖ్యంగా హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పెరిగినా, చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడినా ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉంది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, కృత్రిమ మేధరంగంలో పరిణామాలు కూడా దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి.



అమెరికాలో పనిచేసే

విదేశీ ఉద్యోగులకు

ఐబిఎం షాక్

ముంబయి, నవంబరు 11: ప్రముఖ టెక్ దిగ్గజం ఐబీఎం అమెరికాలో పనిచేస్తున్న విదేశీ ఉద్యో గులకు షాకిచ్చింది. తన కస్ట్లింగ్ విభాగంలోని మెజారిటీ ఉద్యోగాలకు ఇకపై యూఎస్ వీసా, గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్‌లు అందించబోమని ప్రక టించింది. లక్షన్నర మందికి పైగా ఉద్యోగులున్న ఐబీఎం కస్ట్లింగ్ విభాగం తీసుకున్న ఈ నిర్ణయం, టెక్ రంగంలో పనిచేస్తున్న విదేశీ నిపు ణులలో ఆందోళన రేపుతోంది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విదేశీ టెక్ నిపుణుల నియామకాలపై కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఐబీఎం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంత రించుకుంది. గత నెలలోనే మైక్రోసాఫ్ట్, అడోబ్, ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలను పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియ నుంచి ప్రభుత్వం నస్పెండ్ చేసింది. ఇది విదేశీ ఉద్యో గులకు గ్రీన్ కార్డులు జారీ చేయడంలో కీలకమైన దశ. గత కొన్నేళ్లుగా తమ సంస్థలో నైపుణ్యాల కొరతను తీర్చడానికి యూఎస్ వీసా ప్రోగ్రామ్ లను ఉపయోగించుకున్నప్పటికీ, క్రమంగా వాటిపై ఆధారపడటం తగ్గిందని ఐబీఎం ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో నైపుణ్యాల లభ్యత పెరగడం, క్లయింట్ల అవస రాలు మారడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఖిబ్లూమ్‌బర్గ్‌ఖి నివేదిక ప్రకారం ఈ నిర్ణయంతో ప్రభావితమైన ఉద్యో గులు ఈ ఏడాది చివరిలోగా అమెరికా వెలుపల ఉన్న ఐబీఎం కార్యాలయాలకు బదిలీపై వెళ్లడం లేదా ఉద్యోగం నుంచి వైదొలగడం వంటివి చేయాల్సి ఉంటుంది. గతేడాది ట్రంప్ ప్రభుత్వం కొత్త హెచ్1బీ పిటిషన్లపై లక్ష డాలర్ల ఫీజు విధించిన సంగతి తెలిసిందే.

బలపడుతున్న దేశీయ కరెన్సీ రూపాయి



ముంబయి, నవంబరు 11: దేశీయ మారకం విలువలో రూపాయి కష్టాలకు ఇప్పుడొక చిన్న విరామం దొరికింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా కిందికి దిగిరావడం, విదేశీ మదుపరుల నుంచి నిధులు ప్రవహిస్తుండటంతో రూపాయి పుంజుకుంది. సోమవారం ముగింపుతో పోలిస్తే బుధవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలో రూపాయి 19 పైసలు లాభపడి 93.74 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టింది. రాబోయే రోజుల్లోనూ సానుకూల వాతావరణం కొనసాగితే రూపాయి మరింత బలపడే అవకాశం ఉందని కరెన్సీ నిపుణులు అంచనా వేస్తున్నారు. రూపాయి కోలుకోవడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పడిపోవడమే. అమెరికాఇరాన్ ఉద్రిక్తతల కారణంగా ఒక దశలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్లకు పైగా ఎగబాకింది. అయితే యుద్ధ భయాలు తొలగిపోవడంతో ధరలు వేగంగా పడిపోయాయి. బుధవారం ఉదయం ఆసియా మార్కెట్లలో ఇది బ్యారెల్‌కు 92 డాలర్ల వద్ద కదలాడుతోంది. చమురు దిగుమతుల కోసం భారత్ భారీగా డాలర్లను వెచ్చించాల్సి ఉంటుంది. ఇప్పుడు ధరలు తగ్గడంతో దిగుమతుల భారం తగ్గి, దేశ కరెంట్ ఖాతా లోటుపై ఒత్తిడి గణనీయంగా తగ్గింది.భారతీయ మార్కెట్లపై విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల ఆసక్తి మళ్లీ పెరుగుతోంది. మార్కెట్లోకి విదేశీ పెట్టుబడులు వస్తుండటంతో ఎఫ్‌పీఐలు డాలర్లను విక్రయిస్తున్నారు. దీనివల్ల దేశీయ మార్కెట్లో డాలర్ల లభ్యత పెరిగి, దిగుమతిదారులు డిమాండ్ చేసే డాలర్ల అవసరాన్ని భర్తీ చేయడానికి సహాయపడు తోంది. మరో వైపు అమెరికా లో ట్రెజరీ ఈల్డ్ పెరుగు తున్నప్పటికీ, దేశీయంగా ఉన్న సానుకూల అంశాలు రూపాయికి అండగా నిలుస్తున్నాయి. బుధవారం అమెరికాలో వెటర్న్స్ డే సందర్భంగా బాండ్ మార్కెట్లకు సెలవు ఉండటంతో గ్లోబల్ మార్కెట్లో డాలర్ లావాదేవీలు కొంత మందగించవచ్చు. అయితే స్టాక్ మార్కెట్లు మాత్రం యథావిధిగా పనిచేస్తున్నాయి. దేశీయ కరెన్సీ ట్రేడింగ్ పరిశీలిస్తే, మంగళవారం రూపాయి మారకం విలువ 93.25 నుంచి 94.25 శ్రేణిలో కదలాడింది .ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై ప్రైవేట్ బ్యాంకు డీలర్లు మాట్లాడుతూ కీలక సూచనలు చేశారు. దిగుమతిదారులు డాలర్లను కొనుగోలు చేయడానికి రూపాయి 93.50 స్థాయికి చేరుకునే వరకు వేచి చూసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఎక్స్‌పోర్టర్లు 94 పైసలకు పైన ఉన్న స్థాయిలలో తమ డాలర్లను విక్రయించుకోవచ్చని సూచించారు. ఏది ఏమైనా ముడి చమురు ధరలు ఇలాగే అదుపులో ఉంటే రాబోయే రోజుల్లో రూపాయి మరింత స్థిరపడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

మా సాంకేతికతను మొత్తం బివైడి కాపీ చేసిందన్న ల్యాండ్ రోవర్

అంతర్జాతీయ కోర్టులో దావా



హేగ్,నెదర్లాండ్స్,నవంబరు 11: చైనాకు చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థ బీవైడీకి, బ్రిటన్ ఆటోమొబైల్ దిగ్గజం జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు మధ్య న్యాయవివాదం మొదలైంది. బీవైడీ రూపొందించిన టీ7 ఎస్ యూవీలో తమ ల్యాండ్ రోవర్ డిఫెండర్ సాంకేతికతను అక్రమంగా ఉప యోగించారని జేఎల్ఆర్ ఆరోపించింది. డిఫెండర్ వాహనాన్ని విడదీసి, దాని సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి టీ7లో వినియోగించారని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం ప్రస్తుతం నెదర్లాండ్స్‌లోని హేగ్ కోర్టు పరిధిలో ఉంది. ఈ ఏడాది ఆగస్టులో కోర్టు ఆదేశాలతో అధికారులు నెదర్లాండ్స్‌లోని షీడామ్, హూఫ్‌డార్ప్ ప్రాంతాల్లో ఉన్న బీవైడీ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. అక్కడి డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కీలక ఆధారాలు తొలగించకుండా ఉండేందుకే ఈ చర్యలు చేపట్టాలని కోరినట్లు జేఎల్ఆర్ తెలిపింది. ఈ కేసులో ప్రాథమిక విచారణపై నవంబర్ 11న కోర్టు నిర్ణయం వెలువరించాల్సి ఉంది. కోర్టు చర్యను బీవైడీ న్యాయవాదులు ఫిషింగ్ ఎక్స్‌పెడిషన్‌గా అభివర్ణించారు. అవ సరానికి మించి పెద్ద సంఖ్యలో ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారని వాదిం చారు. అయితే విచారణ ప్రక్రియకు బీవైడీ అడ్డంకులు సృష్టిస్తోందని జేఎల్ఆర్ తరఫు న్యాయవాదులు ఆరోపిం చారు. ఈ కేసు విచారణలో ఉండటంతో రెండు సంస్థలూ బహిరంగంగా స్పందిం చలేదు. బీవైడీకి చెందిన ఫాంగ్ చెంగ్ బావో బ్రాండ్ కింద ఈ ఎస్‌యూవీని 2025 సెప్టెం బరులో చైనా మార్కెట్లో బావో 7 పేరుతో విడుదల చేశారు. ఆ తర్వాత తాయ్ 7గా పేరు మార్చారు. బాక్సీ ఆకారం, నిటారుగా ఉండే ముందు భాగం, చతురస్రాకార వీల్ ఆర్చ్‌లు, వెనుక భాగంలో ప్రత్యేక స్టోరేజ్ వంటి డిజైన్ అంశాలు ల్యాండ్ రోవర్ డిఫెండర్‌ను పోలి ఉన్నాయనే చర్చ మొదటి నుంచీ ఉంది. అయితే జేఎల్ఆర్ అభ్యంతరం కేవలం డిజైన్‌కు పరిమితం కాలేదు. తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుమతి లేకుండా ఉపయోగించారన్నదే ప్రధాన ఆరోపణ. వచ్చే జనవరిలో బ్రిటన్ మార్కెట్లోకి టీ7 అడుగుపెట్టనుంది. ఏడు సీట్ల డిఫెండర్ 110తో పోలిస్తే తక్కువ ధరకు దీన్ని విక్రయించాలనేది బీవైడీ ప్రణాళిక. ఈ నేపథ్యంలో జేఎల్ఆర్ దాఖలు చేసిన కేసు ఆ సంస్థ అంతర్జాతీయ విస్తరణకు కీలక పరీక్షగా మారింది. గతంలోనూ చైనా సంస్థ జియాంగ్లింగ్ మోటార్ కార్పొరేషన్‌పై రేంజ్ రోవర్ ఎవోక్ డిజైన్ కాపీ ఆరోపణలతో జేఎల్ఆర్ న్యాయపోరాటం చేసింది. 2019లో ఆ కేసులో విజయం సాధించింది.

రెండోవారంలోనూ బులియన్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులే: రూ.5వేలు తగ్గిన కిలో వెండి



ముంబయి, నవంబరు 11: ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్తతలు సద్దు మణుగుతుండటం, డాలర్‌పై రూపాయి బలపడుతున్న ధోరణులతో బంగారం మార్కెట్ కూడా కుదుపులకు లోనవుతోంది. ఒక్కసారిగా పైకెగిసిన బంగారంధరలు రెండో వారంలో కొంత నెమ్మదిచాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల అనంతరం బులియన్ మార్కెట్లు కూడా ప్రకంపనలకు లోనయ్యాయి. బుధవారం దేశంలోని వివిధ మెట్రోనగరాల మార్కెట్లలో బులియన్‌ధరలు పరిశీలిస్తే పదిగ్రాముల బంగారం 710తగ్గి రూ.1,41,980వద్ద కొనసాగుతోంది. 22 క్యారట్ల బంగారం అయితే రూ.650 తగ్గి రూ.1,30,150వద్ద కొన సాగింది. 18 కేరట్ల బంగారం అయితే రూ.530 తగ్గి పదిగ్రా ములు రూ.1,06,490గా ధర లు పలికాయి. అలాగే చెన్నైలో కూడా 24 క్యారట్ల, 22 క్యారెట్ల బంగారం హైద రాబాద్ ధరల తోనే నడిచింది. 18 కేరట్లు మాత్రం రూ. 1,06,500గా నడిచింది. ముంబయినగరంలో కూడా అవేధరలు కొనసాగాయి. 18కేరట్ల బంగారం హైదరాబాద్ మార్కెట్‌తో సమాం తరంగా నడిచింది.రూ.1,06,490గా ఉంది. ఢిల్లీలో పదిగ్రాములు రూ.1,42,130వద్దట్రేడ్ అయితే 22 కేరట్ల బంగారం రూ.1,30,300గా ఉంది. 18కేరట్ల పదిగ్రాముల బంగారం రూ. 1,06,640గాఉంది. కోల్‌కత్తాలో అయితే రూ.1,41,980, రూ.1,30,150, 18 కేరెట్ల రూ.1,06, 490గా కొనసాగాయి. బెంగళూరు మార్కెట్‌లో అయితే అవే ధరలు కొనసాగాయి. ఇక వెండి మార్కెట్ పరంగామాస్తే ఒక్కరోజే కిలో ఒక్కింటికి ఐదువేల రూపాయలు తగ్గింది. కిలోవెండి హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ, చెన్నై,కోల్‌కత్తా,బెంగళూరునగరాల్లో రూ.2లక్షలుగా నమోద యింది. అంతర్జాతీయ మార్కెట్లలో కూడా బులియన్ ధరలు ప్రకం పనలు లోనయ్యాయి. ఎంసిఎక్స్‌లో డిసెంబరు నాటి సెటిల్‌మెంట్ ధరలు పదిగ్రాములు రూ.1,41,369గా నడిచింది.